సాక్షి 24|7

పెద్దపల్లి

శనివారం 6-1-2018

రెచ్చిపోతున్నారు..



కరీంనగర్ శివారులో ఇసుక డంప్‌ల వద్దకు అధికారులు వెళ్లకుండా పొక్లెయిన్‌తో తవ్విన కందకాలు(ఫైల్)

అధికారులను బైక్‌లపై వెంబడిస్తున్న ఇసుకమాఫియా(ఫైల్)

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఆగని ఇసుక దందా

- టీఎస్‌ఎండీసీ ముసుగులో అక్రమ రవాణా
- అడ్డుకుంటే బెదిరింపులు.. నేతలతో ఒత్తిళ్లు
- ఆర్డీవో, తహసీల్దారుస్థాయి అధికారులపైనా పలుమార్లు దాడులు
- ఐదేళ్లలో 50 మందికిపైగా ప్రమాదాల్లో దుర్మరణం
- అనధికారికంగా 39 క్వారీల ద్వారా ఇసుక రవాణా

సాక్షిప్రతినిధి, కరీంనగర్:

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఇసుక మాఫియా ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండా పోయింది. ఇసుక నుంచి కాసులు సంపాదిస్తున్న వ్యాపారులు పోలీసు దాడులకు వెరవడం లేదు. ప్రాజెక్టులు, భవనాలు, రహదారులు తదితర ప్రభుత్వ, ప్రైవేట్ అవసరాల కోసం తెలంగాణ రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ (టీఎస్‌ఎండీసీ) ప్రధాన నదీపరివాహక ప్రాంతాల్లో అధికారికంగా ఇసుక రీచ్‌లను నడుపుతోంది. ఉమ్మడి కరీంనగర్‌లో మహదేవ్‌పూర్, కుంతలం, కరీంనగర్, ఎరిసిల్ల, పెద్దపల్లి ప్రాంతాల్లో ఎనిమిది - మిగతా 2లో▸



‘ప్రజావాణి’తో ప్రారంభం

8న కొత్త కలెక్టర్ శ్రీదేవసేన బాధ్యతల స్వీకరణ

సాక్షి, పెద్దపల్లి:

ప్రజాసమస్యలు నేరుగా తెలుసుకొని పరిష్కరించే ప్రజావాణి కార్యక్రమంతో కొత్తకలెక్టర్ ఎ.శ్రీదేవసేన విధులు ప్రారంభించనున్నారు. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా భారీగా ఐఏఎస్‌ల బదిలీలు జరిగిన క్రమంలో జనగామ కలెక్టర్ ఎ.శ్రీదేవసేన పెద్దపల్లి కలెక్టర్‌గా బదిలీ అయిన విషయం తెలిసిందే. ఆమె విధుల్లో చేరడం ఆలస్యంగా కావడం ఒకింత ఆసక్తిని రేపింది. ఈ నెల 2న బదిలీ ఉత్తర్వులు వెలువడినా... ఇప్పటివరకు బాధ్యతలు తీసుకోకపోవడంతో రాజకీయ, ఉద్యోగ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ముందుగా ఈ నెల 3వ తేదీన విధుల్లో చేరుతారని ప్రచారం జరిగింది. ఆ తర్వాత శుక్రవారం బాధ్యతలు చేపడుతారని భావించారు. చివరకు కలెక్టర్‌గా శ్రీదేవసేన బాధ్యతలు స్వీకరించే ముహూర్తం ఖరారైంది. ఈ నెల 8న కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నట్లు పెద్దపల్లి ఆర్‌డీవో అశోక్‌కుమార్ తెలిపారు. విధుల్లోచేరి కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొంటారని వివరించారు. 8న దేవసేన విధుల్లో చేరనుండడంతో రకరకాల ప్రచారానికి తెరపడినట్లయింది.

ఉత్పత్తికి అష్టకష్టాలు!

లక్ష్యం చేరని బొగ్గు వెలికితీత



గోదావరిఖని(రామగుండం):

సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తి కోసం అష్టకష్టాలు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. 2017–18 ఆర్థిక సంవత్సరంలో 66.06 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యాన్ని నిర్దేశించగా.. గడిచిన తొమ్మిది నెలల్లో 41.99 మిలియన్ టన్నుల ఉత్పత్తి మాత్రమే చేయగలిగారు. ఇందులో భూగర్భ గనుల నుంచి 9.74 మిలియన్ టన్నులకు గాను 6.15 మిలియన్ టన్నులు, ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టుల ద్వారా 37.94 మిలియన్ టన్నులకు గాను 35.83 మిలియన్ టన్నుల - మిగతా 2లో▸

రీసైక్లింగ్ దందా

పేదల బియ్యం మింగుతున్న రైసుమిల్లర్లు



సాక్షిప్రతినిధి, కరీంనగర్:

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో రేషన్ బియ్యం రీసైక్లింగ్ దందా కొనసాగుతోంది. గతంలో పలుమార్లు చర్యలు చేపట్టినా కొందరు రైస్‌మిల్లర్ల తీరు మారడం లేదు. నిరుపేదల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం సబ్సిడీపై రేషన్ షాపుల ద్వారా రూపాయికే కిలో చొప్పున పంపిణీ చేస్తున్న బియ్యాన్ని స్వార్థపరులైన కొంత మంది మిల్లర్లు మింగి, అదే బియ్యాన్ని తిరిగి పౌరసరఫరాల శాఖకే అమ్మిన వైనం వెలుగులోకి వచ్చింది. ఉమ్మడి జిల్లా పరిధిలోని - మిగతా 2లో▸

‘అర్బన్ రెసిడెన్షియల్’ జాడేది? - 16లో▸

ఎత్తిపోతల కోసం ఆందోళన - 16లో▸

డీటీఎఫ్ డైరీ ఆవిష్కరించిన డీఈవో



డైరీని ఆవిష్కరిస్తున్న డీఈవో వెంకటేశ్వర్‌రావు

పెద్దపల్లి: డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్–2018 నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను డీఈవో వెంకటేశ్వర్‌రావు శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్యామ్, ప్రధాన కార్యదర్శి అశోక్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, రాజమౌళి, శ్రీధర్, తిరుపతి, కలీమ్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్పత్తికి అష్టకష్టాలు!

- 2017–18లో వార్షిక లక్ష్యం 66.06 మిలియన్ టన్నులు
- తొమ్మిది నెలల్లో వెలికితీసింది 41.99 మిలియన్ టన్నులే
- అయినా లక్ష్యానికి 5.80 మిలియన్ టన్నుల లోటు

▶మొదటిపేజీ తరువాయి

బొగ్గు ఉత్పత్తి మాత్రమే తీశారు. అంటే భూగర్భ గనుల ద్వారా 3.69 మిలియన్ టన్నులు, ఓసీపీల ద్వారా 2.11 మిలియన్ టన్నులతో కలిపి 5.80 మిలియన్ టన్నులలోటు ఏర్పడింది. ఈ లోటును భర్తీచేస్తూ మిగిలిన మూడు నెలల కాలంలో 24.07 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిని వెలికితీయాల్సిన క్లిష్టపరిస్థితి సింగరేణికి ఏర్పడింది.

అనుకూలంగా లేని పనిస్థలాలు..

సింగరేణిలోని భూగర్భ గనుల్లో బొగ్గు వెలికితీయడానికి అనుకూలంగా పనిస్థలాలులేవు. కొన్ని గనుల్లో అనుమతులు రాకపోగా.. మరికొన్ని గనుల్లో యంత్రాలకు మ రమ్మతులు కొనసాగుతున్నాయి. రామగుండం రీజియ న్‌లోని జీడీకే 11వ గనిలో నిరంతరంగా బొగ్గు వెలికితీయాల్సిన కంటిన్యూయస్ మైనర్ యంత్రానికి మరమ్మతులు పూర్తిచేసి ఇటీవలే గనిలోకి దింపారు. దీనికితోడు పలుగనుల్లో ఇసుక కొరత మూలంగా పనిస్థలా ల్లో బొగ్గును వెలికి తీసిన తర్వాత నింపేందుకు వీలులేకుండా ఏర్పడింది. దీంతో అసలు బొగ్గు ఉత్పత్తినే చేయడం లేదు. వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి నెలకొల్పిన అడ్రియాల ప్రాజెక్టులో సాంకేతికపరమైన సమస్యలతో కేవలం 19 శాతం మాత్రమే బొగ్గుఉత్పత్తి చేశారు. ఇలా భూగర్భ గనుల్లో బొగ్గు ఉత్పత్తికి ఇబ్బంది ఏర్పడుతుంది.

ఓపెన్‌కాస్ట్‌లలో కూడా ఇదే పరిస్థితి...

సింగరేణిలోని 17 ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టులలో కూడా బొగ్గు ఉత్పత్తి ఆశించిన మేరకు రావడం లేదు. తొమ్మి ది నెలల కాలంలో ఉత్పత్తి లక్ష్యం 37.94 మిలియన్ టన్నులు ఉండగా...35.83 మిలియన్ టన్నులే వెలికితీయడంతో ఇంకా 2.11 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లోటు ఏర్పడింది. వాస్తవంగా సింగరేణిలో ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టుల నుంచి లక్ష్యానికన్నా ఎక్కువ బొగ్గుఉత్పత్తి చేస్తే..వచ్చిన లాభాలను భూగర్భ గనుల నుంచి వచ్చే నష్టాలతో భర్తీచేస్తారు. కానీ... ఇప్పటి వరకు ఇటు భూగర్భ గనులతో పాటు ఓసీపీలలో కూడా బొగ్గు ఉత్పత్తి ఆశించిన మేరా రావడం లేదు.

మూడు ఏరియాలల్లోనే..

సింగరేణి వ్యాప్తంగా ఉన్న ఏరియాలలో బొగ్గు ఉత్పత్తిని పరిశీలిస్తే గడిచిన తొమ్మిది నెలల కాలంలో మూడు ఏరియాలలో మాత్రమే వంద శాతంకు పైగా ఉత్పత్తి సాధించారు. మణుగూరులో 103 శాతం, ఆర్జీ–3 ఏరియాలో 120 శాతం, బెల్లంపల్లిలో 104 శాతం బొగ్గును వెలికితీసారు. ఇక మిగిలిన కొత్తగూడెం ఏరియాలో 98 శాతం, ఇల్లందు ఏరియాలో 70 శాతం, ఆర్జీ–1 ఏరియాలో 95 శాతం, ఆర్జీ–2 ఏరియాలో 83 శాతం, భూపాలపల్లి ఏరియాలో 89 శాతం, మందమర్రి ఏరియాలో 54 శాతం, శ్రీరాంపూర్ ఏరియాలో 85 శాతం బొగ్గు ఉత్పత్తి చేశారు. సింగరేణిలో వివిధ కారణాలతో బొగ్గు ఉత్పత్తికి విఘాతం కలిగిన నేపథ్యంలో రాబోయే మూడు నెలలు కీలకంగా పనిచేయాల్సిన అవసరం ఏర్పడింది. ఇందు కోసం యాజమాన్యం కార్మికులు, ఉద్యోగులు, అధికారుల కోసం ప్రత్యేకంగా ఇన్సెంటివ్ పథకాన్ని అమలు చేస్తోంది. ముఖ్యంగా ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టుల ద్వారానే అధికంగా బొగ్గు ఉత్పత్తి చేయాల్సి ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు..

▶మొదటిపేజీ తరువాయి

రెచ్చిపోతున్నారు..

క్వారీలకు అనుమతి ఇచ్చింది. అయితే.. కరీంనగర్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల్లో 39 క్వారీలు అనధికారికంగా నిర్వహిస్తుండగా.. రోజుకు వందల లారీల ఇసుక హైదరాబాద్ తదితర ప్రాంతాలకు అక్రమంగా తరలుతోంది. వేలాది ట్రాక్టర్లు ఉమ్మడి జిల్లాల్లో అసవరమున్న ప్రతి ఒక్కరికీ 'నిఘా' పేరిట రేట్లు దందా చేస్తున్నారు. ఐదేళ్లలో కేవలం ఇసుక ట్రాక్టర్లు, లారీలు ఢీకొట్టిన ప్రమాదాల్లో 50 మందికి పైగా సామాన్య ప్రజలు ప్రాణాలు వదిలారు. అడ్డుకున్న ఆర్‌డీవో, తహసీల్దారు స్థాయి అధికారులపైనా 'మాఫియా' దాడులకు దిగిన సందర్భాలూ గతంలో ఉన్నాయి. టీఎస్ఎండీసీ ముసుగులో అనుమతి పొందిన క్వారీల నిర్వాహకులు పెద్ద మొత్తంలో ఇసుకను అక్రమమార్గం పట్టిస్తుండగా, 39 వాగులు, వంకల నుంచి ఇసుకను అక్రమార్కులు తోడేస్తున్నారు.

ఎక్కడ పడితే అక్కడ నుంచి ఇసుక దందా.. వాగులను తోడేస్తున్న ఇసుకాసురులు..

ఉమ్మడి జిల్లాలో అనుమతి ఉన్న క్వారీలతోపాటు, అనధికార 39 కేంద్రాల నుంచి అక్రమంగా ప్రతిరోజూ 2000 నుంచి 2,500 ట్రాక్టర్లు, 400 నుంచి 500 లారీల ఇసుక యథేచ్ఛగా హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, సిద్దిపేట ప్రాంతాలతో సహా జిల్లా వ్యాప్తంగా రవాణా చేస్తున్నారు. ఇందుకు గాను ఇసుకను రవాణా చేస్తున్న ప్రతీ కేంద్రం నుంచి ట్రాక్టర్లు, లారీల సంఖ్యను బట్టి నెలకు రెవెన్యూ, పోలీసు శాఖలకు కొందరికి పెద్ద మొత్తంలో మామూళ్లు అందుతున్నాయన్న ప్రచారం ఉంది. అందువల్లే కళ్లముందే ఇసుక అక్రమ దందా సాగుతున్నా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఆమ్యామ్యాలను కొన్ని జిల్లాల్లో అరికట్టాల్సిన శాఖలకు చెందిన అన్ని స్థాయిల్లోని అధికారులు పంచుకుంటున్నారన్న విమర్శలు కూడా ఉన్నాయి. కరీంనగర్ మండలంలోని ఖాజీపూర్, ఎలగందల్, తిమ్మాపూర్ ప్రాంతాల్లో మానేరు వాగు నుంచి హైదరాబాద్, కరీంనగర్ ప్రాంతాలకు ఒక్కో సెంటర్ నుంచి 100 ట్రాక్టర్లు, 50 లారీల ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. అదేవిధంగా సిరిసిల్ల మండలంలోని తంగళ్లపల్లి మానేరు వాగు నుంచి హైదరాబాద్, సిద్దిపేటలకు ప్రతిరోజూ పెద్దమొత్తంలో ఇసుకను లారీల ద్వారా తరలిస్తున్నారు. వేములవాడలోని మూలవాగు, ధర్మపురి మండలంలోని రాయపట్నం, స్తంభంపల్లి, పార్సిగామ, ధర్మపురి, రామయ్యపల్లి, ఆరెపల్లిల నుంచి, జమ్మికుంట మండలంలోని సనుగుల, నగరం గ్రామాల నుంచి వీణవంక మండలంలోని చల్లూరు వాగు నుంచి, మంథని ప్రాంతంలోని ఉప్పట్ల, గుంజపడుగు, గోదావరిఖని ప్రాంతంలోని పొట్యాల, గొలివాడ, లింగాపూర్, ఇల్లంతకుంట మండలంలోని కందికట్కూర్, పొత్తూరు, సరిహద్దు ప్రాంతమైన సిరికొండ, తెనుగువారిపల్లె గుట్టల్లో నుంచి అక్రమంగా ఇసుక రవాణాను చేస్తున్నారు. శంకరపట్నం మండలం గద్దపాక నుంచి ఇసుక అక్రమ రవాణా అవుతోంది.

అడ్డుకుంటే బెదిరింపులు, దాడులు.. ఉమ్మడి జిల్లాలో అనేక సంఘటనలు..

ఇసుకదందాకు అలవాటు పడిన 'మాఫియా'ను అడ్డుకుంటే బెదిరింపులు, ఒత్తిళ్లతోపాటు ఆర్‌డీవో, తహసీల్దారు స్థాయి అధికారులపై దాడులు, దుర్శేడులో ఒకరిని ట్రాక్టర్‌తో ఢీకొట్టి చంపిన సంఘటనలు గతంలో ఉన్నాయి.

- కరీంనగర్ మండలంలోని దుర్శేడ్‌లో ఇసుక ట్రాక్టర్లను అడ్డుకోవడానికి ప్రయత్నించగా అదే గ్రామానికి చెందిన న్యాలకొండ కుమార్(26) అనే వ్యక్తిని ఇసుక ట్రాక్టర్‌తో ఢీకొట్టి చంపారు.
- గతంలో బోయినపల్లి, మాన్వాడ, మాల్లాపూర్‌లను నుంచి ఇసుక రవాణా సమాచారంతో అప్పటి సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు దాడి చేశారు.
- బావుపేట వద్ద పెద్దఎత్తున ట్రాక్టర్లు, లారీలు పట్టుకుని ఠాణాకు తరలిస్తుండగా వెంకట్రావుపల్లి వద్ద అడ్డుకుని ఏకంగా ఆర్డీవోను నిర్బంధించారు. వెంటనే పోలీసులు సకాలంలో చేరుకుని ఆర్డీవోను విడిపించారు.
- ఖాజీపూర్‌లో ఇసుక ట్రాక్టర్లను పట్టుకోవడానికి వెళ్లగా వారిని చూసిన డ్రైవర్లు తప్పించుకునే క్రమంలో బోల్తా పడి ఒకరు మృతి చెందారు.
- గతంలో కరీంనగర్ తహసీల్దార్ తన సిబ్బందితో ఖాజీపూర్ వాగులో ఇసుక ట్రాక్టర్లు పట్టుకుని కరీంనగర్ వస్తుండగా మోటార్ సైకిళ్లపై వెంబడిస్తూ భయానకంగా ప్రవర్తించగా, చివరకు ఫిర్యాదు వరకు వెళ్లింది.
- ఇసుక లోడ్‌తో ఉన్న ట్రాక్టరును పట్టుకున్నందుకు ఓ వీఆర్వోను చితకబాదారు.
- కరీంనగర్ ఆర్డీవోగా పనిచేసిన హైమావతి తనిఖీలకు వెళ్లిన సమయంలో ట్రాక్టరు యజమానులు, డ్రైవర్లు ఎదురుతిరిగి అడ్డుకోవడంతో అధికారుల ఫిర్యాదు మేరకు 20 మందిపై కేసు నమోదు చేశారు.
- బోయినపల్లి మండలంలో ఇసుక మాఫియా మధ్య తలెత్తిన వివాదంతో ఓ వ్యక్తి హత్యకు గురయ్యాడు.
- సిరిసిల్ల మండలం సారంపల్లి వద్ద మైనింగ్ ఏడీ తన సిబ్బందితో 18 ట్రాక్టర్లు పట్టుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చే సరికి ఆలస్యం కావడంతో సిబ్బందిపై దాడి చేసి ట్రాక్టర్లు పట్టుకెళ్లారు.
- బోయినిపల్లి మండలంలోని కొదురుపాక వాగులో ఇసుక తరలిస్తున్న సమాచారంతో పోలీసులు దాడి చేయగా ట్రాక్టర్ యజమానులు పోలీసులపై దాడికి యత్నించడంతో వారు తుపాకులు ఎక్కుపెట్టాల్సి వచ్చింది.
- నేరెళ్లలో ఇసుక వివాదం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం కలిగించిన సంగతి తెలిసిందే.

రీసైక్లింగ్ దందా

- పేదల బియ్యాన్ని తిరిగి ప్రభుత్వానికే అమ్ముతున్న వైనం
- పౌరసరఫరాల శాఖ తనిఖీల్లో వెలుగులోకి
- రాజన్న సిరిసిల్ల దాడుల్లో వెల్లడైన నిజాలు
- కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాలల్లో తనిఖీలు
- అక్రమార్కులను వదలొద్దని సీవీ ఆనంద్ ఆదేశం

▶మొదటిపేజీ తరువాయి

కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లిలో ఈ దందా నిర్విరామంగా కొనసాగుతోంది. ఇటీవల రాజన్న సిరిసిల్ల జిల్లాలో నాణ్యత లేని సన్న బియ్యాన్ని ప్రభుత్వానికి సరఫరా చేస్తున్నారన్న విషయం వెలుగులోకి వచ్చింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 10 శాతానికి మించి బ్రోకెన్ రైస్ ఉండకూడదు. కానీ.. ఇక్కడ 35 శాతం వరకు ఉండడం గమనార్హం. ఒక్కో ఏసీకే (లారీ)లో 400 నుంచి 500 బస్తాలు పంపించే మిల్లర్లు, అందులో సగం వరకు రీసైక్లింగ్ బియ్యం కలిపేశారు. పౌరసరఫరాల శాఖ ప్రత్యేక విభాగం జరిపిన తనిఖీల్లో ఏసీకే నంబర్లు 131, 136, 137, 149, 163, 165లలో 1080 బస్తాలు తేలాయి. ఇదే పద్ధతిలో రాజన్న సిరిసిల్ల జిల్లా నుంచి సరఫరా చేసిన 11 వేల బస్తాలలో 35 శాతం మేరకు బ్రోకెన్ రైస్ ఉందని వెల్లడికాగా, కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల్లో ఇంకా తనిఖీలు కొనసాగుతున్నాయి.

గోదాముల్లోనూ తనిఖీలు.. బయడపడుతున్న అక్రమాలు.. అక్రమార్కులపై కొరడా..

ప్రజాపంపిణీ అవసరాల మేరకు ప్రభుత్వం దగ్గర సరి పడినన్ని బియ్యం నిల్వలు లేకపోవడంతో ఏటా మిల్లర్ల నుంచి 6 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు బియ్యాన్ని, ప్రభుత్వ వసతిగృహాలు, మధ్యాహ్న భోజనం పథకం కోసం 1.5 లక్షల మెట్రిక్ టన్నుల సన్నబియ్యాన్ని మిల్లర్ల నుంచి కొనుగోలు చేస్తోంది. ప్రభుత్వ అవసరాన్ని ఆసరాగా చేసుకుని రేషన్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి తిరిగి ప్రభుత్వానికే అప్పగిస్తున్న అక్రమార్కులపై పౌరసరఫరాల శాఖ కొరడా ఝుళిపిస్తోంది. మరోసారి పునరావృతం అయితే బ్లాక్‌లిస్టులో పెట్టేందుకు ఆ శాఖ సిద్ధమవుతోంది. ఇప్పటికే రాజన్న సిరిసిల్ల జిల్లా నుంచి సరఫరా అయిన 11 వేల బియ్యం బస్తాల స్థానంలో ప్రమాణాల ప్రకారం నాణ్యత కలిగిన బియ్యాన్ని ఇవ్వాలని మిల్లర్లను ఆదేశించింది. ఇకపై రైసుమిలర్లు ఎలాంటి అవకతవకలకు పాల్పడినా ఏ మాత్రం ఉపేక్షించేది లేదని, చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించింది. ఇదిలా వుండగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పౌరసరఫరాల సంస్థకు సంబంధించిన బియ్యం నిల్వలు ఉన్న సీడబ్ల్యూసీ, ఎస్ డబ్ల్యూసీ తదితర అన్ని గోదాముల్లో నిఘా బృందాలు, సాంకేతిక సిబ్బందితో ప్రత్యేక తనిఖీలు కొనసాగించా లని పౌరసరఫరాలశాఖ కమిషనర్ సీవీ ఆనంద్ సం బంధిత అధికారులను ఆదేశించారు. అక్రమాలకు పా ల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేయడమే కాకుండా పీడీ యాక్టు కింద కేసు నమోదు చేసి జైలుకు పంపిం చేందుకు కసరత్తు చేస్తోంది. ప్రధాన సూత్రదారులైన రైస్‌మిల్లర్లపై కఠిన చర్యలు చేపట్టడంతోపాటు ఈ మొత్తం వ్యవహారంలో కీలక సూత్రదారులైన కొంత మంది రైస్‌మిల్లర్లను బ్లాక్‌లిస్టులో పెట్టే యోచనలో పౌరసరఫరాలశాఖ ఉంది.

రేషన్ బియ్యం రీసైక్లింగ్ చేస్తే క్రిమినల్ కేసులు.. పౌరసరఫరాలశాఖ కమిషనర్ ఆదేశం..

పేదల బియ్యాన్ని దిగమింగడానికి ప్రయత్నం చేస్తే సహించవద్దని పౌరసరఫరాలశాఖ అధికారులకు ఆ శాఖ కమిషనర్ సీవీ ఆనంద్ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. 'అక్రమాలకు పాల్పడుతున్న రైస్ మిలర్ల మిల్లింగ్, తదితర చార్జీలు నిలిపివేస్తాం.. పౌరసరఫరాల శాఖ, మిల్లర్ల మధ్య ఒక నమ్మకం, సమన్వయంతో కలిసి పనిచేస్తున్నప్పుడు, మళ్లీ పాత తప్పులనే పునరావృతం చేయడం, మోసాలకు పాల్పడడం, సహించరాని నేరం'

అని ఆయన ఆ ఆదేశాల్లో పేర్కొన్నారు. రీసైక్లింగ్ జరిగి పట్టుబడ్డ చోట ఆ రేషన్ బియ్యం ఎక్కడ నుంచి వచ్చాయనే దానిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపిస్తున్నామని, రేషన్ బియ్యం రీసైక్లింగ్ చేసి తిరిగి ప్రభుత్వానికి అప్పగిస్తున్న మిల్లర్లపై క్రిమినల్ కేసులతోపాటు మిల్లులను సీజ్ చేయడానికి ఏ మాత్రం వెనుకాడవద్దని ఆయన అధికారులను ఆదేశించారు.

మాజీ ఏఎస్సై మోహన్‌రెడ్డిపై మరో కేసు

- కొనసాగుతున్న ఫిర్యాదుల పరంపర
- గట్టయ్యకు ఆస్తుల రిజిస్ట్రేషన్‌కు ముందుకు
- ఏసీబీ కేసుతో ముందుకు వచ్చిన బినామీ..
- కరీంనగర్ జైల్లో అక్రమ ములాఖత్‌పైనా విచారణ

సాక్షిప్రతినిధి, కరీంనగర్:

కరీంనగర్ జిల్లాకు చెందిన మాజీ ఏఎస్సై బొబ్బల మోహన్‌రెడ్డిపై ఫిర్యాదుల పరంపర పెరుగుతోంది. అక్రమ వడ్డీ వ్యాపారం, తదనంతరం చోటు చేసుకున్న పరిణామాలపై లోతుగా విచారణ జ రుగుతోంది. అధికారం అడ్డుపెట్టుకుని ఏళ్ల తరబడిగా సాగించిన పాపాల పుట్ట పగులుతోంది. గురువారం పోతర్ల గట్టయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్పందించిన అవినీతి నిరోధక శాఖ అడిషనల్ ఎస్పీ టి.సుదర్శన్ మోహన్‌రెడ్డితోపాటు ఏడుగురిపై కేసు నమోదు చేశారు. 'తల్లి కర్మకాండలకు సైతం హాజరు కానివ్వలేదన్న' గట్ట య్య ఆవేదనపై పోలీసు ఉన్నతాధికారులు స్పందించారు. ఈ నేపథ్యంలో ఫిర్యాదులు అందితే చాలు కేసులు నమోదు చేయాలని పోలీసుస్టేషన్ ఎస్‌హెచ్‌వోకు ఆదేశాలు అందగా, శుక్రవారం కరీంనగర్ టౌన్‌కు చెందిన ఓ ఇన్‌స్పెక్టర్ కొందరు బాధితులను పిలిచి మా ట్లాడారు. కాగా.. తాజాగా కరీంనగర్ నగరం కట్టరాంపూర్‌కు చెందిన నాగమల్ల వెంకటనర్సయ్య అనే బాధితుడి నుంచి ఇల్లు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్న ఫిర్యాదుపై ఏసీబీ అధికారులు మరో కేసు నమోదు చేయడం చర్చనీయాంశంగా మారింది. ఇదిలా ఉంటే ఏసీబీ అధికారుల చొరవ మేరకు పోతర్ల గట్టయ్యకు చెందిన ఇంటిని రిజిస్ట్రేషన్ చేయించుకున్న బినామీ సబిత ముందుకు రాగా, శనివారం గట్టయ్య పేరిట చేయనున్నారు. మాజీ ఏఎస్ఐ మోహన్ రెడ్డిపై ఇప్పటికే 56కు పైగా కేసులు నమోదయ్యాయి. కాగా కరీంనగర్ జైల్లో అక్రమ ములాఖత్‌లకు సంబంధించి బయటకు వచ్చిన వీడియో క్లిప్పింగ్ ఆధారంగా విచారణ జరుగుతోంది. కరీంనగర్ జిల్లా కారాగారం నుంచి 60 రోజులకు సంబంధించిన సీసీ కెమెరా ఫుటేజీని స్వాధీనం చేసుకున్న విచారణ అధికారి నివేదిక సిద్ధం చేసినట్లు తెలిసింది. కరీంనగర్ జైల్లో 50–70 సార్లు అక్రమ ములాఖత్‌లు జరిగినట్లు ప్రచారం జరుగుతోంది.

రూపాయి.. రూపాయి.. కూడబెట్టుకుని జీవితంలో స్థిర పడేందుకు కొందరు చిట్టీలు వేస్తుంటారు. మరి కొందరు అవసరాల నిమిత్తం ఫైనాన్స్ తీసుకుంటారు. ఇలాంటి వారిని ఆసరాగా చేసుకుని కొందరు మోసగాళ్లు జోరుగా దందా సాగిస్తున్నారు. నాలుగు డబ్బులు చేతికొచ్చాక జెండా ఎత్తేస్తున్నారు. ఈ దందాలో ప్రభుత్వ ఉద్యోగులు సైతం పాలుపంచుకుంటున్నారు. విధులకు ఎగనామం పెట్టి వ్యాపారంపై దృష్టి సారిస్తున్నారు.

- జోరుగా చిట్టీలు, స్కీంల దందా
- మోసాలతో కుదేలవుతున్న ప్రజలు
- నియంత్రణలో అధికారుల ఉదాసీనత
- కోట్ల రూపాయలతో పరారవుతున్న కేటుగాళ్లు
- దందాలో ఉపాధ్యాయులే అధికం



లక్కీ చాన్స్..!

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): లక్కీస్కీంలు, ఫైనాన్స్‌లు, చిట్టీల పేరుతో ప్రజల నెత్తిన మోసగాళ్లు శఠగోపం పెడుతున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లావ్యాప్తంగా అనుమతి లేని లక్కీస్కీంలు, చిట్టీలు, ఫైనాన్స్‌ల వ్యాపారం జోరుగా సాగుతోంది. అనుమతి లేని కొన్ని దందాలను పోలీసులు నిలువరించినప్పటికీ, చిట్టీలు, ఫైనాన్స్ వ్యాపారాలు గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్నాయి. ప్రజల అమయాకత్వాన్ని, అవసరాలను ఆసరాగా చేసుకుంటున్న కొందరు వారివద్ద పోగు చేసిన సొమ్ముతో ఉడాయిస్తున్నారు.

జిల్లాలో వరుస ఘటనలు..

జిల్లాలోని పలు ప్రాంతాల్లో వరుస ఘటనలతో వ్యాపారాలపై నమ్మకం లేకుండా పోతోంది. సిరిసిల్ల పట్టణంలో రెండు నెలల వ్యవధిలో ఇద్దరు వ్యాపారులు కోట్ల రూపాయలను చిట్టీలు, ఫైనాన్స్‌ల పేరిట వసూలు చేసి పరారయ్యారు. తాజాగా ఎల్లారెడ్డిపేట మండలం రాచ ర్ల గొల్లపల్లి నుంచి బండగౌతమ్ రూ. 4కోట్లు, ఎల్లారెడ్డిపేట నుంచి ఓ ఫైనాన్స్ నిర్వాహకుడు రూ.1.20 కోట్లతో పారిపోయాడు. దీంతో ప్రజలు అవసరాల కోసం చిట్టీలు, ఫైనాన్స్‌లో డబ్బులు దాచుకోవడానికి జంకుతున్నారు. ఎల్లారెడ్డిపేటలో ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు కొంత కాలంగా చిట్టీల వ్యాపారాన్ని కొనసాగించగా.. తాహత్తుకు మించి చిట్టీలు నడపడంతో దివాళా తీశాడు.

ఉపాధ్యాయులే అధికం..

చిట్టీల నిర్వాహణలో ప్రభుత్వ ఉపాధ్యాయులే అధికంగా ఉన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో సుమారు 360మంది ఉపాధ్యాయులు చిట్టీలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. రూ. 3రూపాయల కమీషన్ పద్ధతిలో చిట్టీలు నిర్వహిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. చిట్టి కట్టే స్థోమత లేని వారితో వ్యాపారం చేస్తూ వారు డబ్బులు ఎగ్గొట్టడంతో మిగిలినవి వెనకేసుకుని చిట్టి వ్యాపారులు జనాన్ని మోసం చేస్తున్నారు.

జోరుగా లక్కీ స్కీంలు..

వేములవాడ, ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, సిరిసిల్ల ప్రాంతాల్లో లక్కీడ్రా వ్యాపారం జోరుగా జరుగుతుంది. కొన్ని లక్కీస్కీంలపై ఎస్పీ విశ్వజిత్ కంపాటి ఉక్కుపాదం మోపారు. జనాన్ని నమ్మించి ఎంటర్ ప్రైజేస్‌లు ఏర్పాటు చేసుకొని నెలనెల డబ్బులు కట్టించుకున్న వారు పోలీసుల ఆదేశాలతో డబ్బులను లక్కీస్కీంల్లో చేరిన వారికి తిరిగి ఇచ్చారు. కాగా వీర్నపల్లి మండలం మద్దిమల్ల, గర్జనపల్లి కేంద్రాలుగా లక్కీస్కీంలు ఇంకా నడుస్తున్నాయనే ఆరోపణలు ఉన్నాయి.

చర్యలు తప్పవు



అనుమతులు లేకుండా జనాలను మోసం చేసే నెలసరి చిట్టీలు, ఫైనాన్స్, లక్కీస్కీం దందాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ఇలాంటి దందాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. కొత్త వ్యక్తులకు నమ్మి డబ్బులు అప్పుగా ఇవ్వవద్దు.

– రవీందర్, సీఐ, ఎల్లారెడ్డిపేట

పైకి ఫిర్యాదు చేశాం..



ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల్లో ప్రభుత్వ ఉపాధ్యాయులు నెలసరి చిట్టీలు చేస్తున్న విషయం వాస్తవమే. వీరిపై ఇటీవలే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాం. కొందరు విధులకు హాజరుకాకుండా చిట్టీలు, ఫైనాన్స్ దందాలపైనే దృష్టి పెడుతున్నారు. వారి జాబితా తయారు చేస్తున్నాం.

– మంకు రాజయ్య, ఎంఈవో, ఎల్లారెడ్డిపేట

చిట్టీల వ్యాపారంపై ఎస్పీ ఆరా..

జిల్లాలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న నెలసరి చిట్టీలు, లక్కీ స్కీంలు, ఫైనాన్స్ దందాలపై ఎస్పీ ఆరా తీస్తున్నారు. ఇటీవల స్పెషల్‌బ్రాంచి పోలీసులు ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి ప్రాంతాల్లో అనుమతులు లేని దందాలపై కూపీ లాగారు.

మహిళ మృతిపై ఆందోళన

- అదనపు కట్నం కోసమే హత్య చేశారని ఆరోపణ

కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖనిలో ఇండ్ల మౌనిక (24) గురువారం రాత్రి మృతిచెందిన ఘటనపై ఆమె తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. అత్తింటివారే అదనపు కట్నం కోసం చంపి ఆత్మహత్య చేసుకున్నట్లు చిత్రీకరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గోదావరిఖని ఇందిరానగర్‌కు చెందిన ఇండ్ల సతీష్ అనే ట్రాలీ డ్రైవర్‌తో నాలుగేళ్ల క్రితం మౌనికకు వివాహం జరిగింది. ప్రస్తుతం వీరికి 11 నెలల బాబు ఉన్నాడు. అయితే గురువారం మౌనిక ఆత్మహత్య చేసుకుందని సతీష్ మౌనిక తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చాడు. మౌనిక లుంగీతో ఉరివేసుకుని ఉండడంపై అనుమానాలు వ్యక్తం చేసిన తల్లిదండ్రులు అత్తమామలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పెళ్లి సందర్భంగా రూ.4 లక్షలు కట్నం ఇచ్చి ఆ తర్వాత రూ.20 లక్షలు అదనపు కట్నం కింద ఇచ్చామని, నేడు మరో రూ.10 లక్షలు కావాలంటూ తన బిడ్డను భర్త సతీష్, అత్త చంద్రకళ, మామ కేశవులు హత్యచేశారని ఆరోపించారు. విషయం తెలుసుకున్న ఏసీపీ అపూర్వరావు, వన్‌టౌన్ సీఐ జి.కృష్ణ సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతురాలి తండ్రి సుధాకర్ ఫిర్యాదు మేరకు భర్త, అత్తామామపై కేసు నమోదు చేశారు.

అనారోగ్యంతో వలసజీవి మృతి

ధర్మపురి: బతుకుదెరువు కోసం పొరుగురాష్ట్రం వెళ్లిన వ్యక్తి రెండుకిడ్నీలు చెడిపోయి మృతి చెందాడు. ఈ ఘటన ఒడిశారాష్ట్రంలో జరగగా.. ధర్మపురిలో విషాదం నింపింది. ధర్మపురికి చెందిన నల్లెల్ల అంజయ్య అలియాస్ సత్యం (50) బతుకుదెరువుకు ఒరిస్సా రాష్ట్రంలోని రాంకెల్లా జిల్లాకు వెళ్లాడు. 8 సంవత్సరాల నుంచి అక్కడి మైన్స్‌లో పని చేస్తున్నాడు. అప్పుడప్పుడు ఇక్కడికి వచ్చి వెళ్లేవాడు. కొంత కాలంగా నడుం నొప్పితో బాధపడుతున్నాడు. వైద్యుల వద్దకు వెళ్లగా.. రెండు కిడ్నీలు చెడిపోయాయని తెలిపారు. మూడు రోజుల క్రితం నడుం నొప్పి తీవ్రమై మృతిచెందాడు. విషయం తెలుసుకున్న స్నేహితులు ఒడిశాకు వెళ్లారు. మృతుడికి భార్య లక్ష్మి, కొడుకు, కూతురు ఉన్నారు.

లైంగికదాడి నిందితులు అరెస్ట్



నిందితులను అరెస్ట్ చూపుతున్న ఏసీపీ

సుల్తానాబాద్(పెద్దపల్లి): సుల్తానాబాద్‌లోని మార్కండేయకాలనీకి చెందిన బాలికపై లైంగిక దాడి చేసిన పెద్ది నగేశ్, సహకరించిన బండి శ్రీనివాస్‌ను శుక్రవారం పోలీసులు అరెస్ట్ చేశా రు. పెద్దపల్లి ఏసీపీ హబీబ్‌ఖాన్ వివరాలు వెల్లడించారు. నాలుగు రోజుల క్రితం సుల్తానాబా ద్‌లోని బాలిక కనుకుల గుట్టల వద్ద కట్టెలకు వెళ్లింది. అటుగా కారులో వెళ్తున్న కదంబాపూర్ గ్రామానికి చెందిన పెద్ది నగేశ్, శ్రీనివాస్ ఒంటరిగా ఉన్న బాలిక దగ్గరకు వెళ్లారు. మాయమాటలు చెప్పి, కూల్‌డ్రింక్‌లో నిద్రమాత్రలు కలిపిఇచ్చారు. తరువాత నగేశ్ బాలికపై లైంగికదాడి చేశాడు. శ్రీనివాస్ సెల్‌ఫోన్లో చిత్రీకరించాడు. ఆ చిత్రాలు బాలిక సోదరుడి సెల్‌కు వెళ్లడంతో మూడు రోజుల క్రితం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు ఇద్దరిని అరెస్ట్ చేశారు.సెల్‌ఫోన్, కారును సీజ్ చేశారు. వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఏసీపీ తెలిపారు. బాలికను వైద్య పరీక్షలకు వరంగల్ ఎంజీఎంకు తరలించారు.

హత్యకేసులో నిందితుడి ఇంటికి నిప్పు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఓ వ్యక్తిని భూవివాదాల కారణంగా దారుణంగా కొట్టి చంపిన నిందితుడి ఇంటికి గుర్తుతెలియని వ్యక్తులు శుక్రవారం వేకువజామున నిప్పంటించారు. వీర్నపల్లి మండలం గర్జనపల్లిలో గత నెల 15న పసుల నర్సయ్యను భూవివాదంతో అదే గ్రామానికి చెందిన లింగంపల్లి లచ్చయ్య కొట్టి చంపా డు. ప్రస్తుతం కరీంనగర్ జైల్లో ఉన్నాడు. పది రోజుల క్రితం మృతుడి భార్య లక్ష్మితో సహా గ్రామస్తులు ఎల్లారెడ్డిపేట సర్కిల్ కార్యాలయానికి వచ్చి లచ్చయ్యకు బెయిల్ ఇవ్వకుండా చూడాలని సీఐ రవీందర్‌ను కోరారు. ఈ నేపథ్యంలోనే లచ్చయ్య ఇంటికి నిప్పు పెట్ట డం చర్చానీయాంశంగా మారింది. సీఐ రవీందర్, ఎస్సై నరేశ్‌కుమార్ కేసు నమోదు చేశారు.

లారీ, బైక్ ఢీకొని ఒకరు మృతి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం బందంపల్లి గ్రామ శివారులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పిడుగు తిరుపతి(26) దుర్మరణం పాలయ్యాడు. అప్పన్నపేట గ్రామానికి చెందిన తిరుపతి పని నిమిత్తం పెద్దపల్లికి వచ్చి ఇంటికి వెళ్తుండగా వెనకనుంచి వచ్చిన లారీ ఢీకొట్టింది. దీంతో అక్కడికక్కడే మరణించాడు. వ్యవసాయపనులు చేసుకుని జీవనం సాగించే తిరుపతికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వాతావరణం

రానున్న 24 గంటల్లో పంజాబ్ నుంచి పశ్చిమబెంగాల్ మధ్య ప్రాంతాల్లో దట్టమైన పొగమంచు కమ్ముకుని ఉంటుంది. అండమాన్, నికోబార్ దీవుల్లో మోస్తరు వర్షం కురుస్తుంది. కేరళలో చెదురుమదురు వాన పడే అవకాశం ఉంది. రాజస్తాన్, మధ్యప్రదేశ్‌లలో చల్లని ఈదురు గాలు వీసే అవకాశం ఉంది.

పట్టణ వాతావరణం

పట్టణం/జిల్లా	గరిష్ట/కనిష్ట	పట్టణం/జిల్లా	గరిష్ట/కనిష్ట
ఒంగోలు	31.3/20.1	తిరుపతి	29.9/14.2
కర్నూలు	31.2/18.1	విజయవాడ	29.7/17.0
మహబూబ్‌నగర్	31.2/16.6	ఏలూరు	29.6/19.0
కడప	31.1/15.5	రాజమండ్రి	29.6/19.0
ఖమ్మం	31.0/10.4	తాడేపల్లిగూడెం	29.6/19.0
ఆదిలాబాద్	31.0/06.0	నల్లగొండ	29.6/15.2
అనంతపురం	30.7/16.2	కరీంనగర్	29.6/10.7
నెల్లూరు	30.6/20.8	హైదరాబాద్	29.4/13.3
నిజామాబాద్	30.5/15.5	రంగారెడ్డి	29.4/13.3
మెదక్	30.5/11.0	కాకినాడ	29.0/18.4
వరంగల్	30.2/14.0	విశాఖపట్నం	28.2/19.2
గుంటూరు	30.0/16.2	శ్రీకాకుళం	27.7/15.5
చిత్తూరు	29.9/14.2	విజయనగరం	27.7/15.5

గుంటూరు/కరీంనగర్ వాతావరణం

గరిష్టం కనిష్టం

[illegible]

జాతీయం

నగరం	గరిష్ట	కనిష్ట
ఢిల్లీ	18.1	07.2
కోల్‌కతా	22.3	11.1
బెంగళూరు	27.2	15.5
ముంబై	29.6	16.8
చెన్నై	29.5	20.5

బుల్లితెర

W

సాక్షి SAKSHI TV


ఉ. 07.00 గంటల నుండి ప్రతి గంటకు సాక్షి న్యూస్ బులెటిన్

ఉ.06.30 గుడ్ మార్నింగ్
ఉ.07.30 కేఎస్ఆర్ లైవ్ షో
ఉ.08.00 న్యూస్ ఫీచర్
ఉ.08.30 రీజనల్ న్యూస్
ఉ.09.30 మ్యాగజీన్ స్టోరీ
ఉ.10.30 న్యూస్ ఫీచర్
ఉ.11.30 పొలిటికల్ కారిడార్
మ.12.00 మూవీ మ్యాటర్స్
సా.04.30 మార్గం
సా.05.00 స్పీడ్ న్యూస్
సా.05.30 ఉర్దూ న్యూస్
సా.06.00 రీజనల్ న్యూస్
రా.08.00 సాక్షి న్యూస్
రా.08.30 బతుకు చిత్రం
రా.09.00 న్యూస్ 360
రా.09.30 జ్యాక్ బాక్స్
రా.10.30 మూవీ మ్యాటర్స్

టీవీలో ఈరోజు సినిమాలు




జెమిని మూవీస్
ఉ.07.00 సిరి సిరి మువ్వ
ఉ.09.30 సీతాకోకచిలుక
మ.12.00 రణధీర
సా.06.00 పెళ్లాంతో పనేంటి
రా.09.00 అదృష్టం



మూవీస్ నౌ
ఉ.10.20 శాన్ ఆండ్రియాస్
మ.12.35 క్యాసినో రాయల్
మ.03.30 ద యాక్సిడెంటల్ స్పై
సా.05.15 ఎపిక్ మూవీ
రా.09.00 జర్నీ 2



హెచ్‌బీవో
ఉ.07.28 ఆల్మోస్ట్ హీరోస్
ఉ.10.41 కొల్లాటరల్ బ్యూటీ
మ.12.27 ద డార్క్ నైట్ రైజెస్
సా.05.16 పుస్ ఇన్ బూట్స్
రా.09.00 ద కంజ్యూరింగ్



స్టార్ మూవీస్
ఉ.06.08 హోటల్ ట్రాన్సిల్వేనియా
ఉ.07.55 బేబీస్ డే ఔట్
మ.01.52 డాక్టర్ స్ట్రేంజ్
సా.04.11 చైనీస్ జోడియాక్
రా.09.00 థోర్ 2: ద డార్క్ వరల్డ్



మా మూవీస్
ఉ.09.30 దడ
మ.12.00 సాహసం
మ.03.00 రక్షణ
సా.06.00 మన్మథుడు
రా.09.00 ఊకొడతారా ఉలిక్కిపడతారా



జీ సినిమా
ఉ.04.45 బాంబే టు బ్యాంకాక్
ఉ.08.14 శివలింగ
ఉ.11.08 తారే జమీన్ పర్
మ.02.28 బాఘీ
రా.11.44 ఖేల్ పవర్ కా

తిరుమల సమాచారం

తిరుమలలో శుక్రవారం భక్తుల రద్దీ మోస్తరుగా ఉంది. దర్శనం కోసం భక్తులు వేచి ఉండే వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లో 15 కంపార్ట్‌మెంట్లు నిండాయి.

సాయంత్రం 6 గంటలకు అందిన సమాచారం :

గదుల వివరాలు:

ఉచిత గదులు	–	ఖాళీ లేవు
రూ.50 గదులు	–	ఖాళీ లేవు
రూ.100 గదులు	–	ఖాళీ లేవు
రూ.500 గదులు	–	ఖాళీ లేవు

సేవలు

సహస్ర దీపాలంకరణ	–	ఖాళీ లేవు
వసంతోత్సవం	–	ఖాళీ లేవు
ఆర్జిత బ్రహ్మోత్సవం	–	ఖాళీ లేవు



వేములవాడ ఆలయ సమాచారం

వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి సన్నిధిలో శుక్రవారం భక్తుల రద్దీ కొనసాగింది. సాయంత్రం 7 గంటలకు అందిన సమాచారం ప్రకారం గదుల వివరాలు .

కాంప్లెక్స్‌పేరు	ఖాళీల సంఖ్య	అద్దె (రూ.లలో)
అమ్మవారు కాంప్లెక్స్	04	1.000
నందీశ్వర కాంప్లెక్స్ ఏసీ	20	750
నందీశ్వర సాధారణ	33	350
రాజేశ్వర పురం ఏసీ	04	750
రాజేశ్వర పురం సాధారణ	09	350
లక్ష్మీగణపతి	40	250
పార్వతీపురం స్పెషల్	17	500
పార్వతీపురం సాధారణ	19	200
శివపురం	37	150
శంకరపురం	48	50

పులిహోర లడ్డూ .లడ్డూ భోగం అందుబాటులో ఉన్నాయి.

వేములవాడ.



చికెన్ ధరలు

లైవ్ కోడి	:	120	బోన్‌లెస్	: 350
చికెన్	:	150	మటన్ కిలో	: 500
స్కిన్‌లెస్	:	170		- కరీంనగర్



Padi-Panta

పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

నువ్వుల పంటకు అనుకూలం

పొలాస వ్యవసాయ పరిశోధన స్థానం ఇన్‌చార్జి డైరెక్టర్ పద్మజ

జగిత్యాల అగ్రికల్చర్: పెరుగుతున్న ఉష్ణోగ్రతలు నువ్వు పంటకు అనుకూలమని పొలాస వ్యవసాయ పరిశోధన స్థానం ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ పద్మజ అన్నారు. జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలం చిత్రవేణి గూడెం గిరిజన రైతులకు వేసవిలో నువ్వు పంట సాగుపై శుక్రవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో నువ్వు పంటను దాదాపు 60 వేల ఎకరాల్లో, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో దాదాపు 25 వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారని చెప్పారు. వర్షాలు కురవనపుడు ఖరీఫ్ సీజన్‌లో ప్రత్యామ్నాయ పంటగా, పసుపు, మొక్కజొన్న కోసిన తర్వాత వేసవి పంటగా రబీలో సాగు చేస్తున్నారని చెప్పారు. నువ్వు పంటను వేసవిలో సాగు చేస్తేనే అనువైన వాతావరణం ఉండి, దిగుబడులు ఎక్కువగా వస్తాయని తెలిపారు. ఉష్ణోగ్రతలు 25 నుంచి 27 డిగ్రీల సెంటిగ్రేడ్ ఉన్నప్పుడు మొలకశాతం, తొలి దశలో పెరుగుదల, పూత బాగా వచ్చి దిగుబడులు పెరుగుతాయని పేర్కొన్నారు. పూత దశలో 15 డిగ్రీల సెంటిగ్రేడ్‌కు ఉష్ణోగ్రత తగ్గినా, 40 డిగ్రీల సెంటిగ్రేడ్‌కు పెరిగిన పూత రాలిపోయే ప్రమాదముంటుందన్నారు. జిల్లా వ్యవసాయాధికారిణి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ నువ్వు పంటలో అన్ని రకాల యజమాన్య పద్ధతులు పాటిస్తే ఎకరాకు 6–8 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నారు. పరిశోధన స్థానాల నుంచి అధిక దిగుబడినిచ్చే విత్తనాలు తీసుకెళ్లి సాగు చేస్తే దిగుబడులు పెరుగుతాయన్నారు. పొలాస వ్యవసాయ పరిశోధన స్థానం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ వెంకటయ్య మాట్లాడుతూ శాస్త్రవేత్తలు రూపొందించిన రాజేశ్వరి, శ్వేత, చందన, హిమ,జేసీయస్–1020 వంటి రకాలు రైతుల నుంచి మంచి ఆదరణ పొందుతున్నాయని చెప్పారు. ఎకరాకు రెండు కిలోల విత్తనం సరిపోతుందని, విత్తనానికి కనీసం 5–10 కిలోల పొడి ఇసుకను కలిసి చల్లుకుంటే సరిపోతుందన్నారు. డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ, గిరిజన రైతులకు ఆధునిక పద్ధతుల్లో వ్యవసాయం నేర్పేందుకే ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. రాబోయే వేసవిలో నువ్వు పంట సాగు చేస్తే ఆదాయం పెరుగుతోందని, వారికి కిలో చొప్పున నువ్వు విత్తనాల ప్యాకె ట్లు ఇచ్చినట్లు పేర్కొన్నారు. శాస్త్రవేత్త డాక్టర్ పద్మజ మాట్లాడుతూ, నువ్వు పంట విత్తిన 30 రోజుల వరకు కలుపు మొక్కలు లేకుండా చూసుకోవాలన్నారు. మొక్కలు వాడిపోకుండా కనీసం 15 రోజులకొకసారి నీటి తడిని అందించాలని సూచించారు. పశువుల ఎరువుతో పాటు నత్రజని, పోటాష్, భాస్వరం ఇచ్చే ఎరువులను వేసుకోవాలన్నారు. నువ్వు పంటల్లోని వివిధ రకాల గురించి క్షేత్ర స్థాయిలో గిరిజన రైతులకు ప్రయోగాత్మకంగా వివరించారు. జగిత్యాల ఏడీఏ రాజేశ్వర్, శాస్త్రవేత్తలు రేవతి, లక్ష్మీప్రసన్న, గోన్యానాయక్ పాల్గొన్నారు.



గిరిజన రైతులతో శాస్త్రవేత్తల బృందం

తెలియని విషయాలు తెలిశాయి



నువ్వు సాగులో తెలియని చాల విషయాలు తెలిశాయి. నువ్వును ఎలా సాగు చేస్తే దిగుబడులు పెరుగుతాయో చెప్పారు. నువ్వు పంటను ఆశించే పురుగులు, వాటిని ఎలా నివారించవచ్చో ఫొటోల ద్వారా వివరించారు.

– సిడ్రం జంగు, గిరిజన రైతు

తెల్లనువ్వు రకాలు బాగున్నాయి



తెల్లని నువ్వు రకాలు చా ల బాగున్నాయి. మాకు కిలో చొప్పున ఇచ్చారు. మా పొలంలో శాస్త్రవేత్తలు ఇచ్చిన నువ్వులను సాగు చేసి, అధిక దిగుబడి సాధించాలనుకుంటున్నాను. ఈ శిక్షణ ద్వారా అనేక విషయాలు తెలిశాయి.

– సీడం చిన్ను, గిరిజన రైతు



చికెన్ (సుగుణ)

స్కిన్	స్కిన్‌లెస్
140	170

భవిష్యం

మేషం: ముఖ్య నిర్ణయాలలో మార్పులు వచ్చే అవకాశం ఉంది. అనుకోని ఖర్చులు. ఆకస్మిక ప్రయాణాలు. దైవ దర్శనాలు చేసుకుంటారు. వృత్తి, వ్యాపారాలు మందగిస్తాయి.

వృషభం: పనుల్లో స్వల్ప అవరోధాలు. ప్రయాణాలు చేయాల్సి వస్తుంది. ఆరోగ్య భంగం. రుణాలు చేయాల్సి వస్తుంది. వ్యాపారాలు, ఉద్యోగాలలో నిరాశ.



మిథునం: బాకీలు వసూలు అవుతాయి. ఆలయాలు సందర్శిస్తారు. పరిచయాలు పెరుగుతాయి. ఇంటాబయటా అనుకూలం. వ్యాపారవృద్ధి. ఉద్యోగులకు హోదాలు.

కర్కాటకం: కుటుంబ సమస్యలు. ఆస్తి వివాదాలు. ఆలోచనలు స్థిరంగా ఉండవు. ఆలయాలు సందర్శిస్తారు. వృత్తి, వ్యాపారాలలో ఒడిదుడుకులు.

సింహం: అప్రయత్న కార్యసిద్ధి. పోటీపరీక్షల్లో విజయం. ఆప్తుల నుంచి ఆహ్వానాలు. నూతన కార్యక్రమాలకు శ్రీకారం. వృత్తి, వ్యాపారాలలో అనుకూల పరిస్థితులు.

కన్య: కొత్త రుణాలు చేస్తారు. దూర ప్రయాణాలు చేసే అవకాశం ఉంది. ఆరోగ్య భంగం. బంధువులతో మాటపట్టింపులు. వ్యాపారాలు, ఉద్యోగాలలో ఒత్తిళ్లు.

తుల: ఉద్యోగయత్నాలు కలసివస్తాయి. సంఘంలో గౌరవం. కుటుంబంలో శుభకార్యాలు. ఆర్థికాభివృద్ధి. వృత్తి, వ్యాపారాలు సజావుగా కొనసాగుతాయి.

వృశ్చికం: నూతన ఉద్యోగ యోగం. ముఖ్య నిర్ణయాలు. మీ ఆశయాలు నెరవేరతాయి. స్థిరాస్తి లాభం. వ్యాపారులకు ఊహించని లాభాలు. ఉద్యోగులకు ప్రమోషన్లు.

ధనుస్సు: శ్రమకు ఫలితం కనిపించదు. ఉద్యోగ యత్నాలు నిరాశ కలిగిస్తాయి. ముఖ్యమైన పనులు ముందుకు సాగవు. వ్యాపార, ఉద్యోగాలు నిరుత్సాహపరుస్తాయి.

మకరం: బంధువుల నుంచి సమస్యలు. ఆర్థిక ఇబ్బందులు. ప్రయాణాలు వాయిదా వేస్తారు. వ్యాపారాలలో గందరగోళం. ఉద్యోగులకు బాధ్యతలు పెరుగుతాయి.

కుంభం: కొత్త మిత్రులు పరిచయం అవుతారు. శుభవార్తలు అందుతాయి. వ్యవహారాలలో అనుకూలత. సంఘంలో గౌరవం పెరుగుతుంది. వ్యాపార, ఉద్యోగాలలో సమస్యలు అధిగమిస్తారు.

మీనం: విద్యార్థులు శుభవార్తలు అందుకునే అవకాశం ఉంది. వ్యవహార విజయం. ఆహ్వానాలు, గ్రీటింగ్‌లు అందుతాయి. దైవ దర్శనాలు. వ్యాపారాలు, ఉద్యోగాలలో ఉత్సాహవంతంగా ఉంటుంది.

– సింహంభట్ల సుబ్బారావు



హలో సాక్షి..
పెద్దపల్లి : 90102 77735
పెద్దపల్లి టౌన్ : 9494494498
పెద్దపల్లి అర్బన్ : 9393746070
పెద్దపల్లి రూరల్ : 97053 46653
సుల్తానాబాద్ : 9949627020
గర్రెపల్లి : 9494722433
కాల్వశ్రీరాంపూర్ : 97053 46655
ఎలిగేడు : 97053 46657
జూలపల్లి : 94419 25698
ఓదెల : 9963 557644
ధర్మారం : 9705346606



పెద్దపల్లి శివారులోని హన్మంతునిపేట రైల్వేగేటు వద్ద వాహనదారులు రైళ్లరాకపోకలతో నిత్యం గంటల తరబడి నిరీక్షిస్తున్నారు. కొందరు వేచి ఉంటుండగా, మరికొందరు ఇలా గేటు కింద నుంచి వాహనాలను తీసుకెళ్తున్నారు.

– అరగొండ రాజ్‌కుమార్, గుర్రాంపల్లి

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 9010277735

సమ్మక్క జాతర ఏర్పాట్లలో జాప్యం

సుల్తానాబాద్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఎక్కువగా భక్తులు జాతరకు హాజరయ్యేది కరీంనగర్ (రేకుర్తి) అనంతరం నీరుకుల్ల జాతరకే. కాగా నేటికీ జాతర ఏర్పాట్లు చేయక జాప్యం చేస్తుండడంతో భక్తులు ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి కరీంనగర్‌తోపాటు ఆదిలాబాద్, వరంగల్ జిల్లాల నుంచి అనేక మంది బస్సులతోపాటు, రైల్వే సౌకర్యం ఉండడంతో జాతరకు తరలివస్తారు. విశాలమైన మానేరు వాగు ఉండడంతో భక్తులకు సైతం సౌకర్యంగానే ఉంటుంది. జాతర గడువు సమీపిస్తున్నందున మౌలిక వసతులు కల్పనకు పనులు ప్రారంభించి త్వరగా పూర్తి చేసి భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా కలుగకుండా చూడాలని కోరుతున్నారు.

- ప్రారంభం కాని పనులు
- జాతర ఆదాయం ఖర్చులకేనా..?
- ప్రత్యేక అధికారులతో నిర్వహణ



నీరుకుల్ల సమ్మక్క-సారలమ్మ జాతర గద్దెలు

జనవరి 31 నుంచి జాతర

సుల్తానాబాద్ మండలం నీరుకుల్ల గ్రామ మానేరు ఒడ్డున జనవరి 31 నుంచి ఫిబ్రవరి 3 వరకు జరిగే సమ్మక్క సారలమ్మ జాతరకు ఉమ్మడి జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరవుతారు. అయితే ఇప్పటివరకు ఎలాంటి ఏర్పాట్లు చేయకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే జాతరకు చుట్టుప్రక్కల పిచ్చిమొక్కలు శుభ్రం చేయడంతో పాటు సౌకర్యాలను ఏర్పాటు చేసేందుకు పాలక వర్గాలు కృషి చేసేవి. జాతర పాలకవర్గాన్ని నియామకం చేయాలని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి వద్దకు ఆశావాహులు వెళ్లి పలుమార్లు కలిసి వచ్చారు. మానేరు ఒడ్డున ఉండడంతో మానకొండూర్ మండలం వేగురుపల్లి, సుల్తానాబాద్ మండలం నీరుకుల్ల గ్రామస్తుల నుంచి పాలకవర్గ సభ్యులను నియామకం చేసేవారు. 2016లో ఏర్పాటైన పాలకవర్గం వేగురుపల్లికి చెందిన వారికి పోవడంతో ఈసారి నీరుకుల్లకు చైర్మన్ పదవి వరిస్తుందని ఆశపడ్డ ఆశావాహులకు నిరాశే ఎదురైంది.

గత జాతర ఆదాయం

2016లో సుమారు 3 నుంచి 4 లక్షల వరకు వచ్చే భక్తుల నుంచి కానుకలు, డబ్బులు రూ.12,84,625 రాగా పాలక వర్గ సభ్యులు వ్యయం సైతం అంతే సమానంగా ఉందని అధికారులకు లెక్క చెప్పారు. అయితే దీనిపై ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఈసారి పాలకవర్గాన్ని నియామకం చేయకుండా ప్రత్యేక అధికారులతో నిర్వహిస్తుండడంతో జాతర ఆదాయం వస్తే ఈ ప్రాంతాన్ని అభివృద్ధి పర్చవచ్చనే ఆలోచనలో ఉన్నట్లు స్థానికుల ద్వారా తెలిసింది.

ఏర్పాటు చేయాల్సిన సౌకర్యాలు

- రోడ్డు, రవాణా సౌకర్యం
- విద్యుత్ సౌకర్యం ఏర్పాటు
- ఫిల్టర్ చేసిన తాగునీరు
- స్నానఘట్టాలు ఏర్పాటు
- మూత్రశాలలు, మరుగుదొడ్లు
- గద్దెల వద్ద రంగులతో ముస్తాబు,
- మహిళా భక్తులకు దుస్తుల మార్పిడికి గదులు
- వాహనాలకు పోలీసులు ఇన్‌పుట్, ఆవుట్‌పుట్ వేర్వేరుగా ఏర్పాటు
- అల్లరి మూకలపై ప్రత్యేక నిఘా (సీసీ కెమెరాలు)

ప్రభుత్వ నిర్ణయమే



ప్రభుత్వ నిర్ణయం ప్రకారం పంచాయతీ వ్యవహరిస్తుంది. ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి సమ్మక్క సారలమ్మ జాతర ఏర్పాట్లు ఎలా చేయమంటే అలా చేస్తాం. అధికారుల ఆదేశాలు పాటించడమే తమ పని.

– బి.రాజమల్లయ్య, సర్పంచ్, నీరుకుల్ల

రెండు రోజుల్లో సమావేశం ఏర్పాటు చేస్తాం



నీరుకుల్లలో సమ్మక్క సారలమ్మ జాతరకు సంబంధించి అధికార ఈవోగా బాధ్యతలను బుధవారం అప్పగించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, గతంలో పనిచేసిన పాలకవర్గ సభ్యులు, అందరితో రెండు రోజుల్లో సమావేశం ఏర్పాటు చేస్తా.

– శంకర్, ఈవో

న్యూస్ బాక్స్

ఘనంగా పోచమ్మ బోనాలు

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని మొట్లపల్లి, గంగారం గ్రామాల్లో శుక్రవారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. డప్పుచప్పుళ్లతో, శివసత్తుల పూనకాలతో, కోలాటం ప్రదర్శిస్తూ మహిళలు బోనాలతో ఆలయానికి వెళ్లారు.ఆయా గ్రామాల్లో మహిళలకు ఎంపీపీ సారయ్యగౌడ్, జెడ్పీటీసీ లంక సదయ్య, వైస్ఎంపీపీ కొంకటి మల్లారెడ్డి చీరెలు, కోలలు, గజ్జెలు పంపిణీ చేశారు. సర్పంచులు సత్యనారాయణరెడ్డి, స్వరూప, ఉపసర్పంచులు కృష్ణవేణి, వాణి, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో రెవెన్యూ గ్రామసభలు

ఓదెల: మండలంలోని ఓదెల, కొలనూర్ గ్రామాల్లో శుక్రవారం రెవెన్యూ గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీనివాసరావు మాట్లాడుతూ భూముల విషయంలో ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తెస్తే నేరుగా పరిష్కరిస్తామని, దళారుల ప్రమేయం లేకుండా తమకు తెలపాలన్నారు. సర్పంచులు ఆకుల మహేందర్, ఖైరున్నీసా, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఐరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీలు బోడకుంట చిన్నస్వామి, శంకర్, ఆర్ఐలు వెంకట్రాజం, ఉమాపతి పాల్గొన్నారు.

టీఆర్ఎస్ కార్యకర్త కుటుంబానికి రూ.2లక్షలు

పెద్దపల్లి: పెద్దపల్లి మండలం భోజన్నపేటకు చెందిన గుండేటి శంకరమ్మకు రూ.2లక్షల బీమా సొమ్మును ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి శుక్రవారం అందజేశారు. శంకరమ్మ భర్త రాజయ్య టీఆర్ఎస్‌లో క్రియాశీలకంగా పని చేస్తూ పార్టీ సభ్యత్వం కలిగి ఉన్నాడు. ఆరు నెలల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో రాజయ్య మృతిచెందడంతో బీమా కింద రూ. 2లక్షలు మంజూరయ్యాయి. దీంతో ఆయన భార్య శంకరమ్మకు ఎమ్మెల్యే చెక్కు అందజేశారు. నాయకులు శ్రీగిరి శ్రీనివాస్, సూర శ్యామ్, రాజేందర్, ఉప్పు రాజు, పాల రామారావు, కిషన్‌యాదవ్ పాల్గొన్నారు.

సుల్తానాబాద్: సుల్తానాబాద్‌కు చెందిన విలాసగరపు శ్రీనివాస్ మృతి చెందడంతో రూ.2 లక్షల బీమా చెక్కును ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి శుక్రవారం అందించారు.

'రైతుల కోసం చేయాల్సిన పనులన్నీ చేస్తున్నాం'

- ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

జూలపల్లి: రైతుల కోసం చేయాల్సిన పనులన్నీ చేస్తున్నామని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. మండలంలోని పెద్దాపూర్‌లో రూ.58 లక్షల మిషన్ భగీరథ నిధులతో చేపడుతున్న అంతర్గత పైప్‌లైన్ పనులను శుక్రవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. టీఆర్ఎస్ పార్టీ రైతులకు, ప్రజలకు అనేక సంక్షేమ, అభివృద్ధి పనులు చేసిందని చెప్పారు. గతంలో చెరువుల్లో నీరు ఎలా ఉండేది ఇప్పుడెలా ఉంటుందని రైతులను ప్రశ్నించారు. అసలు యాసంగి పంటకు నీరు ఇవ్వడం కుదురదంటే సింగూరు, నిజాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి 15 టీఎంసీల నీరు ఎస్సారెస్పీకి తీసుకుని వస్తే పంటలు పండుతాయని సీఎంను ఒప్పించామన్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన డబుల్‌బెడ్ రూం ఇళ్లు, దళితులకు 3 ఎకరాలు ఏమైందని గ్రామానికి చెందిన సంకెండ్ల నర్సయ్య ఎమ్మెల్యేను అడగగా ఎవరైన అమ్మేవారు ఉంటే చెప్పండి.. మేము తయారు చేసి ఇస్తామని చెప్పామా అన్నారు. అనంతరం వ్యక్తిగత మరుగుదొడ్ల లబ్ధిదారులకు చెక్కులు అందించారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ రఘువీర్‌సింగ్, ఉపసర్పంచ్ కల్లెపెల్లి అంజయ్య, సర్పంచులు కొంజర్ల వెంకటయ్య, గొడిశెల రవి, సీపెల్లి శ్రావణి, ఎంపీటీసీ సభ్యుడు కనుకుంట్ల అంజయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సువిశాల, నాయకులు రాములు, రాజయ్య, రాజేశం, శ్రీనివాస్, రమేశ్ పాల్గొన్నారు.

లోకల్ వాయిస్

లోపించిన పారిశుధ్యం



పెద్దపల్లి మండలం రంగంపల్లి గ్రామంలోని విష్ణుపురి కాలనీలో పారిశుధ్యం లోపించింది. డ్రెయినేజీల్లో మురుగునీరు పేరుకుపోయి దోమలు వృద్ధిచెంది కాలనీవాసులు రోగాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ప్రజారోగ్యాన్ని కాపాడేలా చర్యలు చేపట్టాలి.

– ముత్యం రామస్వామి, రంగంపల్లి

సీపీఎస్ విధానం రద్దు చేయాలి

కరీంనగర్‌ఎడ్యుకేషన్: కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం(సీపీఎస్) రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని తెలంగాణ ప్రైమరీ స్కూల్స్ హెడ్‌మాస్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు కర్ర శ్యాంసుందర్‌రెడ్డి, కొండ్లె సుభాష్ ప్రభుత్వాన్ని కోరారు. వారు మాట్లాడుతూ ఉద్యోగుల పరిస్థితి ఆగమ్యగోచరంగా తయారవుతోందని, ప్రభుత్వం పునరాలోచించి సీఎస్ రద్దు చేయాలని కోరారు. సర్వీసు రూల్స్ సమస్యను తేల్చి బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మల్లయ్య, రవిప్రకాష్, సుధాకర్ రెడ్డి, లచ్చయ్య, రామస్వామి పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ బాలబాలికల జట్లు ఇవే..

కరీంనగర్ స్పోర్ట్స్: హైదరాబాద్‌లో ఈ నెల 8, 9 తేదీల్లో జరుగనున్న 4వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ బాలబాలికల అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జట్ల జాబితాను సంఘం కార్యదర్శి నందెల్లి మహిపాల్ శుక్రవారం ప్రకటించారు. అండర్ -10 బాలురలో అబ్దుల్ సమీ, శ్రీని వాస్, సాయికీర్తన్, బాలికల్లో సాయిస్నిగ్ధ, మ హాలక్ష్మి, స్పందన, అండర్ -12 బాలురలో ఆదర్శ్, అంజి కుమార్, భరద్వాజ్, బాలికల్లో సృజ న, నిఖిల, హర్షిణి, సాయిసుమ, అండర్ -14 బాలురలో తరుణ్, సాయిమనోజ్, రం జిత్, విశ్వనాథ్, శ్రీనాథ్, పవన్, బాలికల్లో కనక, వర్ష, త్రిష, రేణుక, ఆశ్రిత, సమీర ఎంపికయ్యారు.

సామాజిక తెలంగాణ కోసం పోరాటం

ప్రజాగాయకుడు గద్దర్, గాయని విమలక్క

జగిత్యాల: సామాజిక తెలంగాణ కోసం పోరాటం చేద్దామని ప్రజా గాయకుడు, గాయని, గద్దర్ విమలక్క అన్నారు. జగిత్యాలలోని పద్మనాయక కల్యాణ మండపంలో టీ–మాస్ జగిత్యాల జిల్లా ఆవిర్భావ సామాజిక ప్రజా సంఘాల ఐక్య వేదిక సమావేశంలో ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో 7 శాతం ఉన్నవారే అధికారంలో కొనసాగుతూ 93 శాతం ఉన్న ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. పూర్వం నుంచి అణగదొక్కుతున్నారని ఆరోపించారు. మన పాలన, మన ఉద్యోగాలు, మన నీరు అని పోరాటం చేసి తెచ్చుకున్న తెలంగాణలో స్వచ్ఛమైన పాలన అందడం లేదని పేర్కొన్నారు. పాలకులు మారారే తప్ప పాలన మాత్రం యథావిధిగా ఉందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఇప్పటివరకు ఒక్కటి నెరవేర్చలేదన్నారు. 52 శాతం ఉన్న బీసీల చేతివృత్తులు అంతమయ్యాయని, వారికి రాజకీయ అధికారం కూడ లేదన్నారు. బడులు, బలహీనవర్గాలకు గొర్రెలు, బర్రెలు ఇస్తూ పబ్బం గడుపుతున్నారన్నారు. గుట్టలు కొల్లగొడుతూ బంగారు తెలంగాణ అంటూ మాట్లాడుతున్నారని ఆరోపించారు. ఓపెన్‌కాస్ట్ అడ్డుకుంటామని చెప్పిన కేసీఆర్ వారితో చేతులు కలిపారని ఆరోపించారు. నేరెల్ల దళితులపై దాడులు చేసిన వారిపై చర్యలు చేపట్టలేదన్నారు. సిరిసిల్లలో టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు చేయడం వెనుక పెద్ద కుట్ర ఉందన్నారు. రాష్ట్రంలో పరువు హత్యలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. పోరాటంతోనే సమస్యలు పరిష్కారమవుతాయని పేర్కొన్నారు. మహిళలపై రోజురోజుకు అత్యాచారాలు


వేదికపై గద్దర్ నాటక ప్రదర్శన

పెరిగిపోతున్నాయని, దీనికి కారణం ఇంటర్నెట్ వ్యవస్థ అని, ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. మోడీ ప్రభుత్వం గో మాంసాన్ని విదేశాలకు అమ్ముతూ కోట్లకు కోట్లు కొల్లగొడుతున్నారని ఆరోపించారు. వివిధ ప్రజా సంఘాల నాయకులు బాలె శంకర్, తిరుపతినాయక్, గర్వందుల నరేశ్, రవీందర్, సారంగపాణి, ఎంఎ.చౌదరి, రాయలింగు పాల్గొన్నారు.

కొందరికే సామాజిక తెలంగాణ

సాధించుకున్న తెలంగాణలో పాలకులు మారారే తప్ప పాలనలో మార్పు రాలేదని గద్దర్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేక రాష్ట్రం వస్తే ఉద్యోగాలు వస్తాయనుకున్న విద్యార్థుల ఆశలు అడియాశలయ్యాయన్నారు. జగిత్యాల జైత్రయాత్ర స్ఫూర్తితో సామాజిక తెలంగాణ సాధనకు మళ్లీ ఉద్యమిస్తామన్నారు. ఉద్యమం నుంచి బయటకు వచ్చిన నక్సలైట్ల కుటుంబాలను సైతం ఆదుకోలేదని పేర్కొన్నారు.

దక్కన్ షుగర్ ఫ్యాక్టరీలు తెరిపించాలి

- రైతు ఉద్యమంతో ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు
- అరుణోదయ సాంస్కృతిక మండలి వ్యవస్థాపక అధ్యక్షురాలు విమలక్క


మాట్లాడుతున్న విమలక్క

మల్లాపూర్(కోరుట్ల): నిజాం షుగర్ ఫ్యాక్టరీలు తెరువకపోతే చెరుకు రైతులు చేపట్టిన ఉద్యమంతో టీఆర్ఎస్ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని అరుణోదయ సాంస్కృతిక మండలి వ్యవస్థాపక అధ్యక్షురాలు విమలక్క హెచ్చరించారు. జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం ముత్యంపేట నిజాం దక్కన్ షుగర్ ఫ్యాక్టరీని శుక్రవారం చెరుకు రైతులతో కలిసి సందర్శించారు. విమలక్క మాట్లాడుతూ ఏకైక వ్యవసాయాధారిత పరిశ్రమ షుగర్ ఫ్యాక్టరీలను లాభాలు లేవని మూసివేస్తామని అసెంబ్లీలో సీఎం ప్రకటించడం రైతు వ్యతిరేక చర్యగా అభివర్ణించారు. ఫ్యాక్టరీల నిర్వహణ బాధ్యతలను ప్రభుత్వమే తీసుకోవాలని డిమాండ్ చేశారు. 2018–19 క్రషింగ్ సీజన్‌కు యంత్రాలను మరమ్మతు చేయించాలని కోరారు. చెరుకు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు మామిడి నారాయణరెడ్డి, షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణ కమిటీ అధ్యక్షుడు గురిజేల రాజిరెడ్డి, సీడీసీ మాజీ చైర్మన్లు అల్లూరి ఆదిరెడ్డి, కంది బుచ్చిరెడ్డి, రైతు సంఘం మాజీ అధ్యక్షుడు వాకిటి సత్యంరెడ్డి, చెరుకు రైతులు కట్కం గంగారెడ్డి, గడ్డం తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

అర్చకులకు ఆన్‌లైన్‌లో వేతనాలు

- అర్చక సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు ఉపేంద్రశర్మ
- సమాఖ్య డైరీ ఆవిష్కరణ

సప్తగిరికాలనీ(కరీంనగర్): దేవాదాయ శాఖ పరిధిలోని ఆలయాల అర్చకులకు ఆన్‌లైన్‌లో వేతనాలు అందుతాయని, మూడు విడతలుగా అమలు చేసేందుకు సీఎం కేసీఆర్ సంసిద్ధత వ్యక్తం చేశారని తెలంగాణ రాష్ట్ర అర్చక సమాఖ్య వర్కింగ్ అధ్యక్షుడు గంగు ఉపేంద్ర శర్మ అన్నారు. శుక్రవారం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస సుదర్శన్ ఆధ్వర్యంలో జరిగిన డైరీ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ డిసెంబర్ 1 నుంచి వేతనాలు అందించేందుకు దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి తొలి విడతగా రూ. 10 కోట్లు విడుదల చేసి 800 మంది అర్చకులకు ఆన్‌లైన్ ద్వారా వేతనాలు అందించారని పేర్కొన్నారు. అర్చకుల సంక్షేమానికి మరో రూ.100 కోట్లు కేటాయించడం అభినందనీయమన్నారు. అనంతరం జిల్లా అర్చక సమాఖ్య రూపొందించిన 2018 డైరీ ఆవిష్కరించారు. పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల అధ్యక్షులు కొండపాక సత్యనారాయణ, ఏటూరి ఆంజనేయ చారి, ఉమ్మడి జిల్లా బ్రహ్మణ సేవా సమితి అధ్యక్షుడు చెరుకు రాజేశ్, డింగిరి శ్రీనివాస్,


డైరీ ఆవిష్కరిస్తున్న ఉపేంద్రశర్మ

శ్యాంసుందర్, రవీంద్ర శర్మ, జనార్దన్ స్వామి పాల్గొన్నారు.

నియామకం

సప్తగిరికాలనీ(కరీంనగర్): కరీంనగర్ ఉమ్మడి జిల్లా బ్రాహ్మణ సేవా సమితి అధ్యక్షుడిగా చెరుకు రాజేశ్వర శర్మను నియమించినట్లు తెలంగాణ రాష్ట్ర అర్చక సమాఖ్య వర్కింగ్ అధ్యక్షుడు గంగు ఉపేంద్ర శర్మ తెలిపారు. కొత్త అధ్యక్షుడు గ్రామీణ ప్రాంతాల బ్రాహ్మణ, శ్రీ వైష్ణవ, ఆరాధ్య, నియోగులను చైతన్య పరుస్తూ సీఎం కేసీఆర్ బ్రాహ్మణ సంక్షేమానికి కేటాయించిన నిధులు సద్వినియోగం అయ్యేలా చూడాలని సూచించారు. ఈ నియామకం 2 ఏళ్ల వరకు వర్తిస్తుందని, త్వరలో పూర్తిస్థాయి కార్యవర్గాన్ని ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం బాధ్యులు పాల్గొన్నారు.

కేసుల దర్యాప్తులో నాణ్యత ఉండాలి

కరీంనగర్ రేంజ్ డీఐజీ ప్రమోద్‌కుమార్

కరీంనగర్ క్రైం: వివిధ రకాల కేసుల దర్యాప్తులో నాణ్యత ప్రమాణాలు ఉండాలని కరీంనగర్ రేంజ్ డీఐజీ ప్రమోద్‌కుమార్ అన్నారు. డీఐజీగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత కమిషనరేట్‌లోని పోలీస్ అధికారులతో మొదటిసారి సమావేశం నిర్వహించారు. నేరాల ఛేదన, నియంత్రణకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ప్రమాదాలు జరిగిన సందర్భంలో సంఘటన స్థలాన్ని ప్రత్యక్షంగా పరిశీలించి అన్ని కోణాల్లో విచారణ కొనసాగిస్తూ కేసులు నమోదు చేయాలని పేర్కొన్నారు. రాష్ట్ర డీజీపీ తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే మొదటిస్థానంలో నిలిపేందుకు శ్రమిస్తున్నారని కరీంనగర్ రేంజ్‌ను రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిపేందుకు కృషి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో సీపీ


సమావేశంలో పాల్గొన్న అధికారులు

కమలాసన్‌రెడ్డి, అడిషనల్ డీసీపీ శ్రీనివాస్, సంజీవ్‌కుమార్, ఏసీపీలు వెంకటరమణ, ఉషారాణి, కృపాకర్, సీసీఆర్‌బీ ఎస్సై కనుకయ్య, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.



గల్ఫ్‌లో 87,64,829 మంది భారతీయులు

గల్ఫ్ దేశాల సహకారమండలిలోని (గల్ఫ్ కోపరేషన్ కౌన్సిల్ –జీసీసీ) ఆరు దేశాలలో ప్రవాస భారతీయుల జనాభా 87 లక్షల 64 వేల 829కు చేరిందని లోక్ సభలో జితేంద్ర చౌదరి అడిగిన ప్రశ్నకు విదేశాంగ శాఖ సహాయ మంత్రి వీకే సింగ్ డిసెంబరు 27న లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. సౌదీ అరేబియాలో 32,53,901 మంది, యూఏఈలో 28 లక్షలు, కువైట్‌లో 9,17,970, ఒమన్‌లో 7,83,040, ఖతార్‌లో 6.97 లక్షలు, బహరేన్‌లో 3,12,918 మంది ప్రవాస భారతీయులు ఉన్నారని తెలిపారు. ఆరు గల్ఫ్ దేశాలలో 11,774 మంది భారత సంతతి ప్రజలు ఉన్నట్టు చెప్పారు. ప్రపంచంలోని 208 దేశాలలో ఎన్నారైలు, పీఐఓలు కలిపి 3 కోట్ల 12 లక్షల 33 వేల 234 మంది భారత ప్రవాసులున్నారని ప్రకటించారు. ఇందులో కోటి 33 లక్షల 27 వేల 438 మంది ప్రవాస భారతీయులు, కోటి 79లక్షల 5వేల 796 మంది భారత సంతతి ప్రజలు ఉన్నారని వివరించారు.

ప్రవాసీ భారతీయ దివస్‌కు భారత సంతతి పార్లమెంటేరియన్లు

జనవరి 9న ఢిల్లీలో నిర్వహించనున్న ప్రవాసీ భారతీయ దివస్‌కు ప్రపంచంలోని వివిధ దేశాలలో ఉన్న భారత సంతతికి చెందిన 285 మంది పార్లమెంటేరియన్లను భారత ప్రభుత్వం ఆహ్వానించింది. ఇప్పటివరకు 125 మంది పార్లమెంటేరియన్లు తమ సమ్మతిని తెలియజేశారని విదేశాంగ శాఖలోని ప్రవాసీ భారతీయ వ్యవహారాల శాఖ కార్యదర్శి జ్ఞానేశ్వర్ మూలే తెలిపారు. భారత ప్రభుత్వం దౌత్యాన్ని ప్రజాపక్షం చేసిందని, భారత సంతతితో పరస్పరం అభిప్రాయాలను పంచుకోవడం, మాతృభూమితో వారి బంధాన్ని దృఢపరచడం తమ లక్ష్యమని ఆయన అన్నారు. విదేశాల్లోని భారతీయుల కోసం తక్షణం స్పందించే ఆన్‌లైన్ వ్యవస్థ 'మదద్' (కాన్సులర్ సర్వీసెస్ మేనేజ్‌మెంట్ సిస్టం) ద్వారా 26 వేల ఫిర్యాదులు వచ్చాయని, ఇందులో 21 వేలు పరిష్కరించామని వివరించారు.

ఖతార్‌లో ఎన్నారైలకు దౌత్య సేవలు

ఖతార్ దేశ రాజధాని దోహాలోని ఇండియన్ ఎంబసీ (భారత దౌత్య కార్యాలయం) అధికారులు ఈనెల 12న శుక్రవారం అల్ బనూష్ క్లబ్‌లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కాన్సులర్ క్యాంపు (దౌత్య సేవల శిబిరం) నిర్వహిస్తారు. ఎన్నారైలు వారి పాస్‌పోర్ట్, దౌత్య సంబంధ సేవలు గురించి, వేతనాలు తదితర సమస్యల గురించి అధికారులకు దరఖాస్తులు సమర్పించవచ్చు. మరిన్ని వివరాలకు ఎంబసీ హెల్ప్‌లైన్ నంబర్ **+97455808254** ఇ–మెయిల్: labour.doha@mea.gov.inకు సంప్రదించవచ్చు.

సౌదీలో 'ప్రవాసీ ప్రజావాణి'

సౌదీ అరేబియాలోని జిద్దా ఇండియన్ కాన్సులేట్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఈనెల 12న శుక్రవారం 'కాన్సులేట్ ఎట్ యువర్ డోర్' (మీ ముంగిట్లోకి దౌత్య కార్యాలయం) కార్యక్రమాన్ని భారత దౌత్య అధికారులు నిర్వహిస్తున్నారు. అభాలోని ఖమీస్ ముషాయిత్‌లో 054 6722909, మక్కాలోని ఇండియన్ హజ్ మిషన్‌లో 012 5603580, నజరాన్‌లో 017 5221949 నంబర్లలో సంప్రదించవచ్చు.

సేకరణ: మంద భీంరెడ్డి, అధ్యక్షులు, ప్రవాసీ మిత్ర

నిర్దిష్ట విధానం కావాలి

- శిక్షణ లేక కూలీలుగా వెళ్తున్న యువత
- సరైన ఉపాధి దొరకక అఘాయిత్యాలు
- కేరళ తరహా విధానం రూపొందించాలి
- వలసదారుల సంక్షేమ, హక్కుల వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు కోటపాటి నర్సింహనాయుడు

ఉపాధి వేటలో ఎడారి దేశాల బాటపడుతున్న నిరుద్యోగ యువత కొందరు నకిలీ ఏజంట్ల చేతుల్లో మోసపోయి నష్టపోతుంటే.. మరికొందరు జీతాలు సరిగా రాక.. అప్పులు తీరక.. అనారోగ్య కారణాలతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని వలసదారుల సంక్షేమ, హక్కుల వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు కోటపాటి నర్సింహనాయుడు అన్నారు. ఇక్కడి నుంచి వెళ్లేవారికి స్కిల్ డెవలప్‌మెంట్ లేకపోవడంతో ఎక్కువ శాతం కూలీ పనులే చేస్తున్నారని అన్నారు. గల్ఫ్ బాధితుల పక్షాన నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ కేంద్రంగా పోరాటాలు చేస్తున్న నర్సింహనాయుడు తన అభిప్రాయాలను 'సాక్షి'తో పంచుకున్నారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

– కొండవీటి సురేష్‌కుమార్, ఆర్మూర్

సాక్షి INTERVIEW

గల్ఫ్ దేశాలతో పాటు ఇరాన్, ఇరాక్, అఫ్ఘనిస్తాన్, ఇజ్రాయిల్, సింగపూర్, మలేసియా తదితర దేశాలకు తెలంగాణ నుంచి యువత ఉపాధి కోసం వెళ్తున్నారు. కానీ నిరక్షరాస్యులు, శిక్షణ లేనివారు కావడంతో 90 శాతం మంది కూలీలుగానే వెళ్తున్నారు. కేరళ రాష్ట్రీయులు మాత్రం స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణలు పూర్తి చేసుకొని గల్ఫ్ దేశాలకు వెళ్లడంతో మంచి ఉద్యోగాల్లో స్థిరపడుతున్నారు. మనవారికి సరైన శిక్షణ లేక పనులు సరిగా దొరకడం లేదు. దీంతో చేసిన అప్పులు తీరక స్వదేశానికి వచ్చిన వారు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. గల్ఫ్ దేశాల్లోని మృతదేహాలను స్వదేశాలకు తరలించడానికి నెలల తరబడి ఎదురు చూసే దయనీయ స్థితిని చూశాము. 2013లో వలసదారుల సంక్షేమ, హక్కుల వేదికను ఏర్పాటు చేసి కొన్ని గల్ఫ్ బాధితుల కుటుంబాలకు ప్రతి నెల 500 రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశాము. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో గల్ఫ్ మృతుల కుటుంబాలకు లక్ష రూపాయల పరిహారాన్ని అందజేసేవారు. టీఆర్‌ఎస్ పార్టీ నాయకులు పరిహారాన్ని ఐదు లక్షల రూపాయలకు పెంచు తామని ఎన్నికల సమయంలో ప్రకటించినా ఇప్పటికీ అమలు కాలేదు. అంతే కాదు.. గత ప్రభుత్వాలు ఇచ్చిన తరహాలో లక్ష రూపాయలు కూడా ఇవ్వలేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన 2 జూన్ 2014 నుంచి 2 అక్టోబర్ 2017 నాటికి 431 మంది తెలంగాణ ప్రజలు గల్ఫ్‌లో మృత్యువాత పడ్డట్లు రాష్ట్ర ప్రభుత్వమే అధికారికంగా ధ్రువీకరించింది. వీరిలో ఒక్క కుటుంబానికి కూడా రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి ఆర్థిక సహాయమూ అందజేయలేదు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం కలగజేసుకొని మృతదేహాలను వెంటనే స్వగ్రామాలకు చేర్చుతున్నప్పటికీ వారి కుటుంబాలకు భరోసా కల్పించడంలో విఫలమవుతుతోంది.


కోటపాటి నర్సింహనాయుడు

కేరళ, పంజాబ్ తరహాలో..

గల్ఫ్ దేశాల్లో సంక్షోభం గురించి తెలియక ఉపాధి వేటలో ఎడారి దేశాలకు వెళ్లి కష్టాలపాలవుతున్న రాష్ట్ర నిరుద్యోగులను ఆదుకోవడానికి ఒక ప్రత్యేక విధానమంటూ లేదు. రాష్ట్ర ప్రభుత్వం ఈ సమస్యపై విధానపరమైన నిర్ణయాన్ని తీసుకోవాల్సిన అవసరం ఉంది. కేరళ, పంజాబ్ రాష్ట్రాల తరహాలో ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయడం, గల్ఫ్ బాధితులను ఆదుకోవడం కోసం కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయడం, ప్రతి ఏటా వంద కోట్ల రూపాయల నిధిని కేటాయించడం లాంటి చర్యలు తీసుకోవాలి. నకిలీ ఏజంట్లను కఠినంగా శిక్షించడంతో పాటు ప్రత్యేక వ్యవస్థ ద్వారా రాష్ట్ర ప్రభుత్వమే విదేశాల్లో ఉద్యోగావకాశాలను తెలియపరచాలి. యువతకు అందుకు తగ్గ శిక్షణ ఇచ్చి ఉపాధి కోసం విదేశాలకు పంపే వ్యవస్థను ఏర్పాటు చేయాలి. గల్ఫ్ దేశాల్లో అనారోగ్యం, ఉద్యోగపరంగా సమస్యలతో నష్టపోయి తిరిగి స్వదేశానికి వచ్చిన వారికి పావలా వడ్డీతో రుణాలు అందజేసి స్వయం ఉపాధి రంగాల్లో ప్రోత్సహించి వారి జీవితాలకు భరోసా కల్పించాలి. గల్ఫ్ దేశాలలో సంపాదించి తెలంగాణ రాష్ట్రానికి మన వాళ్లు ప్రతి నెల పంపిస్తున్న డబ్బుపై పన్నుల రూపంలో వందల కోట్ల రూపాయలను ఆర్జిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం గల్ఫ్ బాధితుల సంక్షేమం గురించి కూడా ఆలోచించాలి. గల్ఫ్ మృతుల కుటుంబాలకు పింఛను అందజేయాలి.

వైద్యం అందని దైన్యం

- దుబాయ్‌లో గాయపడిన సిరిసిల్లవాసి
- అచేతనంగా స్వగ్రామానికి
- ఆదుకునే వారి కోసం ఎదురుచూపు

పాలమాకుల శేఖర్, సిరిసిల్లటౌన్:

ఉన్న ఊర్లో పనుల్లేక పొట్ట చేతబట్టుకుని పోయిన బడుగు జీవి అక్కడ పనికోసం ఎన్నో అవస్థలు పడ్డాడు. ఏదో ఒక పనిలో కుదిరిన ఆయనను విధి వెంటాడింది. నిచ్చెన జారి కిందపడిపోయాడు. ఆ ప్రమాదంలో కాలు విరిగితే పనిలో పెట్టుకున్న కంపెనీ కనీసం వైద్యం కూడా చేయించలేదు. దూర దేశంలో పడిన కష్టాలు ఆయన మాటల్లోనే..

నా పేరు చిలుముల చంద్రశేఖర్. మాది సిరిసిల్ల పట్టణం బీవైనగర్. స్వర్ణకారుడిగా పనిచేస్తూ నా భార్య అరుణ, కొడుకులు సాయికుమార్, తేజలను పోషించుకునే వాడిని. పదేళ్ల క్రితం కులవృత్తికి పనులు తక్కువయ్యాయి. పిల్లల భవిష్యత్తు కోసం దుబాయ్ పోయి సంపాదించ చాలనుకున్న. కోనరావుపేట మండలం కనగర్తికి చెందిన ఓ ఏజెంటు రూ.1.30లక్షలను తీసుకుని దుబాయ్‌కి పంపిండు. అక్కడ ఆంధ్రాకు చెందిన అన్‌లైసెన్స్‌డ్ ఏజెంటు నన్ను మూడు నెలలు ఏ పనీ లేకుండా తిప్పిండు. చేతిల డబ్బుల్లేకుండా అక్కడ చాలా రోజులు పస్తులుంటూ.. తెలుగు వారి వద్ద తలదాచు కునేటోన్ని. ఆ తర్వాత ఏమైందో గానీ అతని ఫోన్ స్విచ్చాఫ్ చేసి ఎక్కడికో పారిపోయిండు. అక్కడ మనవాళ్లు నా పరిస్థితి తెలుసుకుని ఎక్కడైనా పని ఉంటే చెప్పేటోళ్లు. లేకుంటే రూములోనే ఉండేటోన్ని. కొద్ది రోజులకు మన తెలుగోళ్ల సాయంతో ఓ కంపెనీలో చేరాను. మూడున్నర సంవత్సరాలు కార్పెంటర్ పనిచేసిన. యజమానులు జీతం సరిగా ఇవ్వక పోయేటోళ్లు. కంపెనీలో చేరేటప్పుడు నెలకు రూ.1200 దర్హమ్‌లు ఇస్తానన్నరు. కానీ నాలుగు నెల్లకోసారి కూడా జీతం ఇచ్చేటోళ్లు కాదు. తర్వాత ఖల్లివెల్లి వీసాతో కార్పెంటర్ పనులే చేసేటోన్ని. నన్ను అక్కడ పనిలో పెట్టిన సబ్‌కాంట్రాక్టర్ నాకు డబ్బులు సరిగా ఇచ్చేటోడు కాదు. కచ్చితంగా జీతం ఇవ్వాలని నిలదీస్తే.. జైలుకు పంపుతానని బెదిరించిండు. ఇట్లా నేను అక్కడ ఏజెంట్ల వద్ద రూ.23వేల దర్హమ్స్ మునిగాను. డిసెంబర్ 5న ఓ భవనంలో సీలింగ్ పనులు చేస్తూ నిచ్చెన జారి కిందపడి పోయాను. సబ్‌కాంట్రాక్టర్ ఆసుపత్రికి తీసుకుపోయిండు. కేవలం మందులు మాత్రమే ఇప్పించిండు. కాలి ఎముక మూడుముక్కలైందని అక్కడి డాక్టర్లు చెప్పగా.. రూ.10 వేల దర్హమ్స్ ఖర్చయితాయన్నరు. చేసేది లేక నా పరిస్థితిని ఇంటివాళ్లకు చెప్పుకున్నా. పొత్తూరుకు చెందిన రవీందర్‌రెడ్డికి మావాళ్లు చెబితే.. ఆయన గల్ఫ్ కార్మిక నాయకుడు అడవి పదిరకు చెందిన మహేందర్‌రెడ్డి, షార్జాలో ఉన్న ముస్తాబాద్‌కు చెందిన జనగామ శ్రీనివాస్, ఢిల్లీకి చెందిన గిరీష్‌పంత్‌కు సమాచారం ఇచ్చారు. వారి సాయంతో ఎంబసీకి పోయి నా పరిస్థితిని వివరించగా.. ఎంబసీ వారు మానవతా దృక్పథంతో ఉచిత విమాన ప్రయాణ టికెట్ ఇచ్చి పంపారు. కాలికి ఆపరేషన్ చేయించుకోవాలంటే చేతిలో చిల్లిగవ్వలేదు. మంచం పట్టిన నాకు భార్య, పిల్లలు సేవలు చేస్తున్నారు. ఇప్పుడు నేను ఎట్లా నడిచి వారిని సాదుకోవాలె. కరీంనగర్ ఆసుపత్రికి పోతే ఆరోగ్యశ్రీ ఈ ఆపరేషన్‌కు వర్తించదన్నారు. రూ.80వేలు ఖర్చవుతుందంట. ప్రభుత్వం ఆదుకోవాలి.


దుబాయ్‌లో చంద్రశేఖర్‌ను పరామర్శిస్తున్న జనగామ శ్రీనివాస్, గిరీష్‌పంత్



కుమ్మరిపల్లిలో రైతులకు ఎరువుల బస్తాలు పంపిణీ

జగిత్యాలఅగ్రికల్చర్: వారంతా రైతు బిడ్డలు.. తెలుగు రాష్ట్రాలకు చెందిన వారు.. అమ్మ, నాన్నల కష్టంతో బాగా చదువుకుని దుబాయ్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా స్థిరపడ్డారు. రైతు బిడ్డలుగా కష్టం తెలిసిన వారు. అందుకే అన్నదాతకు అండగా నిలవాలని నిర్ణయించుకున్నారు. రైతు బాంధవ సంస్థను ఏర్పాటు చేశారు. జగిత్యాల జిల్లా రాయికల్ మండలం కుమ్మరిపల్లి గ్రామాన్ని దత్తత తీసుకున్నారు. ఇక్కడి రైతులకు ఆర్థికసాయం అందిస్తున్నారు. అన్నదాతలకు ఆపద్బాంధవులుగా నిలుస్తున్నారు.

రైతు బాంధవులు

అన్నదాతకు ఆపద్బాంధవులు • కష్టాల్లో ఉన్న రైతులకు ప్రవాస భారతీయుల చేయూత • రాయికల్ మండలం కుమ్మరిపల్లి గ్రామం దత్తత • రైతు బాంధవ పేరుతో ఆర్థికసాయం

చలించిన హృదయాలు



తెలుగు రాష్ట్రల్లో రైతుల ఆత్మహత్యలను చూసి వారు చలించారు. అందరికీ పట్టెడన్నం పెట్టే రైతన్నకు అండగా నిలవాలని ఆకాంక్షించారు. తెలంగాణ, ఆంధ్రా ప్రాంతాలకు చెందిఉండి.. దుబాయ్‌లో స్థిరపడిన 15మంది ప్రవాసాంధ్రులు 'రైతుబాంధవ' పేరుతో సంస్థను ఏర్పాటు చేశారు. ఈ సంస్థ ద్వారా ఏటా ఓ గ్రామాన్ని దత్తత తీసుకుంటున్నారు. ఆ గ్రామంలో పేదరికంలో ఉండి వ్యవసాయం చేస్తున్న రైతులకు చేదోడు వాదోడుగా నిలుస్తూ అన్ని విధాలా ఆదుకుంటున్నారు. ఈ నేపథ్యంలో గతేడాది జూన్ మాసంలో జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలోని కుమ్మరిపల్లి గ్రామంలోని 15మంది రైతులను దత్తత తీసుకుని వారి వ్యవసాయానికి ఆర్థికంగా సాయం అందిస్తున్నారు.

ఒక్కోరైతుకు రూ.10వేలు

ప్రవాసాంధ్రులు ఒక్కొక్కరు ఒక్కో రైతును సంస్థ ద్వారా దత్తత తీసుకుంటారు. ఆ రైతుకు రూ. 10 వేల చొప్పున వడ్డీలేని రుణం అందిస్తారు. పంటవేసి సాగు చేసిన తరువాత దిగుబడి వస్తే ప్రవాసాంధ్ర సంస్థ ఇచ్చిన డబ్బులు రైతులందరూ కమిటీగా ఏర్పడి జమ చేయాలి. అలా జమ చేసిన ఆ మొత్తాన్ని సంస్థ వారు మరికొంత మంది పేద రైతులకు అందిస్తుంటారు.

పంట నష్టపోతే తీర్చనవసరం లేదు

పంటనష్టపోయినట్లు రైతు కమిటీ తీర్మానం చేసినట్లయితే సంస్థ ఇచ్చిన రూ.10వేలు తిరిగి చెల్లించాల్సిన అవసరం లేదు. ఇతర రైతులకు భిన్నంగా నూతన పంటలు సాగుచేసినా.. సంస్థ ఇచ్చిన రూ.10 వేలు ఇవ్వాల్సిన అవసరం లేదు.

రూ.1.40 లక్షలు చెల్లింపు

ఖరీఫ్ సీజన్‌లో 15 మంది రైతులకు రూ. 1.50 లక్షలను సంస్థ వారు అందించారు. ఒకేఒక్క రైతు భూమిలో పంట సరిగా పండలేదని రైతుల కమిటీ తీర్మానించడంతో సంస్థ ఆ రుణాన్ని మాఫీ చేసింది. మిగితా 14 మంది రైతులు రూ.1.40 లక్షలను వడ్డీ లేకుండా చెల్లించారు. రైతు కమిటీకి చెల్లించిన డబ్బులను తిరిగి, అదే గ్రామంలో మరికొంతమంది నిరుపేద రైతులకు అందజేశారు.

నిజాయితీతో మరింత ప్రోత్సాహం..

రైతులు పంట పండించుకుని, ఎలాంటి నష్టం రాలేదని, నిజాయితీగా సంస్థ ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వడంతో ప్రవాసాంధ్రులు మరింతగా ప్రోత్సాహం అందించేందుకు ముందుకొచ్చారు. అదే గ్రామంలో మరో నలుగురైదుగురు రైతులను ఎంపిక చేసి సాయం అందించాలని నిర్ణయించారు. ఆ ఎంపికను రైతు కమిటీకే అప్పగించారు. ఇలా.. దుబాయ్‌లోని ప్రవాసాంధ్రులు రైతుల కోసం చేస్తున్న కృషిని గ్రామస్తులు హర్షిస్తున్నారు.

అండగా నిలిచారు..



మాకున్న భూమికి బ్యాంకులో రుణం ఇవ్వనన్నారు. దీంతో వ్యవసాయం మానేసి కూలి పనులకు సిద్ధమయ్యాను. ఇలాంటి తరుణంలో దుబాయ్‌లోని ప్రవాసాంధ్రుల సంస్థ మాకు అండగా నిలిచింది. ఆర్థిక సాయం ఇచ్చి ఆదుకుంది. వారు చేసిన సాయం ఎప్పటికీ మర్చిపోను.

– మ్యాదరవేని కొమురవ్వ, మహిళా రైతు

బ్యాంకులో అప్పు పుట్టలే..



ప్రవాసాంధ్రులు ముందుకు వచ్చి ఆర్థికసాయం చేయకుంటే మేము పంట పండించేటోళ్లం కాదు. ఏ బ్యాంకు కు వెళ్లినా మాకు అప్పు పుట్టలేదు. ఇప్పుడు వారు ఇచ్చిన రూ. 10 వేలతో పంట పండించా. మా కుటుంబానికి ఎంతో సంతోషాన్ని ఇచ్చింది.

– లక్ష్మణ్, సాయం పొందిన రైతు

రైతన్నకు ఏదో చేయాలని..



రైతన్నకు ఏదో చేయాలనే సంకల్పంతోనే ఈ ఆలోచన వచ్చింది. స్నేహితులంతా ఒక్కటై ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రైతు అనే వాడికి కులం లేదు మతం లేదు. అందుకే నిరుపేద రైతులను ఎంపిక చేసి, వారికి చేతనైనంత సాయం చేస్తున్నాం.

– రాజా శ్రీనివాస్‌రావు, దుబాయ్

రైతుల కష్టం తెలుసు కాబట్టి..



రైతుల కష్టం తెలుసు కాబట్టి స్నేహితులందరం ఈ నిర్ణయం తీసుకున్నాం. రానున్న రోజుల్లో ఈ కార్యక్రమాన్ని మరింతగా ముందుకు తీసుకెళ్తాం. రైతులను చైతన్యం చేసే కార్యక్రమాలతో పాటు వారికి అండగా ఉండాలని నిర్ణయించుకున్నాం.

– చైతన్య, దుబాయ్

కోటిలింగాలకు పర్యాటక శోభ

- నేడు ప్రారంభంకానున్న లాంచీలు
- ఇక జలవిహార కేంద్రంగా శాతవాహనుల రాజధాని
- కనువిందు చేయనున్న గోదావరి అందాలు
- ప్రారంభించనున్న మంత్రి ఈటల రాజేందర్

గొల్లపల్లి(ధర్మపురి): శాతవాహనుల తొలి రాజధానిగా విరాసిల్లి, కోటగోడల నగరంగా ప్రసిద్ధిచెందిన జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం కోటిలింగాల ఇక పర్యాటక శోభను సంతరించుకోనుంది. ఎల్లంపల్లి బ్యాక్‌వాటర్‌తో నిండుకుండలా ఉన్న గోదావరి తీరం జలవిహారానికి ముస్తాబైంది. నేటి నుంచి పడవ(లాంచీ) ప్రయాణం ప్రారంభం కానుండటంతో పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులకు ఆహ్లాదాన్ని పంచనుంది. ఉమ్మడి జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేస్తూ జగిత్యాల జిల్లాకు పర్యాటక మణిహారంగా వెలుగొందనుంది.



కోటిలింగాల ఆలయం...

శాతవాహనుల రాజధాని చరిత్ర ఇది..

కోటిలింగాల రెండు వేల సంవత్సరాల క్రితం ప్రపంచ చరిత్ర కలిగిన ప్రదేశం. శాతవాహనులు ఇక్కడి నుంచే దక్షిణ భారతదేశాన్ని పాలించారు. వీరి కాలంలోనే తెలుగు, బౌద్ధ మతాలు వ్యాప్తి చెందాయి. శాతవాహనుల మొదటి చక్రవర్తి శ్రీముఖుడు స్వయంగా రాజ్యాన్ని స్థాపించి పరిపాలన ప్రారంభించిన కోట కోటిలింగాల. శ్రీముఖుడికి సంబంధించిన ఆనవాళ్లు ఇక్కడ దొరకడంతో శాతవాహనుల చరిత్రకు బలమైన ఆధారాలు ఇక్కడి ప్రాంతాల్లో బయటపడ్డాయి.

శాతకర్ణి జన్మస్థలం...

గౌతమీపుత్ర శాతకర్ణి పుట్టిన ప్రదేశం ఇదే. 1979లో ఇక్కడ పురవాస్తుశాఖ వారు తవ్వకాలు ప్రారంభించక ముందు అమరావతి, ధాన్యకటకానికి, శాతవాహన ప్రాముఖ్యత ఉండేది. శాతవాహనుల కోట కాలగర్భంలో కలిసిన చోటే కోటిలింగాల గ్రామం వెలిసింది. ఇక్కడివారు కోటగోడలతో గృహాలు నిర్మించుకున్నారు. వ్యవసాయ పనులు చేస్తున్న సమయంలో ముద్దపైసలు, రాగి,సీసంతో తయారు చేసినవి, పెంకులు, ఇటుకలు, ఇనుము పరికరాలు బయటపడేవి. శాతవాహన కోట ఈశాన్య భాగం బురుజుపైనే ప్రస్తుత కోటేశ్వర స్వామి ఆలయం వెలిసింది. చుట్టుపక్కల ఉన్న మునులగుట్ట, పాశాయ్‌గామ్, స్తంభంపల్లి తదితర ప్రాంతాల్లో శాతవాహనుల ఆనవాల్లు ఉన్నాయి. ఇవన్నీ ఇక్కడి పర్యాటకానికి అనుకూలించే అంశాలుగా చెప్పుకోవచ్చు.

మూడు జిల్లాల సంగమం

పడవలతో మూడు జిల్లాల్లో జలవిహారానికి అవకాశాలు అందివస్తున్నాయి. కోటిలింగాల నుంచి మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట్ రేవును తాకుతు పులోమావి పేరుతోతో ఒక పడవ, రాయపట్నం బ్రిడ్జి నుంచి ఎల్లంపల్లి జలాశయం వరకు శాతకర్ణి పేరుతో మరో పడవను నడిపించనున్నారు. పులోమావి పడవ 30 సీట్ల సామర్థ్యం, శాతకర్ణి పడవ 50 సీట్ల సామర్థ్యంతో నిత్యం గోదావరిలో నడిపించనున్నారు.



పులోమావి పడవ

బీజం పడింది ఇలా..

ఎల్లంపల్లి నిర్మాణంతో కోటిలింగాల వద్ద గోదావరి పర్యాటకానికి అనుకూలంగా ఉంటుందని గ్రామస్తులు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వ చీఫ్ కొప్పుల ఈశ్వర్ ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంతం కావడంతో ఆదిశగా ప్రయత్నాలు చేశారు. 2005 గోదావరి పుష్కరాల సందర్భంగా పర్యాటక అభివృద్ధికి బీజం పడిందని చెప్పొచ్చు. ఆవతలి తీరంలో మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట్ రేవు ఉంది. రెండు జిల్లాలను కలుపుతూ పుష్కరాల సమయంలో పడవ ప్రయాణం సాగింది. మంత్రులు హరీష్‌రావు, ఈటల, దేవాదాయశాఖ ఇంద్రకరణ్ రెడ్డి, అటవీశాఖ మంత్రి జోగురామన్న నదిలో పడవ ప్రయాణం చేశారు. ఆ సమయంలో కొప్పుల బోటింగ్ విషయమై వివరించారు. ఫలితంగా పర్యాటకశాఖ ద్వారా పడవలు మంజూరయ్యాయి.

కొంత ప్రతికూలమే..

ప్రస్తుతం ఎల్లంపల్లి జలాశయం వరకు మత్యకారులు చేపలకోసం వలలు వేసుకుని ఉన్నారు. దీంతో కోటి లింగాల–లక్సెట్టిపేట మధ్య పడవ నడిచేందుకు కొంత ప్రతికూల పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇరు శాఖలు సమన్వయంగా పని చేసి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి ఎల్లంపల్లి వరకు పడవను నడిపించే ప్రయాత్నాలు చేస్తున్నారు. దీంతో పాటు 8సీట్ల సామర్థ్యం ఉన్న స్పీడ్‌బోట్ కూడ అందుబాటులో ఉంది.

మంత్రి చేతుల మీదుగా ప్రారంభం

గోదావరిలో బోటింగ్‌ను మంత్రి ఈటల రాజేందర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించనున్నారు. నేటి ఉదయం పది గంటలకు కార్యక్రమం ఉంటుందని ఎంపీపీ పోనగోటి శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమానికి మంత్రి హరీశ్‌రావు, చీఫ్‌విప్ కొప్పుల ఈశ్వర్, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పేర్వారం రాములు, కల్టెకర్ శరత్, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కానున్నట్లు తెలిపారు. ఇందు కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

పర్యాటకంగా వెలుగొందాలి



రెండు తెలుగురాష్ట్రాల్లో మరెక్కడ లేని విధంగా కోటి లింగాల ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తాం. శాతవాహన చారిత్రక అస్థిత్వాన్ని కాపాడేందుకు కృషి చేస్తాం. ఎలాంటి ముప్పు వాటిల్లకుండా ఆలయానికి రక్షణ గోడ నిర్మిస్తాం. జింకల పార్కు, ఉడెన్ బ్రిడ్జి, గార్డెన్ నిర్మిస్తాం. ఇక్కడ ఎల్లంపల్లి బ్యాక్ వాటర్‌తో 365 రోజులు పడవ ప్రయాణానికి అనుకూలంగా ఉంటుంది.

– కొప్పుల ఈశ్వర్, చీఫ్‌విప్

కోటిలింగాల అభివృద్ధే లక్ష్యం



బోటింగ్ అంటే రాజమండ్రి, పాపికొండలే కాదు. కోటిలింగాల కనబడేలా చేస్తాం. చీఫ్‌విప్ చొరవతో పడవలు మంజూరు అయ్యాయి. గంగపుత్రులకు బోటింగ్ నిర్వహణపై హైదరాబాద్‌లో ప్రత్యేక శిక్షణ ఇప్పించాం. దీంతో పలు కుటుంబాలకు ఉపాధి అవకాశాలు కల్పించిన వారిగా భావిస్తున్నాం.

– పొనగోటి శ్రీనివాసరావు, ఎంపీపీ వెల్గటూరు



కోటిలింగాల గోదావరిలో పడవఎక్కి పరిశీలిస్తున్న చీఫ్‌విప్

పెద్దపల్లి | శనివారం | జనవరి | 6 | 2018 సాక్షి

టీబీజీకేఎస్ కమిటీల ఏర్పాటుపై కసరత్తు

7న ప్రకటించే అవకాశం..?

గోదావరిఖని: సింగరేణిలో గుర్తింపు సంఘంగా విజయం సాధించిన తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) కమిటీల ఏర్పాటుపై టీఆర్ఎస్ పార్టీ కసరత్తు చేస్తోంది. 2017 అక్టోబర్ 5న ఎన్నికలు జరగగా కమిటీలను ఏర్పాటు చేయకపోవడంపై యూనియన్ శ్రేణులు తీవ్ర అసహనంతో ఉన్నారు. గనులు, ఓసీపీలపై పేరుకుపోయిన కార్మిక సమస్యలను పరిష్కరించేందుకు యాజమాన్యం ముందుకు రావడం లేదు. రక్షణ సమావేశాలు, స్ట్రక్చర్ సమావేశాలు జరగకపోవడంతో ఏరియాల వారిగా సమస్యలను ప్రస్తావించేందుకు అవకాశం లేకుండా పోయింది. సింగరేణిలో గుర్తింపు సంఘంగా గెలిచినప్పటికీ సమస్యలను పట్టించుకోకపోవడంతో కార్మికులు యూనియన్ నేతలపై ఆగ్రహంతో ఉన్నారు. దీనికి తోడు ఏ నాయకుడిని పిలిచి మాట్లాడాలనే విషయంపై సరైన నిర్ణయం వెలువడకపోవడంతో గని అధికారులు కూడా నాయకులతో సంప్రదింపులు జరపడం లేదు. ఈ తరుణంలో నాయకుల నుంచి వచ్చిన ఒత్తిడి మేరకు ఎన్నికలు జరిగిన సరిగ్గా మూడు నెలల



తర్వాత శుక్రవారం సాయంత్రం హైదరాబాద్‌లో టీఆర్ఎస్ ముఖ్య నేతలు, పలువురు కోల్‌బెల్ట్ ప్రాంతానికి చెందిన ప్రజాప్రతినిధులు, గుర్తింపు ఎన్నికల సమయంలో కీలకంగా పనిచేసిన పలువురు నాయకులు సమావేశమయ్యారు. కమిటీల ఏర్పాటుపై చర్చించినట్లు తెలిసింది. అయితే టీబీజీకేఎస్ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శుల పదవులను సీఎం కేసీఆర్ ప్రకటించే అవకాశం ఉండగా, 11 ఏరియాల ఉపాధ్యక్షులతో పాటు కేంద్ర స్థాయిలో ఉండే 8 మంది సభ్యులతో కూడిన కమిటీని నియమించేందుకు నేతలు ఒక నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. కాగా ఏయే కమిటీల్లో ఎవరెవరిని నియమించాలనేది ఇంటిలిజెన్స్, విజిలెన్స్ నివేదికల ఆధారంగా నిర్ణయించనున్నట్లు తెలిసింది. అయితే జనవరి 9 నుంచి నెలాఖరు వరకు టీబీజీకేఎస్ గౌరవాధ్యక్షురాలు ఎంపీ కవిత అమెరికా పర్యటనకు వెళుతున్న క్రమంలో తిరిగి ఈనెల 7న నేతలు సమావేశం కావాలని నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. అదేరోజు ఆయా కమిటీల ప్రకటన వెలువడే అవకాశం ఉన్నట్లు శ్రేణుల్లో ప్రచారం జరుగుతోంది.

పెరుగుతున్న ఆశావాహులు

గుర్తింపు సంఘం టీబీజీకేఎస్‌లో కేంద్ర కమిటీలోని పదవులకు పోటీ పడే నాయకులు ఎక్కువగా లేకపోయినా 11 ఏరియాల ఉపాధ్యక్షులు, 8 మంది సభ్యులు గల కేంద్రస్థాయి స్ట్రక్చర్ కమిటీ, గనులు, ఓపెన్ కాస్ట్, డిపార్ట్‌మెంట్ల వరంగా పిట్ కార్యదర్శులు, మైన్స్ కమిటీ, సేఫ్టీ కమిటీలు, టెంపుల్ కమిటీలను ఏర్పాటు చేయాల్సి ఉండగా, ఈ పదవుల కోసం పోటీ పడేవారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ఇదిలా ఉండగా గుర్తింపు ఎన్నికల సమయంలో వివిధ యూనియన్ల నుంచి టీబీజీకేఎస్‌లో చేరిన కార్మిక నాయకులకు కూడా పదవులు ఇవ్వాలనే డిమాండ్ పెరుగుతోంది. ఈ తరుణంలో ఆయా పదవులు ఎవరిని వరిస్తాయనేది చర్చనీయాంశమైంది.

ప్రభావిత గ్రామాల నిరుద్యోగులకు

ఉపాధి కల్పనే లక్ష్యం

ముత్తారం/యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి ప్రభావిత గ్రామాల్లోని నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే సంస్థ ధ్యేయమని సింగరేణి సేవా సమితి ఆర్జీ-3 అధ్యక్షురాలు వసుధారాజేందర్ పేర్కొన్నారు. సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారంపేట పంచాయతీ పరిధి రాజాపూర్‌లో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం ఆమె ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సింగరేణి ప్రభావిత గ్రామాల ప్రజల సంరక్షణ కోసం సంస్థ అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుందని వివరించారు. గ్రామగ్రామాన వైద్య శిబిరాలు, మినరల్ వాటర్ ప్లాంట్లు, మౌళిక సదుపాయాలు



మాట్లాడుతున్న వసుధారాజేందర్

కల్పిస్తున్నట్లు వివరించారు. కార్యాక్రమంలో సేవా సమితి సభ్యులు శోభావీరారెడ్డి, ఓసీపీ2 పీవో హన్మకొండ వీరస్వామి, ఎస్‌ఓటూ జీయం పంజాల శ్రీనివాస్, పర్సనల్ మేనేజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు

గురుకుల విద్యాలయాల్లో ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభం

రామగుండం: గురుకుల విద్యాలయాల రెసిడెన్సియల్‌లో ఇంటర్ విద్యకు ఈనెల 7లోగా దరఖాస్తు చేసుకోవాలని సాంఘీక సంక్షేమ గురుకుల విద్యాలయ జిల్లా సమన్వయాధికారి పోతుల అపర్ణ తెలిపారు. 2018 మార్చిలో పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు ప్రవేశానికి అర్హులని తెలిపారు. గురుకుల రెసిడెన్సియల్‌లో చేరే విద్యార్థులు ఐఐటీ/నీట్/సీఏ-సీపీటీ/సీఎల్ఏటీ తదితర సంస్థలలో ప్రవేశం పొందేందుకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈనెల 28న ప్రవేశ పరీక్ష ఉంటుందని, www.tr-w-r-eir.teanfana.gov.inకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

8న సీఎంపీఎఫ్ చిట్టీల పంపిణీ

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్-2లో ఈనెల 8న సీఎంపీఎఫ్ చిట్టీలను పంపిణీ చేయనున్నట్లు టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్ తెలిపారు. 2016-17 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సీఎంపీఎఫ్ నిల్వల వివరాలను అందజేయనున్నట్లు పేర్కొన్నారు. టీబీజీకేఎస్ కృషి వల్లే స్లిప్పులను అందించేందుకు యాజమాన్యం ఒప్పుకుందన్నారు.

8న అమ్మకానికి పోలీస్ పాత వాహనాల టైర్లు

గోదావరిఖని: రామగుండం పోలీస్ కమిషనరేట్ పోలీస్ వాహనాల విభాగంలో (164) పాత వాహనాల టైర్లు, ట్యూబులు, వాహన పాత విడి భాగాలు, 50 బ్యాటరీలు విక్రయించేందుకు నిర్ణయించామని రామగుండం పోలీస్ కమిషనర్ విక్రమ్‌జిత్ దుగ్గల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 8న స్థానిక పోలీస్ హెడ్‌క్వార్టర్‌లో నిర్వహించే విక్రయ కార్యక్రమానికి ఆసక్తి గల వ్యాపారులు, ప్రజలు పాల్గొనవచ్చని ఆయన తెలిపారు. పోలీస్ హెడ్‌క్వార్టర్‌లోని మోటార్ వాహనాల కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి టైర్ల అమ్మకం ప్రారంభమవుతుందని, ఇతర వివరాలకు పోలీస్ వాహనాల అధికారి, ఆర్ఐ మధుకర్‌ను 9440795069 నెంబర్‌లో సంప్రదించాలని సీపీ పేర్కొన్నారు.

పేద విద్యార్థులకు ఎన్టీపీసీ అండ

దీప్తి మహిళా సమితి అధ్యక్షురాలు దీప



మాట్లాడుతున్న దీప దూబే

జ్యోతినగర్: పేదవిద్యార్థులకు ఎన్టీపీసీ రామగుండం సంస్థ అండగా ఉంటుందని ఎన్టీపీసీ దీప్తి మహిళా సమితి అధ్యక్షురాలు దీప దూబే అన్నారు. శుక్రవారం మేడిపల్లి సెంటర్ సాయి సేవా సమితి ఉచిత విద్యాలయానికి చెందిన 135మంది విద్యార్థులకు దుస్తుల పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్య అందరికి అందాలనే ఉద్దేశ్యంతో పేద విద్యార్థులకు తమ వంతుగా సేవ చేస్తున్నామన్నారు. సమితి ఆధ్వర్యంలో పేదలకు ఉచిత దుస్తులు, మహిళలకు కుట్టుశిక్షణ, వయోజనులకు చదువు నేర్పించడం లాంటి కార్యక్రమాలను చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో గీతాప్రసాద్, ముఖ్య వైద్యాధికారి సశ్మ తాడ్యాస్, పద్మశ్రీతో పాటు సీఎస్ఆర్ అధికారులు, ఉచిత పాఠశాల ఉపాధ్యాయులు, సాయి సేవా సమితి నిర్వాహకులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో నిలిచిపోయిన రెండు సూపర్‌ఫాస్ట్ రైళ్లు

- గంటసేపు ప్లాట్‌ఫారంపైనే నిలిచిన వైనం



2,3వ నెంబర్ ప్లాట్‌ఫారంపై నిలిపిన సూపర్‌ఫాస్ట్ రైళ్లు

రామగుండం: న్యూఢిల్లీ నుంచి చెన్నై వైపు వెళ్లే పలు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను శుక్రవారం రామగుండం రైల్వేస్టేషన్‌లో గంటపాటు నిలిపివేయడంతో ప్రయాణికులు ఒకింత ఆందోళనకు గురయ్యారు. పొత్కపల్లి వద్ద నూతన రైల్వే వంతెన నిర్మాణమవుతుండడంతో విజయవాడ, సికింద్రాబాద్ వైపు వెళ్ళు పలు రైళ్లను పలు రైల్వేస్టేషన్లలో ముందస్తుగా నిలిపివేశారు. అలాగే న్యూఢిల్లీ నుంచి వైజాగ్ వైపు వెళ్ళు ఏపీ ఏపీ ఎక్స్‌ప్రెస్, హజ్రత్ నిజాముద్దీన్ నుంచి హైదరాబాద్ వెళ్ళు దక్షిణ్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను రామగుండం రైల్వేస్టేషన్‌లో నిలిపివేశారు. కాగా ముందస్తు సమాచారం లేకపోవడంతో ఆందోళనకు గురైన ప్రయాణికులు, విషయం తెలియడంతో ఊపిరి పీల్చుకున్నారు.

ఎఫ్ఐటీయూ జాతీయ మహాసభలు

యైటింక్లయిన్‌కాలనీ: ఈనెల 7, 8 తేదీల్లో ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూ నియన్స్ (ఎఫ్ఐటీయూ) 2వ, జాతీయ మహాసభలు కోల్‌కత్తాలో నిర్వహిస్తున్నట్లు నాయకులు మహ్మద్ ఇస్మాయిల్, మహ్మద్ సిరాజుద్దీన్ తెలిపారు. ఫాసిజం, లేబర్‌పాలసీ, కార్పొరేట్‌పాలసీకి వ్యతిరేకంగా ఈసభలో నిర్ణయాలు తీసుకోనున్నట్లు వివరించా రు. 15రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు పాల్గొననున్న ఈ ర్యాలీలో సుమారు 15వేల మందితో భారీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నేడు ఆర్జీ-3లో బొమ్మల కొలువు

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ-3 ఏరియా సీఎస్‌ఓఏ క్లబ్‌లో శనివారం బొమ్మ కొలువు నిర్వహిస్తున్న మహిళా క్లబ్ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ముగ్గుల పోటీలు, వివిధ రకాల బొమ్మలతో అలంకరించిన బొమ్మల కొలువుతో పాటు, సాం స్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

ఇసుక, నీళ్ల దోపిడీని అడ్డుకుంటాం

- ప్రభుత్వ అండతోనే సహజ వనరుల లూటీ
- త్వరలో ప్రాజెక్టుల బాట
- డీసీసీ అధ్యక్షుడు కటుకం మృత్యుంజయం



మాట్లాడుతున్న కటుకం మృత్యుంజయం

కరీంనగర్: ప్రభుత్వ పెద్దల అండ, ముఖ్యమంత్రి కేసీఆర్ బంధువర్గం భాగస్వామ్యంతోనే ఇసుక మాఫియా వ్యాపారం మూడు పువ్వులు ఆరుకాయలుగా కొనసాగుతుందని డీసీసీ అధ్యక్షుడు కటుకం మృత్యుంజయం అన్నారు. శుక్రవారం ఆయన నివాసంలో మాట్లాడారు. నీళ్లు, నిధులు, నియమకాలు లక్ష్యంతో అధికారంలోకి వచ్చిన టీఆర్ఎస్ వాటికి పాతరేసిందన్నారు. సహజ వనరుల దోపిడీని యథేచ్ఛగా సాగిస్తుందని విమర్శించారు. ప్రభుత్వ కనుసన్నల్లో ఇసుక మాఫియా సాగిస్తూ.. ముఖ్యమంత్రి బంధువర్గం కోట్లాది రూపాయల అక్రమార్జనకు పాల్పడుతుందని మండిపడ్డారు. సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తున్నామని హడావుడి చేస్తున్న టీఆర్ఎస్ నేతలు జలదోపిడీకి పన్నాగం పన్నారని ఆరోపించారు. కాళేశ్వరం నుంచి మిడ్‌మానేరు ప్రాజెక్టును నింపి మల్లన్నసాగర్‌లోకి నీటిని తరలించేందుకే తహతహలాడు తున్నారన్నారు. త్వరలోనే ప్రాజెక్టుల బాట కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు కర్ర రాజశేఖర్, ఆకుల ప్రకాష్, ఒంటెల రత్నాకర్, రహమత్ హుస్సేన్, నాగి శేఖర్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

నాన్నా చెప్పవా

బుల్లెట్ ప్రూఫ్ రహస్యం ఏమిటి?



బుల్లెట్ ప్రూఫ్ గుండా బుల్లెట్ దూసుకుపోకుండా ఒక రకమైన ప్లాస్టిక్ నిరోధిస్తుంది. దానిని లామినేట్ అంటారు. మొదట గాజు, ఆ తరువాత ప్లాస్టిక్, మళ్ళీ గాజు ఇలా బుల్లెట్ ప్రూఫ్ అమరిక ఉంటుంది. ఇది మామూలు అద్దం కంటే మందంగా ఉంటుంది. ఇందులో మధ్యలో వాడే లామినేట్ ప్లాస్టిక్ పాలీ కార్బనేట్ పదార్థం. ఇది చాలా దృఢమైనదే కాక పారదర్శకంగానూ ఉంటుంది. కవచం వంటి ఈ బుల్లెట్ ప్రూఫ్ గుండా బుల్లెట్ (తూటా) దూసుకు రాలేదు. మొదటి పొర అయిన గాజు లోంచి చొచ్చుకుపోయినా ఆ తర్వాత పొర అయిన పాలీ కార్బనేట్ లామినేట్ బుల్లెట్‌కు గల దూసుకుపోయే శక్తిని అడ్డుకుంటుంది. దీంతో బుల్లెట్ లోనికి చొచ్చుకు పోలేదు.

గాలితో పని లేని జీవులున్నాయా?



ఉన్నాయనే అంటున్నారు పరిశోధకులు. మధ్యధరా సముద్ర గర్భంలో ఏ మాత్రమూ ప్రాణ వాయువు జాడ లేని ప్రాంతంలో కొత్త జీవరాశిని పరిశోధకులు కనుగొన్నట్టు సైన్సు డైలీ ప్రకటించింది. చుట్టూ విషపూరిత సల్ఫేడ్‌లు కలిగిన వాతావరణంలో సముద్రగర్భంలో ఉన్న ఆ జీవులను లోరిసీఫెరా వర్గంలో చేర్చారు. ఈ జీవుల్లో జీవక్రియలు బాగానే సాగుతున్నాయని, అంతే కాకుండా ఏ మాత్రమూ ప్రాణ వాయువు లేని ప్రాంతంలో పునరుత్పత్తి ప్రక్రియ కూడా ఈ జీవుల్లో సజావుగా సాగుతోందని గుర్తించారు. ప్రస్తుతం వీటిపై పరిశోధన కొనసాగుతోంది.


రంగులు వేయండి








పైన ఉన్న వింత మనిషి కింద ఉన్న పండు దగ్గరికి రావాలి. దారి చూపండి.



పైన ఉన్న రెండు బొమ్మల మధ్య 15 తేడాలు ఉన్నాయి. గుర్తించండి.

పూరించండి

పక్కన కొన్ని బాక్సులు, వాటి కింద కొన్ని బొమ్మలున్నాయి. ప్రతి బొమ్మ ఇంగ్లిష్ పేరును మొదటి అక్షరంతో పజిల్‌ను పూర్తిచేయండి. పూర్తయ్యాక వచ్చే పదం మనకు ఎదురుపడిన కనిపించే బొమ్మ ఇంగ్లిష్ పదం అవుతుంది. ట్రై చేయండి చూద్దాం!



పూరించండి – జవాబు
Vampire Bat

కింది పజిల్‌లో పక్కన ఉన్న బొమ్మల పేర్లు అడ్డం, నిలువులుగా ఎక్కడ ఉన్నాయో గుర్తించండి.

toy	b	o	a	t	p	p
boat	x	y	b	c	e	o
star	f	s	e	m	a	t
potty	s	t	a	o	c	t
peach	y	a	c	s	h	y
beach	p	r	h	y	o	t

ఎడమవైపున ఉన్న బొమ్మను చూస్తూ కుడివైపున బొమ్మ గీయండి



వెండితెర



ఎంసీఏ
శ్రీనివాస్
(పెద్దపల్లి –222 756) 11.30, 2.30, 6.30, 9.30

ఒక్క క్షణం
సంగీత
(పెద్దపల్లి –222 756) 11.30, 2.30, 6.30, 9.30)

సీసీ కెమెరాతో దక్కిన నగదు, ఆభరణాలు

- ఆటోలో మరిచిన బాధితురాలు
- 8 గంటల్లోనే అప్పగించిన పోలీసులు



బంగారు ఆభరణాలు అప్పగిస్తున్న ఏసీపీ హబీబ్‌ఖాన్

సుల్తానాబాద్: మండలంలోని గట్టెపల్లికి చెందిన నూతన వధువు బండారి భాగ్య ఐదు తులాల బంగారు ఆభరణాలు, నగదుతో కూడిన పర్సును గట్టెపల్లి నుంచి సుల్తానాబాద్‌కు శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు ఆటోలో వెళ్తూ జార విడుచుకుంది. వెంటనే ఆటో వద్ద వెతికినప్పటికీ దొరకకపోవడంతో తన సోదరుడు రమేశ్‌కు సమాచారం ఇవ్వడంతో పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు అప్రమత్తమై నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ పుటేజీల ఆధారం చేసుకుని విచారణ చేపట్టారు. సుల్తానాబాద్ ప్రభుత్వ కార్యాలయంలో పనిచేసే ఓ ఉద్యోగినికి దొరికిన పర్సును ఇచ్చేందుకు అంగీకరించకపోవడంతో మీరు పర్సు తీసుకున్నట్లు సీసీ పుటేజీ మా వద్ద ఉందని, దాని ఆధారంగానే కరీంనగర్‌లో ఉన్న మీవద్దకు వచ్చామని వివరించడంతో రేపు ఇస్తామని చెప్పగా పోలీసుస్టేషన్‌కు రావాలని కోరగా తన వద్ద ఉన్న పర్సును తెచ్చి అప్పగించినట్లు కానిస్టేబుల్ గౌరయ్య తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు పోగొట్టుకున్న బంగారు ఆభరణాల పర్సును రాత్రి 8 గంటలకు నూతన వధువుకు అప్పగించడంతో పోలీసులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. స్వాధీనం చేసుకున్న పర్సును ఏసీపీ హబీబ్‌ఖాన్ ఆమెకు సుల్తానాబాద్‌లోని సీఐ కార్యాలయంలో అప్పగించారు. దీంతో కానిస్టేబుల్ గౌరయ్య, ఏఎస్సై రవీందర్‌రెడ్డికి రూ.2వేల నగదు ప్రోత్సాహకాన్ని వారికి అందించారు. కార్యక్రమంలో సీఐ అడ్లూరి రాములు, ఎస్సై దేవేందర్, ఏఎస్సై భాగ్య పాల్గొన్నారు.

ఆర్థిక చేయూత



ఆర్థిక సాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

ఎలిగేడు: మండలంలోని ధూళికట్టలో చిన్ననాటి నుంచి పదోతరగతి వరకు (2003–2004 బ్యాచ్) 57 మంది ఒకే తరగతి గదిలో చదువుకున్నారు. గ్రామంలోని మద్దివేని మంగ కొంత కాలంగా పక్షవాతంతో మంచాన పడి లేవలేని స్థితిలో నరకయాతన అనుభవిస్తుండడంతో అన్నీ తానై చిన్న కొడుకు సేవలందిస్తుండగా..మందులు, కుటుంబపోషణ కష్టసాధ్యం కావడంతో మేమున్నామంటూ పూర్వ విద్యార్థులు ముందుకు వచ్చి అభాగ్యురాలికి ఆర్థిక చేయూతనిచ్చారు. మద్దివేని మంగ ఇంటిని శుక్రవారం సందర్శించి రూ.10వేల ఆర్థిక సాయం అందించారు. మరికొంతమంది దాతలు ముందుకు వచ్చి ఆదుకోవాలని కోరారు. ఇటీవల 'సాక్షి'లో వచ్చిన తండ్రీ కొడుకుల నరకయాతనకు స్పందించిన పూర్వ విద్యార్థులు అట్టెపల్లి శంకరయ్య, సంతోష్‌ల కుటుంబాలకు రూ.35 ఆర్థిక సాయం అందించిన విషయం విధితమే. ఆర్థిక సాయం అందించి అండగా నిలుస్తున్న 2003–2004 ఎస్సెస్సీ బ్యాచ్ పూర్వవిద్యార్థులను గ్రామస్తులు అభినందిస్తున్నారు.

బండి నడుస్తుండగానే ఎద్దు మృతి

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని పెద్దరాతుపల్లిలో శుక్రవారం ఎడ్ల బండికి కట్టిన ఎద్దు నడుస్తుండగానే మృతి చెందింది. పొలం పనులకు వెళ్తుండగా ఒక్కసారిగా దొబ్బరోగంతో ఎద్దు ఎగిరి మృత్యువాత పడింది. దీంతో బండిపైకి లేవడంతో అందులో ప్రయాణిస్తున్న రైతు దంపతులు బండి మల్లయ్య దంపతులు బండి దిగి ప్రాణాలతో సురక్షితంగా బయటపడ్డారు. మృతి చెందిన ఎద్దు విలువ రూ.40 వేలుంటుందని బాధిత రైతు వాపోయాడు.

భూ రికార్డుల శుద్ధీకరణ సద్వినియోగం చేసుకోవాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీవో

ఎలిగేడు: రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా చేపట్టి నిర్వహిస్తున్న భూ రికార్డుల శుద్ధీకరణను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో అశోక్‌కుమార్ అన్నారు. మండలంలోని బుర్హాన్‌మియాపేట, ర్యాకల్‌దేవుపల్లి గ్రామాల్లో రెండో విడత గ్రామసభలు శుక్రవారం జరిగాయి. ర్యాకల్‌దేవుపల్లిలోని గ్రామసభను ఆర్డీవో అశోక్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. గత భూ రికార్డుల ప్రక్షాళన సభల్లో రైతుల నుంచి స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి తప్పుఒప్పులను సవరించడం జరిగిందని, సవరించిన జాబితాను రెండోవిడత గ్రామసభల్లో రైతులకు 1బీ, పహణీ నకల్‌లను రైతులకు అందజేస్తున్నామనీ అందులో ఏమైన తప్పుఒప్పులుంటే తమ దృష్టికి తీసకవస్తే సరిచేస్తారని పేర్కొన్నారు. తహసీల్దార్ ఆర్.సురేశ్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, సర్పంచులు మందల సంగీతరెడ్డి, గోదల మంగ, ఎంపీటీసీ కాంపెల్లి విజయ, ఆర్ఐ అమ్జద్, వీఆర్వోలు సురేందర్, ప్రసాద్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఏఐటీయూసీ ఆందోళన



రాస్తారోకో చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

ధర్మారం: కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్న ఎంవీ యాక్ట్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయుసీ ఆధ్వర్యంలో ధర్మారంలో శుక్రవారం డ్రైవర్లు రాస్తారోకో చేశారు. ఏఐటీయూసీ నాయకులు కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలకు వ్యతిరేకంగా అంబేద్కర్ చౌరస్తాలో రాస్తారోకో చేశారు. ఏఐటీయూసీ నాయకులు ఆవుల కొమురయ్య మాట్లాడుతూ మోటార్ వెహికిల్ చట్టం ప్రకారంగా వాహనడ్రైవర్ ప్రమాదం చేస్తే లక్ష రూపాయల జరిమానాతోపాటు 5 ఏళ్ల జైలుశిక్ష లైసెన్స్ రద్దు చేయటం లాంటి నిర్ణయం సరికాదనిఅన్నారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆవుల శ్రీనివాస్, వ్యాన్, ఆటో యూనియన్ నాయకులు, డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ విడుదల

జూలపల్లి: బీసీ యువజన సంఘం క్యాలెండర్‌ను మండల బీసీ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు నోమూరి శ్రీధర్‌రావు మాట్లాడుతూ బీసీలందరు ఐక్యంగా ఉండి తమ డిమాండ్ల సాధనకై ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షులు పెండ్యాల సురేందర్, మండలాధ్యక్షుడు కోరెపు సంపత్, ఉపాధ్యక్షుడు రంగు రాజేశం, గ్రామ శాఖ అధ్యక్షులు మామిడిశెట్టి శ్రీనివాస్, కూసి రాజయ్య, ముమ్మాడి రవి, మడ్లపెల్లి శ్రీనివాస్, గుమ్మడి స్వామి, అబ్బోజు తిరుపతిచారి తదితరులున్నారు.

సీఎంను కలిసిన టీఆర్ఎస్ యూత్ నాయకులు



కేసీఆర్‌తో కర్రె దేవేందర్‌రెడ్డి

పెద్దపల్లిటౌన్: రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావును హైదరాబాద్ ప్రగతిభవన్‌లో టీఆర్ఎస్ యువత నాయకులు కర్రె దేవేందర్‌రెడ్డి కలిశారు. ఈసందర్భంగా దేవేందర్‌రెడ్డి సీఎం కేసీఆర్‌తో తాను టీఆర్ఎస్‌పార్టీలో ఆవిర్భావం నుంచి పని చేస్తున్నానని, పార్టీలో తగిన గుర్తింపు ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. ఆయన వెంట నాయకులు నాగపురి రాజు తదితరులున్నారు.

Zone Guide

18 నుంచి రాష్ట్రస్థాయి సీనియర్ వాలీబాల్ పోటీలు

పెద్దపల్లిటౌన్: ఉమ్మడి కరీంనగర్ జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 18 నుంచి 21 వరకు రాష్ట్రస్థాయి సీనియర్ పురుషులు, మహిళలకు వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వహక కార్యదర్శి, సీఐ ఎడ్ల మహేశ్ తెలిపారు. పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించే క్రీడాపోటీల్లో పది పురుషుల జట్లు, పది మహిళా జట్లు పాల్గొంటున్నాయన్నారు. పోటీల నిర్వహణ కమిటీ అధ్యక్షుడిగా ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, కన్వీనర్‌గా పెద్దపల్ల ?జోన్ ఏసీపీ ఎండీ హబీబ్‌ఖాన్, ఉపాధ్యక్షుడిగా మున్సిపల్ చైర్మన్ ఎల్.రాజయ్య వ్యవహరిస్తున్నార న్నారు. క్రీడాభిమానులు, క్రీడాకారులు సహకరించాలని కోరారు. సమావేశంలో వాలీబాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గజ్జల రమేశ్‌బాబు, కోశాధికారి సీహెచ్ సుధీర్, ఉమ్మడి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం. రవీందర్, గిన్నె లక్ష్మణ్, డి.రమేశ్ పాల్గొన్నారు.

ముదిరాజ్ సంఘం జిల్లా కార్యదర్శిగా నర్సింగం



పెద్దపల్లి: పెద్దపల్లి జిల్లా ముదిరాజ్ మహాసభ జిల్లా కార్యదర్శిగా మటం నర్సింగంను నియమించినట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు బల్ల సత్తయ్య, రాష్ట్ర నాయకులు గుర్రాల మల్లేశంలు తెలిపారు. జిల్లాలో ముదిరాజ్‌ల ఐక్యత కోసం సంఘాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. తన నియామకానికి సహకరించిన పుట్ట మొండయ్య, రామానుజం, కుంభం సంతోష్, పుట్ట శివలకు కృతజ్ఞతలు తెలిపారు.

ముదిరాజ్ సంఘం అధ్యక్షుడిగా రెడ్డి సదయ్య



ఓదెల: ముదిరాజ్ సంఘం గ్రామశాఖ అధ్యక్షుడిగా రెడ్డి సదయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఓదెలలో జరిగిన సమావేశంలో కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా మంద కుమారస్వామి, కార్యదర్శిగా నర్సింగం, డైరెక్టర్లుగా పెండ్యాం రాములు, లక్ష్మణ్, సమ్మయ్య, సారయ్య, తిరుపతి, లక్ష్మణ్‌లు ఎన్నికయ్యారు.

ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షుడిగా మల్లేశం



ధర్మారం: ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షుడిగా చిలుక ఎల్లయ్యను నియమించినట్లు జిల్లా ఇన్‌చార్జి వెల్పుల సూకన్న మాదిగ తెలిపారు. అదేవిధంగా మండల కార్యదర్శిగా చిలవుక ఎల్లయ్య, కాంపెల్లి పోచయ్యలను నియమించారు.

జీవన్‌రెడ్డి జన్మదిన వేడుకలు




కేక్ కట్ చేస్తున్న నాయకులు

ధర్మారం/పెద్దపల్లిటౌన్: సీఎల్పీ ఉపనేత, జగిత్యాల ఎమ్మెల్యే తాటిపర్తి జీవన్‌రెడ్డి జన్మదిన వేడుకలను పెద్దపల్లి, ధర్మారంలో కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. పెద్దపల్లిలో జరిగిన కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు ఈర్ల కొమురయ్య, నాయకులు మంథని నర్సింగ్, బండారి సునిల్‌గౌడ్, బుర్ర అంజయ్య, సర్వర్, టాంక్ జైదేవ్, కోల అనిల్, బండి అనిల్, బండారి సుమన్, సోహేల్, కనుకుంట్ల సదానందం పాల్గొనగా, ధర్మారంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు ఎదుల్లా అంజయ్య, గౌడ గోవింద్, నున్సావత్ మెగ్యానాయక్, భూక్య రాజునాయక్, తిరుపతినాయక్, కల్లెం నరేందర్‌రెడ్డి, ఆవుల వేణు పాల్గొన్నారు,

లక్ష్యాల సాధనకు దేశం అమలు చేసే నిబంధనల రాజపత్రం



బొమ్మనబోయిన శ్రీనివాస్,
సీనియర్ ఫ్యాకల్టీ, హన్మకొండ



స్వతంత్ర భారత రాజ్యాంగ నిర్మాణం

పరిచయం: రాజ్యం మనుగడకు ప్రధాన ఆధారం.. రాజ్యాంగం. ప్రతి ప్రజాస్వామ్య దేశానికి రాజ్యాంగం అత్యవసరం. ఒక దేశ ప్రభుత్వ యంత్రాంగ రథచక్రాలు సాఫీగా సాగేందుకు రాజ్యాంగ సూత్రాలు మార్గదర్శకాలుగా పనిచేస్తాయి. రాజ్యాంగం అంటే.. దేశ పాలనా స్వభావం, లక్ష్యాల సాధన కోసం దేశం అమలు చేసే నిబంధనల రాజపత్రం. ప్రజల ఆశలు, ఆశయాలు, ఆకాంక్షలు, ఆసక్తులు, ఆదర్శాలను రాజ్యాంగం ప్రతిబింబిస్తుంది. స్వతంత్ర భారత రాజ్యాంగ నిర్మాణాన్ని, రాజ్యాంగ సభ ఉద్దేశాలను, భారత రాజ్యాంగ విశిష్ట లక్షణాలను ఈ పాఠం స్థూలంగా వివరిస్తుంది. ఈ పాఠ్యాంశ అధ్యయనం ద్వారా విద్యార్థులు భారత రాజ్యాంగ ప్రాథమిక స్వరూపాన్ని సంపూర్ణంగా అవగాహన చేసుకుంటారు.

- బ్రిటీష్ సామ్రాజ్యవాద, వలసవాద పాలన నుంచి భారతదేశం 1947, ఆగస్టు 15న స్వాతంత్ర్యం పొందింది. అయితే స్వాతంత్ర్యానికి ముందే స్వతంత్ర భారత ప్రభుత్వ పాలనా విధానాల రూపకల్పన (రాజ్యాంగం) అవసరాన్ని గుర్తించారు. అందులో భాగంగా రాజ్యాంగ రచనకు 389 మంది మేధావులతో 1946, ఆగస్టులో రాజ్యాంగ సభ (పరిషత్తు) ఏర్పడింది. వీరిలో 292 మంది వివిధ రాష్ట్రాల నుంచి, 93 మంది స్వదేశీ సంస్థానాల నుంచి, 4 గురు చీఫ్ కమిషనర్ (కేంద్రపాలిత) ప్రాంతాల నుంచి ఎన్నికయ్యారు. రాజ్యాంగ సభకు ఎన్నికైన వారిలో వివిధ వర్గాలు, ప్రాంతాలు, పార్టీలకు చెందినవారు ఉన్నారు. రాజ్యాంగ సభకు ఎన్నికైన వారిలో 26 మంది షెడ్యూల్డ్ కులాలకు చెందినవారితోపాటు 9 మంది మహిళలు కూడా ఉన్నారు. మెజార్టీ సభ్యులు మాత్రం భారత జాతీయ కాంగ్రెస్‌కు చెందినవారు కాగా, తర్వాత స్థానంలో ముస్లింలీగ్ పార్టీకి చెందినవారు ఉన్నారు. అయితే 1947, ఆగస్టు 14న దేశ విభజన జరిగి పాకిస్తాన్ ఆవిర్భవించింది. దాంతో పాకిస్తాన్‌కు చెందిన 90 మంది సభ్యులు తగ్గి, రాజ్యాంగ సభ సభ్యుల సంఖ్య 299కు చేరింది. రాజ్యాంగ సభ సభ్యులంతా ప్రజలతో ప్రత్యక్షంగా ఎన్నికవ్వలేదు. అయినప్పటికీ దేశ ప్రజలందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని రాజ్యాంగాన్ని రచించారు. రాజ్యాంగ సభ అధ్యక్షుడిగా బాబూ రాజేంద్రప్రసాద్ ఎన్నికయ్యారు.

ముఖ్యాంశాలు

- రాజ్యాంగంలో పొందుపరచాల్సిన వివిధ అంశాల అధ్యయనానికి కొన్ని కమిటీలను ఏర్పాటు చేశారు. వాటిలో రాజ్యాంగ ముసాయిదా (డ్రాఫ్టింగ్) కమిటీ అతి ముఖ్యమైంది. దీన్ని 1947, ఆగస్టు 29న ఏర్పాటు చేశారు. డా.బి.ఆర్.అంబేద్కర్ నాయకత్వంలోని 6 గురు సభ్యులు గల ఈ కమిటీ రాజ్యాంగ సభ సమావేశాల చర్చల ఆధారంగా రాజ్యాంగాన్ని రూపొందించింది. రాజ్యాంగం 1949, నవంబర్ 26న రాజ్యాంగ సభతో ఆమోదం పొంది 1950, జనవరి 26 నుంచి పూర్తిగా అమల్లోకి వచ్చింది. దీనికి గుర్తుగా ఏటా జనవరి 26న గణతంత్ర (రిపబ్లిక్) దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నాం.
- ముసాయిదా రాజ్యాంగంలో 315 అధికరణలు, 8 షెడ్యూళ్లు ఉండగా, రాజ్యాంగం ఆమోదం పొందే సమయానికి 395 అధికరణలు, 8 షెడ్యూళ్లు ఉన్నాయి. తర్వాత కాలంలో రాజ్యాంగానికి వివిధ సవరణలు చేయడంతో రాజ్యాంగ అధికరణల సంఖ్య 448కు, షెడ్యూళ్ల సంఖ్య 12కు చేరుకున్నాయి. రాజ్యాంగ రచనకు 2 సంవత్సరాల, 11 నెలల, 18 రోజుల సమయం పట్టింది.
- ప్రపంచంలో రెండు రకాల ప్రభుత్వాలు ఉన్నాయి. అవి.. పార్లమెంటరీ తరహా ప్రభుత్వ వ్యవస్థ, అధ్యక్ష తరహా ప్రభుత్వ వ్యవస్థ. ఇండియాలో మొదటి పద్ధతి అమల్లో ఉంది. రెండో తరహా వ్యవస్థకు అమెరికా మంచి ఉదాహరణ.
- ఏకీకృత విధానం (ఏకకేంద్ర), సమాఖ్య విధానమనే రెండు రకాల రాజ్యాంగ రూపాలు ఉన్నాయి. భారత రాజ్యాంగం.. సమాఖ్య లక్షణాలతోపాటు ఏకీకృత లక్షణాలు కూడా కలిగుంది. భారతదేశ రాజ్యాంగంలో అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా దేశాల రాజ్యాంగాల్లో ఉన్న మంచి సమాఖ్య లక్షణాలు లేవు. అదే సమయంలో బ్రిటన్‌లో ఉన్న పూర్తి ఏకీకృత లక్షణాలు కూడా లేవు.
- భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అతిపెద్ద లిఖిత రాజ్యాంగం.
- భారత రాజ్యాంగం అంటరానితనాన్ని నిషేధించింది. సమాజంలోని అన్ని వర్గాలు సమానంగా అభివృద్ధి చెందాలనే సంకల్పంతో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లను కల్పించారు.
- పరిస్థితులకు అనుగుణంగా నిబంధనల ప్రకారం రాజ్యాంగాన్ని సవరించొచ్చు. 1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా రాజ్యాంగ ప్రవేశికలో 'సామ్యవాదం, లౌకికత్వం, సమగ్రత' పదాలను చేర్చారు. ఇది రాజ్యాంగ ప్రవేశికకు చేసిన ఏకైక సవరణ.
- కేశవానంద భారతి వర్సెస్ కేరళ (1973) కేసులో సుప్రీంకోర్టు రాజ్యాంగ మౌలిక సూత్రాల గురించి ప్రస్తావించింది. వీటిని సవరించే అధికారం పార్లమెంట్‌కు లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

4 మార్కుల ప్రశ్న

1. రాజ్యాంగంలో మౌలిక సూత్రాలుంటాయి. అయితే ప్రజలు వ్యవస్థతో తలపడినప్పుడే సామాజిక మార్పు వస్తుంది. ఈ వ్యాఖ్యతో మీరు ఏకీభవిస్తారా? మీ కారణాలను పేర్కొనండి?
(సమకాలీన అంశాలపై ప్రతిస్పందన – ప్రశ్నించడం)

జ: పై వ్యాఖ్యతో నేను పూర్తిగా ఏకీభవిస్తాను. ఏ దేశ రాజ్యాంగంలోఅయినా కొన్ని మౌలిక సూత్రాలుంటాయి. అవి.. రాజ్యాంగ స్వరూపాన్ని, ఉద్దేశాలను ప్రతిబింబిస్తాయి. రాజ్యాంగ ప్రవేశికలో పొందుపర్చిన మౌలిక సూత్రాల లక్ష్యాలకు అనుగుణంగా వ్యవస్థలో మార్పులు రావాలి. దీంతోపాటు ప్రజల ఆకాంక్షలు నెరవేరాల్సిన అవసరం కూడా ఉంది. ప్రజలు రాజ్యాంగ పద్ధతిలో వ్యవస్థతో తలపడినప్పుడే ఈ సామాజిక మార్పు సాధ్యమవుతుంది. నేను ఈ వాస్తవాలతో ఏకీభవించడానికి కారణాలు..

- దేశ సార్వభౌమాధికారం ప్రజల చేతిలో ఉంటుంది. ప్రజలే పాలకులు, ప్రజల కోసం ప్రజలే చట్టాలు చేసుకుంటారు. ప్రజలతో కూడిందే వ్యవస్థ. ఇలాంటి వ్యవస్థలో అభివృద్ధి పూర్వక మార్పులకు ప్రజలు సిద్ధపడాలి.
- లౌకిక, సామ్యవాద సూత్రాలు జాతీయ సమైక్యతను, ప్రజల సంక్షేమాన్ని పెంపొందిస్తాయి. పాలనా వ్యవస్థ వీటిని అమలు చేయాలి. ప్రజలు జాగరూకులై అభివృద్ధి ఫలాలను అందుకోవాలి. పాలనా వ్యవస్థ ప్రజల కోరికలు, ఆకాంక్షలను పట్టించుకోనప్పుడు ప్రజలే ప్రభుత్వాన్ని ప్రశ్నించాలి.
- రాజ్యాంగ సూత్రాల ప్రకారం పౌరులందరికీ సామాజిక, ఆర్థిక రాజకీయ న్యాయాన్ని అందించాలి. అలాగే పౌరుల్లో సమానత్వం, సౌభ్రాతృత్వాలను పెంపొందించాలి. వీటి ఆధారంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. అప్పుడే ప్రజల జీవితాల్లో ఫలప్రదమైన మార్పులు సంభవిస్తాయి. తద్వారా సామాజిక మార్పును ఆశించవచ్చు.
- రాజ్యాంగ మౌలిక సూత్రాలను పాలనా వ్యవస్థ విస్మరించినప్పుడు ప్రజలు సమూహంగా ఏర్పడి సామాజిక వ్యవస్థలో మార్పు కోసం ప్రజాప్రతినిధులతో కూడిన పాలనా వ్యవస్థతో తలపడాల్సి వస్తుంది. రాజ్యాంగం కూడా దీన్నే కోరుకుంటుంది. పాలనా వ్యవస్థకు సామాజిక వ్యవస్థే ఆధారం.

2 మార్కుల ప్రశ్నలు

1. 73వ రాజ్యాంగ సవరణ ద్వారా గ్రామాలకు ఎలాంటి స్వయంప్రతిపత్తి కల్పించారో తెలపండి.
(సమాచార సేకరణ నైపుణ్యం)

జ: భారత రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాల్లో పేర్కొన్న 40వ ప్రకరణ.. పంచాయతీరాజ్ వ్యవస్థ ఏర్పాటు, గ్రామాలకు స్వయం పాలనాధికారాల గురించి ప్రస్తావించింది. దానికి అనుగుణంగా పార్లమెంట్ 1992లో 73వ రాజ్యాంగ సవరణ చేసింది. ఇది 1993, ఏప్రిల్ 24 నుంచి అమల్లోకి వచ్చింది. 73వ రాజ్యాంగ సవరణ.. గ్రామ పంచాయతీలకు స్వయం ప్రతిపత్తిని కల్పించింది. దీంతోపాటు గ్రామ స్వయంపాలనకు అవసరమైన అధికారాలు, విధులు, బాధ్యతలను పంచాయతీ వ్యవస్థలకు కల్పించింది. వాటిలో ముఖ్యమైనవి.. గ్రామసభ ఏర్పాటు, ప్రత్యక్ష ఎన్నికలు, సీట్ల రిజర్వేషన్, మూడంచెల వ్యవస్థ, రాష్ట్ర ఎన్నికల సంఘం, రాష్ట్ర ఆర్థిక సంఘం ఏర్పాటు, నిర్దేశిత పదవీకాలం తదితరాలు.

2. భారత్, అమెరికా సమాఖ్య వ్యవస్థల మధ్య ముఖ్య భేదాలను పేర్కొనండి.
(విషయావగాహన)

జ: అమెరికా, ఇండియాల్లో సమాఖ్య వ్యవస్థ అమల్లో ఉంది. ఈ దేశాల్లో అనుసరిస్తున్న సమాఖ్య విధానాల్లో స్పష్టమైన తేడాలున్నాయి. అవి..

భారత సమాఖ్య వ్యవస్థ: 1. ఏక పౌరసత్వం, ద్వంద్వ ప్రభుత్వాలు, ఏక న్యాయ వ్యవస్థ, 2. సివిల్, క్రిమినల్ చట్టాల్లో సారూప్యత, ఏక విధానం, 3. అఖిల భారత సర్వీసులు.

అమెరికా సమాఖ్య వ్యవస్థ:
1. ద్వంద్వ పౌరసత్వం, ద్వంద్వ ప్రభుత్వాలు, ప్రత్యేక న్యాయ వ్యవస్థలు. 2. చట్టాల్లో సారూప్యత, ఏక విధానం లేదు 3. ప్రత్యేకంగా వేర్వేరు సర్వీసులు.

3. అధ్యక్ష తరహా, పార్లమెంటరీ తరహా వ్యవస్థల మధ్య తేడా ఏమిటి?

జ: **అధ్యక్ష తరహా వ్యవస్థ:** దేశ పరిపాలనాధికారాలన్నీ అధ్యక్షుడి చేతిలోనే ఉండే ప్రభుత్వ వ్యవస్థ. అధ్యక్షుణ్ని ప్రభుత్వాధినేత, దేశాధినేత అని కూడా పిలుస్తారు. అధ్యక్షుడు ప్రభుత్వ వాస్తవ కార్యనిర్వహణాధికారిగా ఉంటాడు. **ఉదా:** అమెరికా

పార్లమెంటరీ తరహా వ్యవస్థ: పార్లమెంట్‌లో ప్రజాస్వామ్యబద్ధంగా మెజారిటీ సీట్లు పొందిన పార్టీ లేదా కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుంది. ప్రభుత్వ కార్యనిర్వాహక అధికారాలను మంత్రిమండలి నిర్వర్తిస్తుంది. ఈ విధంగా శాసననిర్మాణ శాఖ, కార్యనిర్వాహక శాఖల అధికారాల సమన్వయంతో కూడిన వ్యవస్థను పార్లమెంటరీ తరహా ప్రభుత్వ వ్యవస్థ అంటారు. మంత్రిమండలి నాయకుడిని ప్రధానమంత్రి అంటారు. ఆయనే ప్రభుత్వాధినేతగా ఉంటారు. ఆయన సలహాలు, సూచనల మేరకే దేశాధినేత అయిన అధ్యక్షుడు (రాష్ట్రపతి) నడచుకోవాల్సి ఉంటుంది. ఈ వ్యవస్థలో వాస్తవ కార్యనిర్వాహణాధికారి ప్రధానమంత్రి.
ఉదా: బ్రిటన్, ఇండియా

1 మార్కు ప్రశ్నలు

1. రాజ్యాంగ ముసాయిదా సంఘం అంటే ఏమిటి? దాని చైర్మన్ ఎవరు?

జ: రాజ్యాంగ సభ నియమించిన వివిధ కమిటీల నివేదికలపై రాజ్యాంగ సభ తీసుకున్న నిర్ణయాల సారాంశం ఆధారంగా రాజ్యాంగాన్ని రూపొందించే మేధావుల బృందం (కమిటీ). భారత రాజ్యాంగ ముసాయిదా కమిటీ చైర్మన్ డా.బి.ఆర్. అంబేద్కర్.

2. రాజ్యాంగ ప్రవేశిక అంటే ఏమిటి?

జ: రాజ్యాంగ స్థూల స్వరూపాన్ని క్లుప్తంగా పరిచయ వాక్యాలతో చెప్పే పత్రమే రాజ్యాంగ ప్రవేశిక. ఇది రాజ్యాంగ మౌలిక సూత్రాలను తెలుపుతోంది. దీన్ని రాజ్యాంగానికి దర్పణంగా, ముందుమాటగా కూడా పేర్కొంటారు.

3. ఏకీకృత విధానం, సమాఖ్య విధానం మధ్య ప్రధానమైన తేడా ఏమిటి?

జ: **ఏకీకృత విధానం:** దేశ పాలనాధికారాలన్నీ కేంద్ర ప్రభుత్వానికి మాత్రమే ఉండటం. ఇది ఏకకేంద్ర ప్రభుత్వ వ్యవస్థ ముఖ్య లక్షణం. **ఉదా:** బ్రిటన్.
సమాఖ్య విధానం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య అధికారాలు స్పష్టంగా విభజితమై ఉండటం.
ఉదా: అమెరికా, ఇండియా మొదలైనవి.

4. ఉమ్మడి జాబితా అంటే ఏమిటో తెలపండి.

జ: **ఉమ్మడి జాబితా:** కేంద్రానికి, రాష్ట్రాలకు ఉమ్మడిగా గల అధికారాలను తెలిపే అంశాల జాబితాను ఉమ్మడి జాబితా అంటారు. సమాఖ్య వ్యవస్థలో కేంద్రం, రాష్ట్రాల మధ్య చట్టాలు చేసే అధికారాలు విభజితమై ఉంటాయి. **ఉదా:** భారత రాజ్యాంగంలోని ఉమ్మడి జాబితాలో 47 అంశాలను పేర్కొన్నారు.

5. రాజ్యాంగ సవరణ అంటే ఏమిటి?

జ: రాజ్యాంగబద్ధంగా దేశ మౌలిక రాజ్యాంగంలో చేసే అవసరమైన మార్పునే రాజ్యాంగ సవరణ అంటారు. సవరణ అంటే రాజ్యాంగంలో అప్పటికే ఉన్న అధికరణలను తొలగించవచ్చు లేదా మార్చవచ్చు, కొత్తవాటిని చేర్చవచ్చు. దేశాభివృద్ధికి అవసరమైన రాజ్యాంగ సవరణలను చట్టసభలు ఆమోదిస్తాయి.

'నాదేశం నశించే పరిస్థితుల్లో నేను జన్మించాను'



మగ్గం వెంకటరమణరావు
అసిస్టెంట్ ప్రొఫెసర్,
నాగార్జున ప్రభుత్వ డిగ్రీ
కళాశాల, నల్లగొండ

మాదిరి ప్రశ్నలు

1. కింది వాటిలో 'అక్షరాజ్య కూటమి'లోని దేశాలేవి?
1) నార్వే, స్వీడన్, డెన్మార్క్
2) ఇటలీ, జర్మనీ, జపాన్
3) అమెరికా, చైనా, స్పెయిన్
4) రష్యా, ఫ్రాన్స్, బ్రిటన్

2. 'కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ చైనా' తొలి సమావేశం ఎక్కడ జరిగింది?
1) బీజింగ్ 2) నాన్‌కింగ్
3) షాంఘై 4) పెకింగ్

3. ఇటలీ ఏకీకరణోద్యమంలో కీలక పాత్ర పోషించిన గారీబాల్డీ ఎక్కడ జన్మించాడు?
1) నైస్ 2) టస్కనీ
3) సార్డీనియా 4) వెనిస్

4. ముస్తాఫ కెమాల్ పాషాకు ఉన్న బిరుదు అయిన 'కెమాల్' అంటే?
1) వేగు చుక్క 2) పరిపూర్ణుడు
3) రక్షకుడు 4) విమోచకుడు

5. కింది వాటిలో సరైన జత ఏది?
1) హిట్లర్ ఆత్మహత్య -1945
2) ఐక్యరాజ్య సమితి సచివాలయం – న్యూయార్క్
3) ఉదయించే సూర్యుడి భూమి – జపాన్
4) పైవన్నీ సరైనవే

6. అడాల్ఫ్ హిట్లర్ ఎవరి తత్వ సిద్ధాంతాలకు ప్రభావితుడయ్యాడు?
1) హిడెన్‌బర్గ్ 2) ముత్సుహిటో
3) జోసెఫ్ గోబెల్స్ 4) నీషి

7. కింది వాటిలో నల్లమందు యుద్ధాలు ఏయే దేశాల మధ్య జరిగాయి?
1) చైనా – బ్రిటన్
2) జర్మనీ – ఆస్ట్రియా
3) జపాన్ – అమెరికా
4) ఫ్రాన్స్ – ఇటలీ

8. 'చైనా జాతి పిత' అని ఎవరిని పిలిచారు?
1) సన్ యెట్ సేన్ 2) చౌ ఎన్ లై
3) చూటే 4) మావో సే టుంగ్

9. రెండో విక్టర్ ఇమ్మాన్యుయేల్ ఏ ప్రాంత పాలకుడిగా కీర్తిగాంచి నిజాయితీపరుడైన రాజుగా ప్రసిద్ధి చెందాడు?
1) సార్డీనియా 2) ఫ్లారెన్స్
3) వెనిస్ 4) సెవాయ్

10. 'నల్లచేయి' అనే గుర్తు ఉన్న 'నరోరా ఒబ్రానా సంస్థ' ఏ దేశ విప్లవ సంస్థ?
1) బోస్నియా 2) సెర్బియా
3) ఆస్ట్రియా 4) మొరాకో

11. కౌంట్ కవూర్ స్థాపించిన పత్రిక ఏది?
1) పీపుల్స్ అబ్జర్వర్
2) ఇల్ రిసార్జిమెంటో
3) ఇస్క్రా 4) అవంతి

12. 'మతం లేని రాజ్యం దిక్సూచి లేని నౌక లాంటిది' అని అన్నదెవరు?
1) మెటర్నిక్ 2) ఆటోవాన్ బిస్మార్క్
3) మొదటి విలియం
4) నెపోలియన్ బోనాపార్టే

13. ఆస్ట్రియా యువరాజు 'ఆర్చ్‌డ్యూక్ ఫెర్డినాండ్'ను ఎక్కడ హత్య చేశారు?
1) సరాజెవో 2) వార్సా
3) బెర్న్ 4) జెనీవా

14. ఫ్రాన్స్ చక్రవర్తి నెపోలియన్ బోనా పార్టే 'కంకార్డేట్' అనే మత ఒప్పందం ఎవరితో చేసుకున్నాడు?
1) పోప్ 10వ లియో
2) పోప్ 6వ అలెగ్జాండర్
3) పోప్ 7వ ఫయిస్
4) పోప్ 5వ ఫయిస్

15. వర్సయిల్స్ సంధి సమావేశంలో పాల్గొన్న ఇటలీ ప్రధాన మంత్రి ఎవరు?
1) ఆర్లాండో 2) జార్జ్ క్లెమెన్సో
3) లాయిడ్ జార్జ్ 4) ఉడ్రో విల్సన్

16. 'యుద్ధం ప్రష్యన్‌ల జాతీయ పరిశ్రమ' అని అన్నదెవరు?
1) డాంటన్ 2) మిరాబూ
3) రాబిస్పియర్ 4) లఫాయితే

17. కింది వాటిలో జోసెఫ్ మాజినీ స్థాపించిన సంస్థ?
1) ఎర్ర చొక్కాల దళం
2) నల్ల చొక్కాల దళం
3) తుంగ్ మెంగ్ హుయి విప్లవ సంస్థ
4) యంగ్ ఇటలీ సంస్థ

18. జపాన్‌లో 'షింటో' ప్రాచీన మతం. 'షింటో' అంటే?
1) విప్లవ భూమి 2) పవిత్ర భూమి
3) దేవతల మార్గం
4) దైవ శాపగ్రస్థ దేశం

19. నెపోలియన్ బోనా పార్టే ఏ తేదీన జన్మించాడు?
1) 1769 ఆగస్టు 15
2) 1779 జనవరి 26
3) 1789 మార్చి 19
4) 1766 అక్టోబర్ 14

20. 'ఆసియా ఆసియావాసులకే' అనే నినాదం ఏ దేశానిది?
1) జపాన్ 2) చైనా
3) భారత్ 4) శ్రీలంక

21. నెపోలియన్ బోనాపార్టేకి సంబంధించి కింది వాటిలో సరైంది?
1) 1804లో ఫ్రాన్స్ చక్రవర్తిగా అధికారం చేపట్టాడు
2) రెండో జస్టీయన్‌గా కీర్తి పొందాడు
3) 1815లో వాటర్లూ యుద్ధం చేశాడు
4) పైవన్నీ సరైనవే

22. వ్యాపార నిమిత్తం చైనాలో అడుగుపెట్టిన తొలి ఐరోపావాసులు ఎవరు?
1) బ్రిటిషర్లు 2) ఫ్రెంచ్‌వారు
3) పోర్చుగీస్‌వారు 4) డచ్చీవారు

23. నెపోలియన్ బోనాపార్టే 'భూఖండ విధానం' ఏ దేశానికి వ్యతిరేకంగా చేపట్టాడు?
1) ప్రష్యా 2) ఇంగ్లండ్
3) రష్యా 3) ఆస్ట్రియా

24. మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో 21 డిమాండ్‌ల పత్రాన్ని జపాన్ ఏ దేశానికి పంపింది?
1) ఇంగ్లండ్ 2) రష్యా
3) ఫ్రాన్స్ 4) చైనా

25. టర్కీ.. నానాజాతి సమితిలో ఎప్పుడు సభ్యత్వం పొందింది?
1) 1932 2) 1934
3) 1936 4) 1938

26. 'బ్లడ్ అండ్ ఐరన్' పాలసీ సృష్టికర్త ఎవరు?
1) జోసెఫ్ మాజినీ
2) డాక్టర్ సన్‌యేట్‌సేన్
3) ఆటోవాన్ బిస్మార్క్
4) మూడో నెపోలియన్

27. 'స్త్రీ సంపూర్ణ వ్యక్తిత్వానికి మాతృత్వం ఎలాంటిదో, సంపూర్ణ వికాసానికి యుద్ధం అలాంటిది' అని అన్నదెవరు?
1) లెనిన్ 2) స్టాలిన్
3) అడాల్ఫ్ హిట్లర్
4) బెనిటో ముస్సోలినీ

28. నానాజాతి సమితి సచివాలయం కేంద్ర కార్యాలయం ఎక్కడ ఉంది?
1) జెనీవా 2) న్యూయార్క్



పోటీ పరీక్షల ప్రత్యేకం
వరల్డ్ హిస్టరీ

3) బెర్లిన్ 4) మాస్కో

29. అడాల్ఫ్ హిట్లర్ స్థాపించిన 'రహస్య పోలీస్ దళం' ఏది?
1) రీచ్‌స్టాగ్ 2) థర్డ్ సెక్షన్
3) గెస్టాపో 4) ఆగ్‌ప్రూ

30. నానాజాతి సమితిని ఎప్పుడు స్థాపించారు?
1) 1918 2) 1920
3) 1922 4) 1924

31. 'ప్రాచ్య విజ్ఞాన కోశం' అని ఏ దేశాన్ని పిలుస్తారు?
1) శ్రీలంక 2) జపాన్
3) చైనా 4) బర్మా

32. కింది వాటిలో అడాల్ఫ్ హిట్లర్ రాసిన గ్రంథం ఏది?
1) ఏప్రిల్ థీసిస్ 2) మీన్‌కాంఫ్
3) ద స్టడీ ఆఫ్ ఫిజికల్ కల్చర్
4) దాస్ కాపిటల్

33. బెనిటో ముస్సోలిని.. ఫాసిస్ట్ పార్టీని ఎక్కడ స్థాపించాడు?
1) వెనిస్ 2) మిలాన్
3) ఫ్లారెన్స్ 4) రోమ్

34. 'కార్బోనరీ' అంటే?
1) సంగీత బృందం 2) గ్రామీణ రైతులు
3) బొగ్గును కాల్చేవారు
4) యుద్ధ ఖైదీలు

35. 'టర్కీ టర్కులకే' అనే నినాదం ఇచ్చిందెవరు?
1) ఇస్మత్ ఇనోను
2) ముస్తాఫ కెమాల్ పాషా
3) అలీ ఫతేహి ఒక్యార్
4) జెనిటో జౌరజ్

36. ఐరోపా ఖండంలో వియన్నా కాంగ్రెస్ సమావేశం ఎప్పుడు జరిగింది?
1) 1815 2) 1817
3) 1819 4) 1821

37. కింది వాటిలో సరైన జత ఏది?
1) ఫ్యూరర్ – అడాల్ఫ్ హిట్లర్
2) ఇల్‌డ్యూస్ – బెనిటో ముస్సోలిని
3) అటాటర్క్ – ముస్తాఫా కెమాల్ పాషా
4) పైవన్నీ సరైనవే

38. పెరల్ హార్బర్ సంఘటన ఏ తేదీన జరిగింది?
1) 1941 డిసెంబర్ 7
2) 1942 డిసెంబర్ 17
3) 1943 ఆగస్టు 16
4) 1944 మార్చి 19

39. ఫాసిస్ట్ పార్టీ చిహ్నాలు ఏవి?
1) సూర్యుడు, నాగలి
2) స్వస్తిక్, నక్షత్రం 3) పావురం, పులి
4) పుల్లల మోపు, గొడ్డలి

40. 'ఇటలీ జాతీయోద్యమానికి ఆత్మ' అని ఎవరిని పేర్కొంటారు?
1) మాజినీ 2) గారీబాల్డీ
3) కౌంట్‌కవూర్ 4) విన్సెంట్ జియోబర్టీ

41. చైనాలో 'బాక్సర్ తిరుగుబాటు' ఎప్పుడు జరిగింది?
1) 1900 2) 1902
3) 1904 4) 1906

42. కింది వాటిలో సరైన జత ఏది?
1) సమురాయ్ – సైన్యాధికార వర్గం (జపాన్)
2) మంచూ – చైనాను పాలించిన చివరి రాజవంశం
3) 20వ శతాబ్దపు కన్ఫ్యూషియస్ – సన్‌యెట్‌సేన్
4) పైవన్నీ సరైనవే

43. అడాల్ఫ్ హిట్లర్ తన ఆర్థికమంత్రిగా ఎవరిని నియమించాడు?
1) లియోపాల్డ్ 2) బెనెడెట్టి
3) షాట్ 4) వాన్‌రూన్

44. 'మెయిజీ' అంటే?
1) విజ్ఞతతో వ్యవహరించడం
2) నియంతృత్వ పాలన
3) పెద్ద భూస్వామ్య వర్గం
4) దైవలోక చక్రవర్తి

45. చౌఎన్‌లై ప్రధానిగా 'ప్రజా రిపబ్లిక్' ఏ దేశంలో ఏర్పడింది?
1) జపాన్ 2) చైనా
3) ఆస్ట్రియా 4) ప్రష్యా

46. ఆటోవాన్ బిస్మార్క్ ప్రష్యా చాన్స్‌లర్‌గా ఎప్పుడు పదవీ బాధ్యతలు చేపట్టాడు?
1) 1862 2) 1864
3) 1866 4) 1868

47. 'నాదేశం నశించే పరిస్థితుల్లో నేను జన్మించాను' అని అన్నదెవరు?
1) మొదటి విలియం
2) 16వ లూయి 3) ముత్సుహిటో
4) నెపోలియన్ బోనాపార్టే

48. ఫ్రాంక్‌ఫర్ట్ సంధి(1871) ఏయే దేశాల మధ్య జరిగింది?
1) ఫ్రాన్స్, ప్రష్యా 2) ప్రష్యా, డెన్మార్క్
3) డెన్మార్క్, ఆస్ట్రియా
4) ఫ్రాన్స్, ఆస్ట్రియా

49. 'ఐరోపా జబ్బు మనిషి' అని ఏ దేశానికి పేరు ఉంది?
1) జర్మనీ 2) టర్కీ
3) ఇంగ్లండ్ 4) ఫ్రాన్స్

50. నెపోలియన్ బోనాపార్టే.. ప్రెస్‌బర్గ్ సంధి ఏ దేశంతో చేసుకున్నాడు?
1) పోలాండ్ 2) డెన్మార్క్
3) రష్యా 4) ఆస్ట్రియా

51. మొదటి ప్రపంచ యుద్ధం జరిగిన కాలం?
1) 1914-1918 2) 1915-1918
3) 1914-1917 4) 1914-1924

52. 'బ్యాటిల్ ఆఫ్ నేషన్స్' అని ఏ యుద్ధానికి పేరు?
1) లీప్‌జిగ్ యుద్ధం 2) వాటర్లూ యుద్ధం
3) జీనా యుద్ధం 4) ఆస్టర్లిట్జ్ యుద్ధం

53. 'పొడెస్టాస్' అనే ప్రభుత్వ ఉద్యోగుల పాలనలో స్థానిక స్వపరిపాలనా సంస్థలు ఏ దేశంలో పనిచేశాయి?
1) జర్మనీ 2) ఇటలీ
3) ఆస్ట్రియా 4) రష్యా

54. ముస్తాఫ కెమాల్ పాషా మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో ఏ ప్రాంతంలో బ్రిటన్ దాడిని తిప్పికొట్టాడు?
1) కైరో 2) అంకారా
3) గాల్లిపోలి 4) టోక్యో

55. నెపోలియన్ బోనా పార్టే.. స్పెయిన్ పాలకుడిగా నియమించిన అతని సోదరుడు ఎవరు?
1) జెరోమ్ 2) టాలీరాండ్
3) ఆర్థర్ వెల్లస్లీ 4) జోసెఫ్

56. రష్యాలో ట్రాట్‌స్కీ, ఆయన అనుచరులు శత్రు సైన్యాలను ఏమని పిలిచేవారు?
1) తెల్ల సైన్యం 2) పచ్చ సైన్యం
3) నీలి సైన్యం 4) ఎర్ర సైన్యం

57. రెండో ప్రపంచ యుద్ధ కాలంలో భారత్‌లో ఏ స్వాతంత్ర్యోద్యమం కీర్తిగాంచింది?
1) శాసనోల్లంఘనోద్యమం
2) సహాయ నిరాకరణోద్యమం
3) సైమన్ కమిషన్ వ్యతిరేక ఉద్యమం
4) క్విట్ ఇండియా ఉద్యమం

58. చైనాను పాలించిన మంచూ రాజవంశ ఆఖరి చక్రవర్తి ఎవరు?
1) పూయీ 2) షియోవాంగ్టీ
3) యువాన్ 4) ముత్సుహిటో

59. జపాన్‌ను తన ఆధీనంలోకి తెచ్చుకుని, (1945) మిత్ర రాజ్యాల సైన్యానికి నాయకత్వం వహించింది ఎవరు?
1) జార్జి వాషింగ్టన్ 2) ట్రూమన్
3) జనరల్ మెకార్థర్
4) ఐసన్ హోవర్

సమాధానాలు

1) 2	2) 3	3) 1	4) 2	5) 4
6) 4	7) 1	8) 1	9) 1	10) 2
11) 2	12) 4	13) 1	14) 3	15) 1
16) 2	17) 4	18) 3	19) 1	20) 1
21) 4	22) 3	23) 2	24) 4	25) 1
26) 3	27) 4	28) 1	29) 3	30) 2
31) 3	32) 2	33) 2	34) 3	35) 2
36) 1	37) 4	38) 1	39) 4	40) 1
41) 1	42) 4	43) 3	44) 1	45) 2
46) 1	47) 4	48) 1	49) 2	50) 4
51) 1	52) 1	53) 2	54) 3	55) 4
56) 1	57) 4	58) 1	59) 3	

లక్ష్యంమేర ఉత్పత్తి చేయాలి

సింగరేణి సీఎండీ శ్రీధర్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సీఎండీ శ్రీధర్

గోదావరిఖని(పెద్దపల్లి జిల్లా), కోల్‌బెల్ట్ (భూపాలపల్లి జిల్లా), సింగరేణి (కొత్తగూడెం):

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మిగిలిన మూడు నెలల కాలంలో లక్ష్యాల మేర బొగ్గు ఉత్పత్తి, రవాణా చేయాలని సింగరేణి సీఎండీ ఎన్.శ్రీధర్ సంస్థలోని 11 ఏరియాల జీఎంలను ఆదేశించారు. రానున్న మూడేళ్లలో ప్రారంభం చేయాల్సిన కొత్త గనులపై కూడా ఏరియాల వారీగా హైదరాబాద్ లోని సింగరేణి భవన్‌లో శుక్రవారం ఆయన ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. డిసెంబర్ నెలతో ముగిసిన తొమ్మిది నెలల కాలంలో సాధించిన ప్రగతిని సమీక్షించారు. మిగిలిన మూడు నెలల కాలంలో రోజుకు 2.10లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణా జరపాలని సూచించారు. నిర్దేశిత వార్షిక లక్ష్యాలను సాధించి తద్వారా పెరిగిన రాష్ట్ర విద్యుత్ అవసరాలకు తగినంత బొగ్గు అం దించాలన్నారు. డిసెంబర్‌తో ముగిసిన తొమ్మి ది నెలల్లో 420 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేశామని, మార్చి నాటికి మిగిలిన 90 రోజుల్లో మరో 200 లక్షల టన్నుల బొగ్గు ఉత్ప త్తి జరగాలని అన్నారు. డిసెంబర్ చివరి నాటికి గత ఏడాది కన్నా 9శాతం వృద్ధితో 467 లక్షల టన్నుల రవాణా చేశామని, ఇంకా మిగిలిన మూడు నెలల కాలంలో ఇంకా 193 లక్షల టన్నుల రవాణా చేసేందుకు ప్రణాళికలు రూ పొందించాలన్నారు. డిసెంబర్ నెలాఖరుకు గత ఏడాదిపై 28 శాతం వృద్ధితో 282.9 మిలియన్ క్యూబిక్ మీటర్ల ఓబీని తొలగించామని, మిగిలిన మూడు నెలల కాలంలో రోజుకు 14లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ తొలగించాలని చెప్పారు. త్వరలో ప్రారంభించనున్న కొత్త గనులపై కూడా సమీక్ష నిర్వహించారు. ఒడిశా రాష్ట్రంలోని నైనీ బొగ్గు గని ప్రారంభానికి సంబంధించిన ఏర్పాట్లపై కూడా నైనీ బ్లాకు జీఎం విజయరావుకు ఆదేశాలు జారీ చేశారు. పీఅండ్‌పీ డైరెక్టర్ బి.భాస్కర్ రావు, ఆపరేషన్స్ డైరెక్టర్ ఎస్. చంద్రశేఖర్, ఈఅండ్‌ఎం డైరెక్టర్ ఎస్.శంకర్, మార్కెటింగ్ జీఎం బి.కిషన్‌రావు, పీఅండ్‌పీ జీఎం ఆంథోని రాజా, సీడీఎస్ జీఎం జె.నాగయ్య, మెటీరియల్ ప్రొక్యూర్‌మెంట్ జీఎం టి.నాగేశ్వర్‌రావు, జీఎం వై.రాజేశ్వర్‌రెడ్డి, జీఎంలు వైజీకే మూర్తి, టి.వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

16న ఈపీ ఆపరేటర్లకు ఆన్‌లైన్ కౌన్సెలింగ్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో ఉన్న ఆపరేటర్ 105 పోస్టులకు ఈ నెల 16న వివిధ ఏరియాలలో ఆన్‌లైన్ కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు, ఈ కౌన్సెలింగ్ టీబీజీకేఎస్ ఒత్తిడి వలనే యాజమాన్యం నిర్వహించనున్నదని టీబీజీకేఎస్ నాయకులు, ఆకునూరి కనకరాజు తెలిపారు. శుక్రవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ బీ,సీ,డీ గ్రేడ్ ల వారీగా సీనియర్లకు ఉదయం 11.30 గంటలకు, జూనియర్లకు అదేరోజు మధ్యాహ్నం 2.30 గంటలకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్ కౌన్సెలింగ్ కొత్తగూడెం కార్పొరేట్ ఏరియాలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో, ఆర్‌జీ- 1 ఏరియాలోని టీటీసీ సెంటర్‌లో, శ్రీరాంపూర్ ఏరియాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

7న సూపర్ స్పెషాలిటీ వైద్య శిబిరం

సింగరేణి(కొత్తగూడెం): ఈ నెల 7న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 రెండు గంటల వరకు కొత్తగూడెంలోని సింగరేణి ప్రధానాస్పత్రిలో సూపర్ స్పెషాలిటీ వైద్యులు వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు జీఎం పర్సనల్ ఏ.ఆనందరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని కామినేని, యశోద, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల కార్డియాలజిస్ట్, న్యూరాలజిస్ట్, యురాలజిస్ట్, నెఫ్రాలజిస్ట్, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్, అంకాలజిస్ట్ తదితర వైద్య నిపుణులు శిబిరానికి హాజరవుతారని పేర్కొన్నారు. సింగరేణీయులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రవాణాలో అగ్రగామి కొత్తగూడెం


ఆర్‌సీహెచ్‌పీలో బొగ్గు లోడింగ్ దృశ్యం

- రైలు మార్గంలో 53.81 లక్షల టన్నుల బొగ్గు తరలింపు
- రోడ్డుమార్గంలో 15.41 లక్షల టన్నులు..

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా బొగ్గు ఉత్పత్తితోపాటు బొగ్గు రవాణాలో కూడ సింగరేణి వ్యాప్తంగా అగ్రగామిగా నిలుస్తోంది. ఒక్క డిసెంబర్ మాసంలో 10.18 లక్షల టన్ను ల ఉత్పత్తిచేసి రికార్డ్ నెలకొల్పింది. 2017–18 ఆర్థిక సంవత్సరంలో గత ఏప్రిల్ మాసం నుంచి డిసెంబర్ వరకు(9 నెలల కాలంలో) రైలు మార్గం ద్వారా 53, 81,92,858 టన్నులను, రోడ్డు (లారీల ద్వారా) 15,41, 56,052 లక్షల టన్నులు... మొత్తం 69,23, 48,910 టన్నుల బొగ్గును రుద్రంపూర్‌లోని కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ ద్వారా తరలించారు.

బొగ్గు రవాణా వివరాలు

ఏరియాల పేర్లు	రైలు మార్గం ద్వారా రవాణా	రోడ్డు మార్గం ద్వారా..
కొత్తగూడెం	53,81,92,858	15,41,56,052
ఇల్లెందు	22,56,454	8,54,037
మణుగూరు	42,28,809	8,67.300
బెల్లంపల్లి	36,39,73,178	7,67,30.014
మందమర్రి	20,74,06,424	7,33,37,176
శ్రీరాంపూర్	22,29,15,346	18,68,98.349
ఆర్జీ–1	36,07,85,194	26,75,44.415
ఆర్జీ–2	4,45,20,011	3,42,71,414
ఆర్జీ–3	0	0
భూపాలపల్లి	0	25,22,61,572
అడ్రియాల ప్రాజెక్ట్	0	88,273
మొత్తం	27,96,99,941	1,22,62,04,992

ఓసీలకు వ్యతిరేకంగా పోరాడుదాం

ఓపెన్ కాస్టుల వ్యతిరేక పోరాట కమిటీ సమావేశంలో అఖిలపక్షం పిలుపు


సదస్సుకు హాజరైన ప్రజలు


మాట్లాడుతున్న న్యూడెమోక్రసీ నేత మధు

గుండాల(భద్రాద్రి కొత్తగూడెం): గుండాల నుంచి భూపాలపల్లి వరకు విస్తరిస్తున్న ఓపెన్ కాస్టులకు వ్యతిరేకంగా ఉద్యమించాలని అఖిల పక్ష రాజకీయ నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం గుండాలలో జరిగిన ఓపెన్ కాస్టుల వ్యతిరేక పోరాట కమిటీ సమావేశంలో న్యూడెమోక్రసీ, సీపీఎం రాష్ట్ర నాయకులు ఆవునూరి మధు, పోతినేని సుదర్శన్‌రావు మాట్లాడారు. అభివృద్ధి, అవసరాల పేరుతో పాలకులు విధ్వంసపు విధానాలను అవలంబిస్తున్నారని విమర్శించారు. ఓపెన్‌కాస్టుల ద్వారా బొగ్గు వెలికితీస్తే తీవ్రమైన నష్టాలుంటాయని పర్యావరణ వేత్తలు, శాస్త్రవేత్తలు సూచించినా పాలకులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం గుండాల నుంచి భూపాలపల్లి వరకు ఓపెన్‌కాస్టులకు విస్తరించేందుకు ప్రణాళికలు రూపొందిస్తోందన్నారు. సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు ఎస్‌కె సాబీర్‌పాషా, అన్నవరపు కనకయ్య మాట్లాడుతూ ఓసీలతో సహజసిద్ధమైన అడువులు, గోదావరిలోయ పరీవాహక ప్రాంతంలోని సారవంతమైన పచ్చని పంటపొలాలు విధ్వంసమవుతాయని అన్నారు. లక్షలాది ఎకరాల్లో వ్యవసాయం, వందలాధి గ్రామాలు కనుమరుగు అవుతాయన్నారు. ప్రజలు సర్వస్వం కోల్పోతారన్నారు. టీడీపీ నాయకులు వట్టం నారాయణ, తుడుందెబ్బ రాష్ట్ర ప్రచార కార్యదర్శి జవాజీ లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ నాయకులు పోషం నర్సింహారావు, తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్, అఖిలపక్ష నాయకులు బీ.శ్రీను, నిత్యానందం, వి.చంద్రయ్య, కొమరం శాంతయ్య, కోరం సీతారాములు పాల్గొన్నారు.

ర్యాలీకి అనుమతించని పోలీసులు

గుండాల మండల కేంద్రంలో ఓపెన్‌కాస్టుల వ్యతిరేక పోరాట కమిటీ ర్యాలీకి పోలీసులు అనుమతి నిరాకరించారు. 144 సెక్షన్ నేపథ్యంలో ర్యాలీ నిర్వహించొద్దంటూ అడ్డుకున్నారు. దీంతో నాయకులు సదస్సు నిర్వ హించుకుని వెనుదిరిగారు.

బాస్కెట్‌బాల్ పోటీలు ప్రారంభం

కోల్‌బెల్ట్(భూపాలపల్లి జిల్లా): భూపాలపల్లి ఏరియాలో డిపార్ట్‌మెంటల్ స్థాయి బాస్కెట్ బాల్ పోటీలను శుక్రవారం పర్సనల్ మేనేజర్ డాక్టర్ రాజేంద్రకుమార్ ప్రారంభించారు. ఏరియా వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో ఈ పోటీలను నిర్వహిస్తున్నారు. కేటీకే 1, 5, కేఎల్‌పీ, ఓసీపీ జట్ల మధ్య మ్యాచ్‌లు జరిగాయి. తొలుత పర్సనల్ మేనేజర్ క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో క్రీడల గౌరవ కార్యదర్శి ఎండీ మధార్ సాహెబ్, స్పోర్ట్స్ ఆఫీసర్ పర్స శ్రీనివాస్, కో–ఆర్డినేటర్ బానోతు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి విద్యార్థుల విరాళం

ఇల్లెందుఅర్బన్: హైదరాబాద్‌లోని ఓ అనాథాశ్రమంలోని వికలాంగులకు ఇల్లెందుఏరియా సింగరేణి ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆర్థిక సాయం చేశారు. రూ 56,600 విరాళాలు సేకరించి ఇటీవల వారికి అందజేసి వారి సేవా దృక్పథం చాటుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాల కరస్పాడెంట్, ఏరియా పర్సనల్‌మేనేజర్ లక్ష్మీనారాయణ విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం నిర్మలరాణి, ఉపాధ్యాయులు నారయణ,వీరభద్రం, లక్ష్మీ,రజిత, రవి, తదితరులు పాల్గొన్నారు.


ప్రశంస పత్రాలతో విద్యార్థులు, పాఠశాల యాజమాన్యం

‘అర్బన్ రెసిడెన్షియల్’ జాడేది?

విద్యాసంవత్సరం ముగుస్తున్నా ప్రారంభం కాని వైనం

- అడ్మిషన్ తీసుకున్న విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకం
- విధుల్లో లేకున్నా.. బోధన, బోధనేతర సిబ్బందికి వేతనాలు



తొలుత ఏర్పాటుకు ప్రతిపాదించిన బ్రాహ్మణపల్లి హైస్కూల్

పెద్దపల్లిరూరల్: బడీడు పిల్లలను బడిబాట పట్టిస్తాం...అంటూ ప్రచారం చేసుకునే విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా జిల్లాలో ఉన్న 113మంది విద్యార్థులు చదువుకు దూరమయ్యే పరిస్థితి నెలకొంది. జిల్లా కేంద్రంగా అవతరించిన పెద్దపల్లికి కొత్తగా మంజూరైన అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాల విద్యాసంవత్సరం ముగిసేదశకు చేరుకుంటున్నా.. నేటికీ ప్రారంభానికి నోచలేదు. కానీ... ఈ పాఠశాలలో విద్యార్థులకు బోధించేందుకు నియమించిన ఐదుగురు, బోధనేతర విధుల కోసం నియమించిన మరో నలుగురు ఉద్యోగులు మాత్రం పనిచేయకుండానే నెలనెలా వేతనాలను తీసుకోవడం విశేషం.

చదువుకు దూరమైన విద్యార్థులు: ఈ విద్యాసంవత్సరంలో కొత్తగా ప్రారంభించిన అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో తమ పిల్లలను చేర్పిస్తే ఉచిత వసతితోపాటు నాణ్యమైన విద్య అందుతుందని ఆశించిన తల్లిదండ్రులకు అధికారుల తీరుతో నిరాశే ఎదురైంది. ఈ ఏడాది సుమారు 100 మందికిపైగా విద్యార్థులు ప్రవేశం పొందేందుకు ముందుకొచ్చారు. అయితే పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులు మాత్రం 25 మంది విద్యార్థులే తమపేర్లు నమోదు చేసుకున్నారని పేర్కొంటున్నారు. ఉపాధ్యాయులు చెప్పినట్టు అనుమతి పొందిన పాతిక మంది విద్యార్థులు సైతం బడికి రాకుండా ఇంటివద్దే ఉంటున్నారని, దీనిని బట్టి బడిబాట కార్యక్రమం ఏమేర అమలవుతుందో అర్థం చేసుకోవచ్చని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

వివాదాస్పదమైన యూఆర్ఎస్ ఏర్పాటు..
జిల్లాకు మంజూరైన అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలను పెద్దపల్లి మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌ను ఎత్తివేసి, అందులోనే ఈ పాఠశాలను ఏర్పాటు చేయాలని అధికారులు తీసుకున్న నిర్ణయం వివాదస్పదమైంది. అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలను ఏర్పాటు చేయవద్దంటూ గ్రామస్థులు, విద్యార్థులు ఆందోళనకు దిగడంతో పాటు ఏకంగా హైకోర్టును ఆశ్రయించారు. స్కూల్ వ్యవహారం రాష్ట్రస్థాయిలో చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. పెద్దపల్లిలో అనువైన భవనంలేని కారణంగానే స్కూల్‌ను బ్రాహ్మణపల్లిలో ఏర్పాటు చేస్తామంటూ కలెక్టర్, విద్యాశాఖాధికారులు సముదాయించారు. అయితే విద్యార్థులు నష్టపోకుండా చూసేందుకు సహకరిస్తామని, వచ్చే విద్యాసంవత్సరానికల్లా మరో భవనంలోకి మారుస్తామంటూ లిఖితపూర్వకంగా రాసిస్తేనే తమ పాఠశాలలో యూఆర్ఎస్ ఏర్పాటు చేసుకోవాలని మెలికపెట్టారు. దీంతో అధికారులు వెనక్కి తగ్గారు.

అద్దె భవనాల కోసం వేట: పెద్దపల్లి, రంగంపల్లి, పెద్దకల్వల గ్రామాల్లో విద్యార్థులకు అనువుగా ఉండేలా అవసరమైన భవనం కోసం విద్యాశాఖాధికారులు ప్రయత్నించారు. ప్రభుత్వాసుపత్రి పక్కన గల ఓ భవనాన్ని అద్దెకు మాట్లాడి, ఉన్నతాధికారుల నుంచి అనుమతి కోసం వేచిచూశారు. ఈలోగా ఆ భవనాన్ని మరొకరికి అద్దెకివ్వడంతో పాఠశాల ఏర్పాటుకు భవనం దొరకని పరిస్థితి ఏర్పడింది.

కలెక్టర్ స్పందించాలి..

జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపడుతున్న అల్లమరాజు శ్రీదేవసేన అయినా ఖాళీగా ఉన్న రంగంపల్లిలోని ఆనంద నిలయంలో అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలను ఏర్పాటు చేసేలా నిర్ణయం తీసుకుని విద్యార్థుల భవిష్యత్తుకు అండగా ఉండాలని ప్రతిపక్ష నాయకులు, విద్యార్థి సంఘాల నేతలు కోరుతున్నారు. కలెక్టర్ విధుల్లో చేరగానే ఆమెను కలిసి ఈ విషయమై విన్నవించేందుకు సన్నద్ధమవుతున్నారు. అన్ని వసతులతో కూడిన ఆనంద నిలయం ఖాళీగా ఉండగా.. అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలను ఏర్పాటు చేయాలన్న కనీస ఆలోచన అధికారులకు తట్టకపోవడం సరికాదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

భవనం దొరకకనే..



పెద్దపల్లికి మంజూరైన అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటుకు అనువైన భవనం దొరకకనే జాప్యం జరుగుతోంది. బ్రాహ్మణపల్లిలో ఏర్పాటు చేయాలనుకున్నాం. కానీ గ్రామస్తుల అభ్యంతరంతో ఆగిపోయాం. అనువుగా ఉన్న అద్దె భవనం కోసం ఆరా తీస్తున్నాం. పెద్దపల్లితోపాటు గోదావరిఖని ప్రాంతంలోనూ భవనాలను పరిశీలిస్తున్నాం. జిల్లా కలెక్టర్ అనుమతిస్తే రంగంపల్లిలోని ఆనంద నిలయంలోనే ఏర్పాటు చేస్తాం.

– వెంకటేశ్వర్‌రావు, డీఈవో పెద్దపల్లి

ప్రభుత్వ భవనాలు ఖాళీగా ఉన్నా
విద్యార్థుల సంఖ్య లేదన్న కారణంగా పెద్దపల్లి మండల పరిధిలోని రంగంపల్లి గ్రామంలో ఉన్న అనాథబాలల వసతిగృహం, బందంపల్లి గ్రామంలోని పాఠశాల భవనాలు ఇప్పటికే ఖాళీగా ఉన్నాయి. అయినా... అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడం పట్ల పలువురు విస్మయం వ్యక్తంచేస్తున్నారు. ఓ ప్రజాప్రతినిధి మెప్పుకోసమే అధికార యంత్రాంగం పెద్దపల్లిలో అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటులో జాప్యం జరిగేలా అధికారులు ప్రయత్నిస్తున్నారని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. ఆనందనిలయం పేరిట రంగంపల్లిలోని అనాథబాలల వసతిగృహంలో కేవలం తొమ్మిదిమంది విద్యార్థులే ఉండడంతో వారందరినీ సమీపంలోని గిరిజన బాలుర వసతి గృహంలోకి మార్చారు. అప్పట్నుంచి ఆనంద నిలయం భవనం సైతం ఖాళీగానే ఉంటోంది.

ఎస్సారెస్పీ నీరు ఏవి?


- ఎమ్మెల్యేను అడ్డుకున్న రైతులు
- మూడు రోజులు నీళ్లిస్తే పంటలెలా?



ఎమ్మెల్యేను నిలదీస్తున్న రైతులు

జూలపల్లి(పెద్దపల్లి): ఎస్సారెస్పీ నీరు వారబందీ ప్రకారం వదులుతామని చెప్పి మూడు రోజులే ఇస్తే ఎలా అని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి శుక్రవారం మండలంలోని పెద్దాపూర్‌లో మిషన్ భగీరథ పనులు ప్రారంభించడానికి వెళ్తుండగా జూలపల్లి శివారులో కారును అడ్డుకున్నారు. ఎస్సారెస్పీ అధికారులు, మంత్రులు, ప్రజాప్రతినిధులు యాసంగిలో గుంట ఎండిపోకుండా నీరిస్తామని హామీ ఇచ్చారని.. దీంతో రెండో పంట వేశామని తెలిపారు. మాట నమ్మి సాగుచేస్తే నష్టం జరిగే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. వరినార్లు ముదురుతున్నాయని.. నీళ్లు రావని ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మిగితా నియోజకవర్గాలకు ఎస్సారెస్పీ నీరువస్తుండగా ఈ నియోజకవర్గ ప్రజలు ఏపాపం చేశారని విమర్శించారు. ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ చొప్పదండి మండలం రెవెళ్లిలో 2500 క్యూసెక్కుల నీరువస్తేనే డీ86, డీ83 కాలువలకు పూర్తిస్థాయిలో నీరు వస్తుం దని అక్కడికి 900 క్యూసెక్కుల నీరే వచ్చిందని తెలిపారు. జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, బాల్కొండ నియోజకవర్గాల్లో కాలువకు దాదాపు 2400 మోటార్లు రైతులు పెట్టుకుని నీరు కిందికి రాకుండా చేస్తున్నారని తెలిపారు. ఈ విషయమై సీఈ, మంత్రులు హరీష్‌రావు, ఈటల రాజేందర్‌ల దృష్టికి తీసుకెళ్లినట్లు వివరించారు. ఈ నెల 9 నుంచి వారం రోజులపాటు నీరు విడుదల చేస్తామన్నారు. తక్కువ రోజుల్లో పండే ఆరుతడి పంటలు మాత్రమే సాగు చేసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యేతో మాట్లాడినవారిలో దాదాపు 50 మంది రైతులు, టీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

రాజీవ్ రహదారిపై కమ్ముకున్న చీకట్లు



పెద్దపల్లిలోని రాజీవ్ రహదారిపై వీధిదీపాలు వెలగడంలేదు. అసలే ప్రమాదాల దారి పైపెచ్చు రహదారిపై వెలుగులు లేకపోవడంతో అటు వాహణదారులు... ఇటు జనం ఇబ్బందులు పడుతున్నారు. పెద్దపల్లి ప్రధాన చౌరస్తా.. కూడళ్లలో పనుల నిమిత్తం జనం అటూ ఇటూ తిరుగుతుంటారు. వాహనాలూ వెళ్తుంటాయి. ఏదైనా జరగరానిది జరిగితే ఎవరు బాధ్యులు. **– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి**

ఎత్తిపోతల కోసం ఆందోళన

- కదంతొక్కిన రైతులు, అఖిలపక్షనాయకులు
- దీక్ష చేపట్టిన అన్నదాతలు



‘ఎత్తిపోతలు’ మంజూరు చేయాలని రాస్తారోకో చేస్తున్న రైతులు, గ్రామస్తులు

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): కాల్వశ్రీరాంపూర్ మండలం మంగపేట హుస్సేన్‌మియా వాగుపై ఎత్తిపోతల పథకం మంజూరు చేయాలని చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం అఖిల పక్ష నాయకులు, రైతులు దీక్షచేపట్టి రాస్తారోకో చేశారు. గ్రామంలో 300 ఎకరాల భూములు సాగునీరు లేక ఎండిపోతున్నాయని... వర్షాధారంతోనే పంటలు పండించుకుంటున్నామని ప్రభుత్వం కనికరించి హుస్సేన్ మియా వాగునుంచి ఎత్తిపోతల పథకం చేపట్టి పంట పొలాలకు నీరందించి కాపాడలని కోరారు. గతంలో తాము ప్రభుత్వాలకు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని.. టీఆర్ఎస్ ప్రభుత్వం కనికరించి ఎత్తిపోతల పథకం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే ఫోన్‌చేసి ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న సాగు నీటి సమస్య ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి పరిష్కరించేందుకు కృషిచేస్తానని చెప్పడంతో రాస్తారోకో విరమించి దీక్ష కొనసాగించారు. కార్యక్రమంలో సర్పంచ్ అనిసాపర్వీన్, ఉప సర్పంచ్ సదయ్య, మాజీ ఎంపీటీసీలు డొంకెన మొగిలి, బొంగోని శ్రీనివాస్‌గౌడ్, కలీమొద్దీన్, సీపీఐ జిల్లా నాయకులు మంద రాజేందర్, రైతులు కొము రయ్య, రాజగట్టు, తిరుమల రాజేందర్, మహిళా రైతులు పాల్గొన్నారు.

దృష్టికి రాలేదు
– ఈద శంకర్ రెడ్డి ఐడీసీ చైర్మన్
మంగపేట గ్రామంలో ఎత్తిపోతల పథకం కావాలని అక్కడి రైతులు ఇంత వరకు దృష్టికి తీసుకురాలేదు. రైతులు ఒక్కసారిగా రోడ్డెక్కడం బాధాకరం. హుస్సేన్‌మియా వాగునుంచి లిఫ్టు ద్వారా పరిసర ప్రాంతాల రైతులకు సాగునీరు అందించేందుకు తప్పకుండా తన వంతు కృషిచేస్తా. సాగు నీటి సమస్య పరిష్కరించే విషయంలో ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంది.





గోదావరిఖనిటౌన్: రాంగ నగర్‌లోని ప్రధాన రహదారిపై దారిలో తెరిచి ఉన్న మ్యాన్ హోల్‌తో ప్రమాదం పొంచి ఉంది. అధికారులకు విషయం తెలిసినా ఇప్పటికి మ్యాన్ హోల్‌ను మూసి వేయలేదు. అధికారులు స్పందించి వెంటనే మ్యాన్ హోల్‌ను మూసి వేయాలని కోరుతున్నారు.

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 9010201669

న్యూస్ బాక్స్

బహిరంగ మల, మూత్ర విసర్జన నిషేధం

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో బహిరంగ మల మూత్ర విసర్జన చేయడాన్ని నిషేధించినట్లు బల్దియా డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు తెలిపారు. గోదావరిఖని చౌరస్తాలోని పోచమ్మ మైదానం సమీపంలోని ఐడీఎస్‌ఎంటీ షాపింగ్ కాంప్లెక్స్ వెనుక మూత్రవిసర్జన చేస్తున్నారని వచ్చిన ఫిర్యాదుల మేరకు ఆయన డివిజన్ కార్పొరేటర్ మహంకాళి స్వామితో కలిసి పరిశీలించారు. అదే సమయంలో కొందరు మూత్ర విసర్జన చేస్తుండడంతో వారిని పిలిచి మందలించారు. ఇద్దరికి రూ.100 చొప్పున జరిమానా విధించారు. మలమూత్ర విసర్జన రహిత ప్రాంతంగా మార్చడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ ప్రాంతంలో ప్రతి రోజు సిబ్బందిని నిఘా పెడుతున్నట్లు తెలిపారు.

జాతర ఏర్పాట్లపై సమీక్ష

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని గోలివాడ గోదావరినది శివారులో ఈనెల 29 నుంచి ప్రారంభమయ్యే సమ్మక్క, సారలమ్మ జాతర ఏర్పాట్లపై శుక్రవారం జాతర ప్రదేశంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అంతర్గాం ఎస్సై శీలం ప్రమోద్‌రెడ్డి భక్తుల ఏర్పాట్లపై జాతర కమిటీ చైర్మన్ పెంద్రు మల్లారెడ్డికి పలు సూచనలు, సలహాలిచ్చారు. జాతర నిర్వహించే ప్రాంతంలో కమిటీ తరపున చేపట్టాల్సిన పనులపై పరస్పరం చర్చించారు.

సేవాలాల్ రాష్ట్ర మహాసభలకు తరలిరండి

గోదావరిఖని: మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో ఈ నెల 10, 11 తేదీల్లో జరిగే సేవాలాల్ సేన రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు మాలోతు రమేష్, రఘు, రాజు ఒక ప్రకటనలో కోరారు. జిల్లానుంచి లంబాడీలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

ట్రాక్టర్లను నిలిపిన గ్రామస్తులు

జ్యోతినగర్:రామగుండం కార్పొరేషన్ ఐదో డివిజన్ న్యూపోరట్‌పల్లి మహిళలు శుక్రవారం ట్రాక్టర్లను నిలిపి నిరసన వ్యక్తం చేశారు.మట్టి లోడ్‌తో వెళుతున్న ట్రాక్టర్లవల్ల ఇళ్లలోకి ఎక్కువ దుమ్ము వస్తుందని తెలిపారు. అనంతరం ట్రాక్టర్ యజమానులు నీరు చల్లిస్తామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. లక్ష్మి, అలీమా, నాగలక్ష్మి, సూరమ్మ పాల్గొన్నారు.

గోదావరిఖనిటౌన్: పారిశ్రామిక ప్రాంతమైన రామగుండం కార్పొరేషన్ పరిధిలోని రాంనగర్ సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతోంది. అడుగడుగున సమస్యలతో కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకవైపు పచ్చదనం పరిశుభ్రత పేరున వివిధ కార్యక్రమాలతో ముందుకు వెళుతున్న పరిస్థితుల్లో కాలనీవాసులు మాత్రం దుర్గంధం మధ్య జీవనం సాగిస్తున్నారు. కాలనీలో సింగరేణి రైలు పట్టాలను ఆనుకోని ఉన్న స్థలంలో కార్పొరేషన్ ఆధ్వర్యంలో చెత్తను డంప్ చేస్తున్నారు. దీంతో దుర్వాసన వల్ల నిత్యం కాలనీవాసులు ఇళ్లలో ఉండలేని స్థితి నెలకొంది.

- దుర్వాసనతో ప్రజల ఇబ్బందులు
- ఇప్పటికి నిర్మించని కాలువలు

సమస్యల సుడిగుండం

కాలనీలో పూర్తిస్థాయిలో డ్రెయినేజీలు నిర్మించకపోవడంతో మురుగునీరు రోడ్లపైకి వస్తున్నాయి. వర్షాకాలం నీటి గుంతలు ఏర్పడి పందులు, గేదెలకు స్థావరాలుగా మారాయి. మురుగు గుంతల వల్ల దోమలు వ్యాప్తి చెంది, వ్యాధుల బారిన పడుతున్నామని కాలనీవాసులు అంటున్నారు.

"ఇప్పటి వరకు స్థానికులు పలువురు డెంగ్యూ వ్యాధిన పడ్డారని తెలిపారు. అలాగే తాగునీరు వారంలో ఒక్కసారి అందిస్తున్నారని అంటున్నారు. అధికారులు స్పందించి ప్రతీరోజు తాగునీరు అందించే విధంగా చూడాలని కోరుతున్నారు. ఈ సందర్భంగా 'సాక్షి'తో పలువురు మాట్లాడారు. వారి మాటల్లోనే.."



కాలువలు కట్టకపోవడంతో ఏర్పడిన గుంతల్లో గేదెలు



తాగునీరు అందించాలి

తాగునీరును ప్రతీరోజు అందించాలి. వారంలో ఒక రోజు అందించడం వలన ఇబ్బంది పడుతున్నాం. దూర ప్రాంతాల నుంచి తాగునీరును తీసుకువస్తున్నాం. ప్రతి నిత్యం అందే విధంగా అధికారులు చొరవ తీసుకోవాలి. **– కొమురమ్మ, స్థానికురాలు**

చెత్త డంప్ ఖాళీ స్థలాన్ని పార్క్‌గా ఏర్పాటు చేయాలి



కాలనీలో ఖాళీగా ఉన్న స్థలాన్ని ప్రజల సేవార్థం పార్క్‌ను ఏర్పాటు చేయాలి. దీంతో దుర్వాసన ఇబ్బందులు పోవడమే కాకుండా ప్రశాంతవంతమైన ప్రదేశంగా ఏర్పడుతుందని, దీని కోసం కార్పొరేషన్, సింగరేణి అధికారులు స్పందించాలి.

– పిడుగు కృష్ణ, డివిజన్ కార్పొరేటర్

వాసన భరించలేకపోతున్నాం



కాలనీలో పూర్తిగాని మురుగు కాలువలు, అలాగే ఉన్న కాలువలను శుభ్రం చేయకపోవడంతో దుర్వాసనతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నాం. అధికారులు పాలకులు స్పందించి కాలువలను శుభ్రం చేయాలి. నూతన కాలువలను కట్టించాలి. తిండి తినలేక పోతున్నాం.

– లక్ష్మణ్, స్థానికుడు

బల్దియాలో పొడి చెత్త కొనుగోలు

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో రోడ్లపై పొడి చెత్త పేరుకుపోకుండా వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది పాలకవర్గం. ఇంటింటి నుంచి చెత్త సేకరించే సిబ్బంది కిలో రూ.2 చొప్పున పొడి చెత్తను కొనుగోలు చేస్తోంది. ఈ కార్యక్రమాన్ని శుక్రవారం నగర మేయర్ కొంకటి లక్ష్మీనారాయణ ప్రారంభించారు. స్థానిక 13వ డివిజన్‌లో చెత్తను కొనుగోలు చేసిన సందర్భంగా మేయర్ స్వయంగా డబ్బులు చెల్లించి చెత్తను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామగుండంను పరిశుభ్రమైన ప్రాంతంగా గుర్తింపు తెచ్చేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. 50 డివిజన్లలో ఇంటింటికి ట్రైసైకిళ్ల ద్వారా పారిశుధ్య కార్మికులు వెళ్లి తడి చెత్త, పొడి చెత్తను సేకరిస్తున్నారు. పొడి, తడి చెత్తను వేర్వేరుగా ఇవ్వాలని, పొడి చెత్తను మాత్రం కిలో రూ.2 చొప్పున పారిశుధ్య కార్మికులకు అమ్మాలని సూచించారు. ఒక్కో కార్మికుడు సేకరించిన చెత్తపై సూపర్‌వైజర్లు నివేదికలు తయారు చేస్తారని తెలిపారు. ప్రతి రిక్షాకు ఒక తరాజును ఇచ్చినట్లు తెలిపారు. స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వేలో రామగుండంకు పదిలోపు ర్యాంకు వచ్చేందుకు



చెత్త కొనుగోలును పరిశీలిస్తున్న మేయర్

ప్రజలంతా పరిశుభ్రత నగరం కోసం సహకరించాలని కోరారు. మంచి ర్యాంకు వస్తే రామగుండం అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు కూడా ఎక్కువగా మంజూరయ్యే అవకాశాలు ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో నగర కమిషనర్ బి.శ్రీనివాసరావు, డివిజన్ కార్పొరేటర్ జాలి రాజమణి, ఏసీపీ పురుషోత్తం, మేనేజర్ వెంకటేశ్వర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిషోర్, శానిటరీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

లోకల్ వాయిస్

వీధి లైట్లు ఏర్పాటు చేయాలి



గోదావరిఖనిటౌన్: స్థానిక రాంనగర్ కాలనీలో వీధి లైట్లు ఏర్పాటు చేయాలి. లేకుంటే రాత్రి వేళల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. చిమ్మచీకటిలో వీధుల్లో నడవడం కష్టమవుతోంది. అంతేగాక కాలనీలో కుక్కల బెడద ఎక్కువైంది. పగలు, రాత్రి తేడా లేకుండా కుక్కలు తిరుగుతున్నాయి. బయటికి రావాలంటే ప్రజలు జంకుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలి.

- ఉపేందర్, గోదావరిఖని



సాక్షి పెద్దపల్లి
శనివారం | జనవరి | 6 | 2018



2 కంట్రీస్
శ్రీనివాస(ఫోన్–241688)
11:30, 2:30, 6:30, 9:30.
ఎంసీఏ
న్యూఅశోక(ఫోన్–244885)
11:30, 2:30, 6:00, 9:00.
హలో
ఊర్వశి(ఫోన్–244885)
11:30, 2:30, 6:00, 9:00.

రవాణా చట్టాన్ని రద్దు చేయాలి



ధర్నా చేస్తున్న టీఎంయూ నాయకులు, ఉద్యోగులు

గోదావరిఖనిటౌన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రవాణ చట్టాన్ని రద్దు చేయాలని. దీంతో ఆర్టీసీ ఉద్యోగులకు నష్టవాటిల్లనుందని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే రివైజ్డ్ పే స్కేల్ అందించాలని కోరుతూ శుక్రవారం గోదావరిఖని బస్ డిపో ముందు తెలంగాణ మజ్దూర్ సంఘం నాయకులు, ఉద్యోగులు ఎర్ర బ్యాడ్జీలను ధరించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా డిపో అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి వంగర శ్రీనివాస్, రాజయ్య మాట్లాడారు. పెండింగ్ సమస్యలను పరిష్కరించడంలో ఆర్టీసీ, యాజమాన్యం, అధికారులు విఫలమవుతున్నారని ఆరోపించారు. కాంట్రాక్ట్ ఉద్యోగాల పర్మినెంట్, మహిళ కండక్టర్లకు ప్రత్యేక వసతులు, గ్యారేజీలో పూర్తి సౌకర్యాలు ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మన్, గుమ్మడి రవి, కె ఎం రెడ్డి, కేఆర్ రెడ్డి, తిరుపతి, చారి, లింగయ్య, స్వామి, మూర్తి, ఆంజనేయులు, వెంకటేశ్, రమేశ్ పాల్గొన్నారు. అలాగే జిల్లా వ్యాప్తంగా పర్యటిస్తున్న తెలంగాణ మజ్దూర్ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ థామస్‌రెడ్డి శుక్రవారం గోదావరిఖని డిపో ముందు ఆసిఫాబాద్‌కు వెళుతూ కార్మికులను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సంఘం బలోపేతం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఆలయ భూములపై అధికారులు స్పష్టత ఇవ్వాలి

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని రాయదండి చిలుకల రామేశ్వరాలయ దేవాదాయ భూములపై ఎండోమెంట్ అధికారులు స్పష్టత ఇవ్వాలని రామగుండం జెడ్పీటీసీ కందుల సంధ్యారాణి డిమాండ్ చేశారు. ఆలయం ఎదుట చేస్తున్న రిలే నిరాహార దీక్షలు నాలుగవ రోజుకు చేరాయి. దీక్షా శిబిరాన్ని శుక్రవారం సందర్శించిన జెడ్పీటీసీ మాట్లాడుతూ భూముల పరిరక్షణకు తనవంతుగా పాటుపడతానని హామీ ఇచ్చారు. దీనిపై త్వరితగతిన ఎండోమెంట్ అధికారులు దేవాలయ భూములను గుర్తించాలని కోరుతున్నానన్నారు. దీక్షలలో పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సీఐగా రమేశ్‌బాబు

కోల్‌సిటీ: రామగుండం ట్రాఫిక్ సీఐగా రమేశ్‌బాబు శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. కరీంనగర్ జిల్లా రామడుగు మండలం వెదిర గ్రామానికి చెందిన ఆయన 2010లో ఆదిలాబాద్ జిల్లా వాంకిడి, గోదావరిఖని వన్ టౌన్‌లో ఎస్సైగా విధులు నిర్వహించారు. రామగుండం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

సావిత్రిబాయి పూలే జయంతి

గోదావరిఖని: సావిత్రిబాయి పూలే జయంతిని శుక్రవారం మాలమహానాడు ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక ఎల్‌బీనగర్‌లోని కార్యాలయంలో జాతీయ అధ్యక్షుడు వెల్తురు మల్లయ్య పాల్గొని పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వితంతువులపై, దళితులపై బ్రాహ్మణవాద మతోన్మాదుల ఆకృత్యాలను ఎదురించిన ధీర వనిత అన్నారు. కార్యక్రమంలో నాయకులు గడ్డం నారాయణ, సదానందం, మల్లయ్య, సుశీల, పంచశీల, రవి, గాదం శంకరయ్య, ఆగయ్య, మొగిళి, నర్సయ్య, గోపాల్ పాల్గొన్నారు.

రెడ్డి సంఘం ఆధ్వర్యంలో సంక్రాంతి ఆటల పోటీలు

యైటింక్లయిన్‌కాలనీ: రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆటల పోటీలను ఈనెల 12, 13తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు పిన్నింటి రాంరెడ్డి, మహిళా అధ్యక్షురాలు ముద్దసాని సంధ్యారాణి తెలిపారు. స్థానిక ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని రెడ్డి కులబాంధవులకు ముగ్గుల పోటీలను స్థానిక షాపింగ్‌కాంప్లెక్స్‌లో, ఆటల పోటీలను సీఈఆర్ క్లబ్‌లో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే వారు ముందుగా సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని అన్నారు. గెలుపొందిన వారికి బహుమతి అందజేయనున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర క్యాలెండర్‌ను విడుదల చేశారు. పాల్గొనే వారు 9849989465 నంబర్‌లో సంప్రదించాలని కోరారు,



నూతన క్యాలెండర్‌ను విడుదల చేస్తున్న నాయకులు

ఎంపీటీసీ గంటా వెంకటరమణారెడ్డి, నాయకులు విజేందర్ రెడ్డి, సంపత్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, బండ రమేష్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మంజుల, లక్ష్మి, స్వరూప పాల్గొన్నారు.

మనోచైతన్యకు ప్రభుత్వ చీఫ్‌విప్ ఆర్థికసాయం

గోదావరిఖనిటౌన్: గోదావరిఖని గాంధీనగర్‌లోని మానసిక వికలాంగుల కేంద్రం మనోచైతన్యకు ప్రభుత్వ చీఫ్‌విప్ కొప్పుల ఈశ్వర్ జన్మదిన సందర్భంగా మనోచైతన్యకు రూ.50వేల ఆర్థికసాయాన్ని అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కొప్పుల దంపతులు కేక్ కట్ చేసి వికలాంగులకు స్వీట్లు పంపిణీ చేశారు. మానసిక వికలాంగుల కోసం సమాజంలోని అన్ని వర్గాలు కృషి చేయాలని కోరారు. అంతకుముందు మానసిక వికలాంగులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో నాయకులు పెంట రాజేశ్, మనోచైతన్య నిర్వాహకులు కృష్ణకుమార్ పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న ఈశ్వర్ దంపతులు

ఎన్టీపీసీలో 'తుపాకీ రాముడు' చిత్రీకరణ

జ్యోతినగర్: ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్‌లో శుక్రవారం తుపాకీ రాముడు సినిమా షూటింగ్ జరిగింది. బుల్లితెర నటుడు బిత్తిరిసత్తి జ్యూస్ సెంటర్‌లో ఉన్న సన్నివేశాన్ని చిత్రీకరించారు. రసమయి క్రియేషన్స్ పతాకంపై నిర్మిస్తున్న ఈ చిత్రానికి డైరెక్టర్‌గా ప్రభాకర్, మేనేజర్‌గా వెంకటేశ్వర్లు వ్యవహరిస్తున్నారు. చిత్రీకరణ సమయంలో సత్తి చూసేందుకు తరలివచ్చారు. ఎన్టీపీసీ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



జ్యూస్ సెంటర్ చిత్రీకరణలో పాల్గొన్న బిత్తిరి సత్తి

ఘనంగా ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు



అగ్నిప్రతిష్ఠ పూజలలో పాల్గొన్న దంపతులు

జ్యోతినగర్: శ్రీసీతారామాంజనేయ, చంద్రమౌళీశ్వర, అయ్యప్పస్వామి ఆలయంలో సీతారామచంద్రస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు కన్నుల పండువగా నిర్వహించారు. శుక్రవారం చిన్న జీయర్ స్వామి యాజ్ఞిక బృందంచే సుప్రభాత సేవ, ఆరాధన సేవా కాలం, శాత్తుముట్టై, తీర్థప్రసాద గోష్ఠి, శాంతి పాఠం, అంకురార్పన, అగ్ని ప్రతిష్ఠ, చతుస్థానార్చన, ద్వారతోరణం, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు గోవర్ధన సీతారామాచార్యులు, గోవర్ధనగిరి నరసింహాచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు చెప్యాల రామారావు, కేశవరావు, సత్యనారాయణరావు, శ్రీపతిరావు పాల్గొన్నారు.

ఆశ్రమానికి దుస్తులు అందజేత

కోల్‌సిటీ: స్థానిక ఆర్‌సీఓఏ క్లబ్ సమీపంలోని ఆదరణ నిస్సహాయ పిల్లల ఆశ్రమానికి వస్త్రమూట వ్యాపారుల సహకార సంఘం ఆధ్వర్యంలో దుస్తులు అందజేశారు. శుక్రవారం ఆశ్రమంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రూ.20వేల విలువైన మిక్సీ, ఆఫీస్ చెయిర్, కొత్త దుస్తులు, బెడ్‌షీట్లు, దుప్పట్లను టీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమారపు అరుణ్‌కుమార్ చేతులమీదుగా అందజేశారు. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఆడెపు రాజమౌళి, ఎ.రాజమౌలి, మహేష్, వంగ వీరస్వామి, దయానంద్ గాంధీ, పత్తిపాక సుదర్శన్, చింతకింది శంకరయ్య, మూర్తి, లక్ష్మణ్, అశోక్, శ్రీనివాస్, రవి, బుచ్చయ్య, ఆశ్రమ నిర్వాహకులు ఈవీ లక్ష్మి, సీహెచ్ కృష్ణ, శ్రీనివాస్, అర్చన పాల్గొన్నారు.

జీడీనగర్‌లో సూర రవి సంస్మరణ సభ

- హాజరైన మాజీ మంత్రి శ్రీధర్‌బాబు

పాలకుర్తి: పాలకుర్తి మండలం కన్నాల జీడీనగర్‌లో శుక్రవారం ఇటీవల మృతి చెందిన కాంగ్రెస్ నాయకుడు సూర రవి సంస్మరణ సభ నిర్వహించారు. స్థానిక నాయకులు ఇబ్రహీం, లక్ష్మీనర్సయ్య, ఎర్రం స్వామి, రాజ్‌కుమార్, బొబ్బిలిరాజ్, వెంకటేశం పాల్గొన్నారు. మాజీ మంత్రి శ్రీధర్ బాబు, పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు, కేశోరాం సిమెంట్ కర్మాగారం పర్మినెంట్ కార్మిక సంఘం అధ్యక్షుడు కౌశికహరి, ప్రధాన కార్యదర్శి తోడేటి రవికుమార్, కాంట్రాక్ట్ కార్మికసంఘం అధ్యక్షుడు మక్కాన్‌సింగ్, కేశోరాం ప్లాంట్ హెడ్ శివనాగేశ్వరరావు, మేనేజర్ కె.ఎన్.రావు, మంథని జెడ్పీటీసీ మూల సరోజన, టీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు చందుపట్ల సునీల్‌రెడ్డి, ఎంపీటీసీ గంటా వెంకటరమణారెడ్డి రవికి నివాళులు అర్పించారు.

ఆయన నేత్రాలు సజీవం

రవి నేత్రాలను సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కుటుంబసభ్యులు దానం చేశారు. ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్ ప్రతినిధులు లింగమూర్తి, పృథ్వీరాజ్, రాజు, సతీష్, సారంగం పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

గోదావరిఖనిటౌన్: అంబేడ్కర్ సాహిత్య అకాడమి ఆధ్వర్యంలో జాతీయ అవార్డు అందుకున్న రామగుండం జెడ్పీటీసీ కందుల సంధ్యారాణికి పెరుక సంఘం ఆధ్వర్యంలో స్థానిక సప్తగిరి కాలనీలోని అక్షర పాఠశాలలో సన్మానించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు చొక్కయ్య, నాయకులు కుమార్, సృజన, అచ్చె వేణు, రాజు, తాజ్, దుండె మల్లేశ్ పాల్గొన్నారు.

హలో సాక్షి..
మంథని : 9440381258
సెంటినరీకాలనీ : 9866444343
కమాన్‌పూర్ : 9849433556
ముత్తారం : 9705346624





కమాన్‌పూర్ మండలం బాపూజీనగర్ వద్ద మంథని-పెద్దపల్లి ప్రధాన రహదారి ప్రమాదకరంగా మారింది, వర్షాలకు రోడ్డు పక్కన ఉన్నమట్టి కొట్టుకుపోవడంతో రెండు వాహనాలు ఎదురుగా వస్తే ప్రమాదం పొంచి ఉంది.

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 9440381258

నిబంధనలు బేఖాతర్..!

మంథని: ఎమ్మార్పీకి మించి ఎక్కువ ధరకు మద్యం అమ్మకాలు చేస్తే ఫిర్యాదులు చేయండి.. సంబంధిత మద్యం దుకాణంపై చర్యలు తీసుకుంటామని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ మొదలుకొని సర్కిళ్ల పరిధిలో సీఐలు ప్రకటనలు చేస్తే నిజమే కావచ్చు అనుకొని అనేక మంది ఫిర్యాదు చేస్తే వాటిని పట్టించుకునే వారే కరువయ్యారు. ఇటీవల పెరిగిన ధరలకనుగుణంగా కొత్త స్టాక్‌ను అమ్మాలని, అయితే పాతస్టాక్‌ను పాత రేట్లకే అమ్మాలని నిబంధనలు పెట్టినా మద్యం దుకాణ యజమానులు పాత ధరలకే దర్జాగా విక్రయిస్తున్నారు. దీనిపై ఎన్ని ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదు. కనీసం ఫిర్యాదులు స్వీకరించే ఎక్సైజ్ టోల్‌ఫ్రీ నంబర్ కూడా స్పందించడం లేదనే ఆరోపణలున్నాయి.

- పాత స్టాక్..కొత్త రేట్లతో అమ్మకాలు
- ప్రకటనలు సరి..ఫిర్యాదుల మాటేమిటి
- మద్యం దుకాణాలపై చర్యలకు అధికారుల వెనుకడుగు

ఇటీవల మద్యం ధరలకు పెరిగాయి. అయితే పెరిగిన ధరలకనుగుణంగా అమ్మకాలు చేయడం వ్యాపారి సహజత్వం. కాని పాత స్టాక్‌ను కొత్త రేట్లకు అమ్మకం నిబంధనలకు విరుద్ధమే కదా..ఇలా జిల్లాలోని అనేక చోట్ల జరుగుతున్నా ఎక్సైజ్ పోలీసులు చూసిచూడనట్టుగా ఉంటున్నారు. పెరిగిన ధరతో కొత్తగా బాటిళ్ల తయారు కావడానికి సమయం పడుతుంది. పాత ఎమ్మార్పీ ప్రింటుతో ఉన్న మద్యం సీసాలకు కొత్త రేట్లతో ఇన్‌వాయిస్ అయితే పెరిగిన ధరలకు అనుగుణంగా అమ్మకాలు చేయాలి. అనేక మంది మద్యం దుకాణదారులు పాత స్టాక్‌ను పెరిగిన ధరలకు దర్జాగా విక్రయిస్తున్నారు. ఎమ్మార్పీ కంటే రూ.10 నుంచి రూ.20 పెంచి విక్రయాలు చేస్తున్నారు. ఇదేంటని అడిగితే ధరలు పెరిగాయని సమాధానం చెబుతున్నారు. ఎవరైన బాటిల్‌పై ఉన్న బ్యాచ్ నంబర్ ఆధారంగా ఇన్‌వాయిస్ చూపమంటే అందుకు మద్యం దుకాణదారులు ముందుకు రావడం లేదు. ఏదో సాకుచెబుతూ చూపకపోవడం లేదా..అసలు మీరు అడిగిన రకం బాటిల్ అందుబాటులో లేదని చెబుతునారని మద్యంప్రియులు అంటున్నారు.

ఎలక్ట్రానిక్ బిల్లులు ఏవి?

కొత్త పాలసీ ప్రకారం ప్రతి మద్యం దుకాణం ఎదుట ధరల పట్టికను సూచించే బోర్డును ఏర్పాటు చేయాలి. అంతేగాకుండా బాటిల్ స్కాన్ చేసి కంప్యూటర్ బిల్లును వినియోగదారుడికి అందజేశాలి. ఆ నిబంధన అమలు కాకున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. ఎవరైన వినియోగదారుడు బిల్లు అడిగితే చేతిరాతతో బిల్లు ఇస్తున్నారు. ఒక్కో మద్యం దుకాణంలో ఇప్పటికీ వరకు 2 నుంచి 3 బిల్లులు మాత్రమే ఇచ్చారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. జిల్లాలోని మంథని, పెద్దపల్లి, రామగుండం, సుల్తానాబాద్ సర్కిల్ పరిధిలో 75 మద్యం దుకాణాలున్నాయి. క్వాటర్ బాటిల్ పై రూ.10 నుంచి 20 చొప్పున ఎక్కువ అమ్ముతుంటే రోజు లక్షల్లోనే దోపిడీ జరుగుతోంది. మామూళ్ల మత్తులో ఉంటారనే ఆరోపణలు ఎదుర్కొనే ఎక్సైజ్ పోలీసులు ఫిర్యాదులు చేసినా పట్టించుకోకపోవడంపై విమర్శలు ఎదుర్కొంటున్నారు. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు జోక్యం చేసుకొని జిల్లాలో జరుగుతున్న ఎక్కువ ధరలకు మద్యం దందాను అరికట్టాలని పలువురు వినియోగదారులు కోరుతున్నారు.



చేతితో రాసిచ్చిన బిల్లు ప్రతి(రూ.120)



రూ.110 ఎమ్మార్పీ ఉన్న బాటిల్

కంప్యూటర్ బిల్లు అడిగితే మందు లేదన్నారు..



మంథనిలోని ఒక మద్యం దుకాణంలో ఐబీ క్వాటర్ తీసుకున్నా. ఎమ్మార్పీ కంటే రూ.10 ఎక్కువ తీసుకున్నారు. బిల్లు ఇవ్వమంటే మందే లేదన్నాడు. అదేంటని అడిగితె నీ ఇష్టం వచ్చిన కాడ చెప్పుకోమని బెదిరించాడు.

– మేదరవేన మల్లేశం, మంథని

ఎమ్మార్పీకి మించి అమ్మరాదు

ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరలకు మద్యం విక్రయాలు చేయరాదు. మద్యం ధరలు గతనెల 27 నుంచి పెరిగాయి. పాతప్రింట్‌తో బాటిల్ వస్తున్నా కొత్త రేటుతో ఇన్‌వాయిస్ జారీ అయింది.

– గురువయ్య, ఎక్సైజ్ సీఐ, మంథని

న్యూస్ బాక్స్

నాలుగు గ్రామాల్లో రెవెన్యూ గ్రామసభలు

ముత్తారం: మండలంలోని ఖమ్మంపల్లి, ఇప్పపల్లి(రామకృష్ణాపూర్), మైదంబండ పంచాయతీ పరిధి సర్వారం, మచ్చుపేట పంచాయతీ పరిధి శుక్రవారంపేట గ్రామాల్లో శుక్రవారం రెవెన్యూ గ్రామసభలు నిర్వహించారు. ఇటీవల నిర్వహించిన భూ రికార్డుల శుద్ధీకరణలో చేసుకున్న దరఖాస్తులల్లో సవరణ చేసిన రికార్డుల వివరాలను గ్రామసభల్లో చదివి వినిపించారు. తప్పులు ఉన్నట్లయితే రెండు రోజుల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తప్పులను మరోసారి సవరణ చేసి తుది జాబితా ప్రకటిస్తామని వివరించారు. వేర్వేరుగా నిర్వహించిన కార్యక్రమాల్లో తహసీల్దార్ ఇందారపు పుష్పలత, డిప్యూటీ తహసీల్దార్ మురళీకృష్ణ, ఆర్ఐ పోచయ్య, వీఆర్వోలు శ్రీనివాస్, షరీఫ్, వెంకటరమణ, రాజయ్య, శ్రీనివాస్‌లతోపాటు వీఆర్ఏలు పాల్గొన్నారు.

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని పాత తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. భూ రికార్డుల సర్వేలో నమోదు చేసిన రికార్డులను చదివి వినిపించారు. అభ్యంతరాలున్న వారి నుంచి దరఖాస్తులను స్వీరించారు. తహసీల్దార్ రాజమణి, సీనియర్ అసిస్టెంట్ పిట్టల సదయ్య, వీఆర్వోలు పాల్గొన్నారు.

రాజకీయ శిక్షణ తరగతులకు తరలిరావాలి

కమాన్‌పూర్: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో ఈనెల 6, 7 తేదీల్లో నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌లో నిర్వహించే రాజకీయం శిక్షణ తరగతులకు తరలిరావాలని ఎమ్మార్పీఎస్ నాయకులు చిప్పకుర్తి రమేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ తరగతుల్లో అనేక మంది ప్రముఖులు పాల్గొననున్నారని పేర్కొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

కమాన్‌పూర్: మండలంలోని పేరపల్లికి చెందిన టీఆర్ఎస్ నాయకుడు ఆకుల రమేశ్‌కు ఎమ్మెల్యే పుట్ట మధు అందించిన రూ.5 వేలను టీఆర్ఎస్ నాయకులు శుక్రవారం అందజేశారు. రమేశ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. రెండు రోజుల క్రితం రమేశ్‌ను ఎమ్మెల్యే పరామర్శించారు. వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందజేసినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మేకల సంపత్, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, నాయకులు రామారావు, సదయ్య పాల్గొన్నారు.

గీత కార్మికులకు అండగా ప్రభుత్వం

- ఎమ్మెల్యే పుట్ట మధు

మంథని: రాష్ట్ర ప్రభుత్వం ఏ వర్గాన్ని విస్మరించకుండా అన్ని వర్గాలకు అండగా ఉంటుందని ఎమ్మెల్యే పుట్ట మధు అన్నారు. మంథనిలోని రేణుకా ఎల్లమ్మ ఆలయ సమీపంలో తాటి చెట్టిపైకి సులువుగా ఎక్కి కల్లుగీసే యంత్రం ప్రదర్శనకు ఉంచగా శుక్రవారం దానిపై కొద్ది దూరం వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గీత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం ఇప్పటికే అనేక సంక్షేమ పథకాలు తీసుకువచ్చిందని, రాబోయే రోజుల్లో వారికి అండగా ఉంటుందన్నారు. కార్మికులు ప్రమాదాల బారిన పడకుండా ఇలాంటి యంత్రాలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. ఆయనతోపాటు మంథని ఎంపీపీ ఏగోళపు కమల, వైస్ ఎంపీపీ వేల్పుల గట్టయ్య, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు మాచిడి సత్యనారాయణ, నాయకులు ఏగోళపు శంకర్‌గౌడ్, మాచిడి మోహన్, పూదరి సమ్మయ్య, ఆరెల్లి కొంరయ్యతోపాటు తదితరులున్నారు.



సులువుగా చెట్టు ఎక్కే యంత్రంపై వెళ్తున్న ఎమ్మెల్యే మధు

లోకల్ వాయిస్

డ్రెయినేజీలో పూడిక తీయించాలి



కమాన్‌పూర్ మండలం గుండారం గ్రామంలో రిజర్వాయర్ వెళ్లే దారి నుంచి హనుమాన్‌నగర్ వరకు ఏర్పాటు చేసిన డ్రైయినేజీలో పూడికను తొలగించాలి. కొద్ది నెలల నుంచి డ్రైయినేజీలో పూడిక చెత్తాచెదారం తొలగించకపోవడంతో నివాస ప్రజలు దోమలు, దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడం లేదు.

– ఆకుల ఓదెలు, గుండారం



వెండితెర



ఒక్క క్షణం
శ్రీనివాస(ఫోన్–241688)
ఎంసీఏ
న్యూఅశోక(ఫోన్–244885)
హలో
ఊర్వశి(ఫోన్–244885)
కమాన్‌పూర్
ఎంసీఏ
వెంకటేశ్వర
11:00, 2:00, 6:00, 9:00.

అయ్యప్ప పడిపూజ



ముత్తారం: మండలంలోని లద్నాపూర్‌లో గురువారం రాత్రి అయ్యప్ప పడిపూజ ఘనంగా జరిగింది. గ్రామానికి చెందిన బుర్ర రామకృష్ణ ఇంటి ఆవరణలో కుంకుమ, కలశ, గణపతి, అయ్యప్ప, సుబ్రమణ్యస్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంథనికి చెందిన గురుస్వామి ప్రకాశ్ పడిపూజ నిర్వహించగా ఆ ప్రాంతమంతా శరణుఘోషతో మారుమ్రోగింది. పరిసర గ్రామాల నుంచి అయ్యప్ప దీక్షాపరుల తోపాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వ్యతిరేక బిల్లును విరమించుకోవాలి

• బస్ డిపో ఎదుట కార్మికుల నిరసన



నిరసన తెలుపుతున్న టీఎంయూ సంఘం కార్మికులు

మంథని: రవాణా కార్మికులకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన బిల్లును వెంటనే విరమించుకోవాలని టీఎంయూ సంఘం మంథని డిపో కార్యదర్శి కేకే. రెడ్డి అన్నారు. మంథని డిపో ఎదుట భోజన విరామ సమయంలో కార్మికులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2017 ఏప్రిల్ 1 పేస్కేలు వెంటనే అమలు పర్చాలన్నారు. అలాగే ఎస్‌డబ్ల్యూఎఫ్ సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆర్టీసీ లాంటి సంస్థలను నిర్వీర్యం చేసేందుకే కేంద్రం బిల్లు తీసుకొస్తుందని డిపో అధ్యక్షుడు ఆంజనేయులు అన్నారు. వేర్వేరుగా జరిగిన ధర్నాలో టీఎంయూ అధ్యక్షుడు రహీం, గ్యారేజీ కార్యదర్శి ఈకేఎం.రావు, నాయకులు సదానందం, రవీందర్, ఖుతుబుద్దీన్, బీకే. స్వామి, ఖాదర్, ఈఎల్. రాజం, ఎస్‌డబ్ల్యూఎఫ్ డిపో కార్యదర్శి ఆర్. రాజయ్య, ఉపాధ్యక్షుడు రాజు, గౌరవాధ్యక్షుడు బూడిగ గణేశ్, నాయకులు వైస్ రెడ్డి, ఆర్ఎల్.ఎన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

కమాన్‌పూర్: గ్రామీణ ప్రాంతాల్లో అందిస్తున్న వైద్య సేవలను ఏఎన్ఎంలు ఎప్పటికప్పుడు ట్యాబ్‌లలో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీ ఆవరణలో ఏఎన్ఎంలకు శుక్రవారం ట్యాబ్‌లపై అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ నమోదుచేసే విధానాన్ని వివరించారు. గ్రామాల్లో ప్రజలకు టీబీ, షుగర్, క్యాన్సర్ వంటి పరీక్షలు చేసి వివరాలు నమోదు చేయాలని సూచించారు. జిల్లాలో 2011 నుంచి అందించిన వైద్య సేవలలకు సంబంధించిన రికార్డులు ఆన్‌లైన్ చేయడం జరుగుతుందన్నారు. కొద్దిరోజుల్లో జిల్లాలోని 147 మంది ఏఎన్ఎంలకు స్కూటీలను ప్రభుత్వం సబ్సిడీపై అందించనున్నదని తెలిపారు. మంథని, పెద్దపల్లి డెప్యూటీ డీఎంహెచ్‌వోలు యశోద, కృపాబాయి, జిల్లా మలేరియాధికారి డాక్టర్ నాగరాజ్, పీహెచ్‌సీ వైద్యాధికారి రజిని, సిబ్బంది, తూము నర్సయ్యతోపాటు తదితరులున్నారు.

మృతుల కుటుంబాలకు మాజీ మంత్రి పరామర్శ

ముత్తారం: లద్నాపూర్‌లో ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందిన మృతుల కుటుంబాలను టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు శుక్రవారం పరామర్శించారు. ఇటీవల హసన్‌పర్తి సమీపంలో రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన గడ్డం సంతోశ్, అనారోగ్యంతో మృతి చెందిన పెద్దపల్లి హన్మంతు కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట ఎంపీటీసీ వనం రాంచెందర్‌రావు, నాయకులు సురేశ్, స్వామి గౌడ్, తిరుపతియాదవ్ తదితరులున్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

• ఎమ్మెల్యే పుట్ట మధు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మధు

రామగిరి(సెంటినరీకాలనీ): అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పుట్ట మధు అన్నారు. మన ఊరు మన ఎమ్మెల్యే కార్యక్రమంలో భాగంగా రామగిరి మండలం బేగంపేట, నాగేపల్లి, రత్నాపూర్, సెంటినరీకాలనీల్లో శుక్రవారం పర్యటించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా స్వయంగా వారి సమస్యలు తెలుసుకోవడంతోపాటు వాటి పరిష్కారానికి తగిన సూచనలు చేస్తున్నామన్నారు. అంతే కాకుండా ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ ఫలాలు ప్రజలకు అందుతున్నాయా? వారు ఏమేరకు లబ్ధిపొందుతున్నారు, ప్రజలకు కావాల్సిన సౌకర్యాల కల్పనకు తీసుకోవాల్సిన చర్యలను తెలుసుకొని వాటి పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. మీ సహకారంతో ఎన్నో సంక్షేమ కార్యక్రమాలకు నాంది పలికానని మంథని నియోజక వర్గాన్ని మరో కోన సీమగా తీర్చిదిద్ది ఈప్రాంతంలోని చెరువులు, కుంటలు నీటితో కళకళలాడేలా చేసి రైతు కంట్లో ఆశలు చిగురింపజేయాలన్నదే ఆశయంగా ముందుకు సాగుతున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇనగంటి ప్రేమలత, జెడ్పీటీసీ మేకల సంపత్‌యాదవ్, మండల పార్టీ అధ్యక్షుడు పూదరి సత్యనారాయణగౌడ్, బేగంపేట, రత్నాపూర్ సర్పంచులు కెక్కర్ల సదానందం, బోగె లింగయ్య, ఆయా మండలాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్దాం



మాట్లాడుతున్న సునీల్‌రెడ్డి

మంథని: సీఎం కేసీఆర్ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని టిఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రుపట్ల సునీల్‌రెడ్డి అన్నారు. మంథనిలోని రాంరెడ్డి కాంప్లెక్స్‌లో సీఎస్ఆర్ నియోజకవర్గస్థాయి సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సునీల్ మాట్లాడుతూ ప్రభుత్వ ఫలాలు ప్రతి ఒక్కరికి చేర్చే బాధ్యత సీఎస్ఆర్ సభ్యులు తీసుకొవాలన్నారు. అనసూయమ్మ ట్రస్టు ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడుతామని తెలిపారు. జెడ్పీటీసీ మూల సరోజన, నాయకులు ఆక్బర్ ఖాన్, గంట వెంకటరమణారెడ్డి, ముస్కె ఈశ్వరమ్మ, రాజు, క్రిష్ణవేణి, బాలాజీరావు, రాజిరెడ్డి, సాంబయ్య పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తాం

ముత్తారం: గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లోని నైపుణ్యం వెలికి తీసి ట్రస్ట్ ద్వారా వారికి ప్రోత్సాహం అందిస్తామని టీఆర్ఎస్ యూత్ రాష్ట్ర కార్యదర్శి, చందుపట్ల అనసూర్యమ్మ చారిటేబుల్ ట్రస్ట్ చైర్మన్ చందుపట్ల సునీల్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఖమ్మంపల్లిలో ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను శుక్రవారం ప్రారంభించారు. క్రీడాపోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు అన్ని రకాలుగా చేయూత అందిస్తామని వివరించారు. ఈ పోటీల్లో 27 జట్లు తలపడనున్నట్లు తెలిపారు. మొదటి విజేతకు రూ.15 వేలు, రెండో విజేతకు రూ.5 వేల నగదు బహుమతితోపాటు షీల్డ్‌లు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. మంథని జెడ్పీటీసీ మూల సరోజన, కమాన్‌పూర్ మాజీ జెడ్పీటీసీ గంట వెంకటరమణారెడ్డి, చందుపట్ల సునీల్‌రెడ్డి యువసేన వివిధ మండలాల అధ్యక్షులు కొయ్యడ సతీశ్, మేకల మారుతి, మేడం ప్రవీణ్ పాల్గొన్నారు.

బెల్లం పట్టివేత



అధికారులు పట్టుకున్న బెల్లం

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని పలు కిరాణా షాపుల్లో నిల్వ చేసిన ఆరు క్వింటాళ్ల బెల్లం నిల్వలను శుక్రవారం పట్టుకున్నట్లు మంథని ఎక్సైజ్ సీఐ గురువయ్య తెలిపారు. తోట శ్రీనివాస్, కోలేటి సతీశ్, కోలేటి బాపు, కోలేటి వేణుల షాపుల్లో తనిఖీలు చేపట్టగా నిల్వ చేసిన బెల్లాన్ని స్వాధీనం చేసుకుని షాపు నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా బెల్లం నిల్వ చేయరాదని మేడారం జాతర ఉన్న నేపథ్యంలో షాపుల్లో అనుమతి లేకుండా బెల్లం విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరగుతుందని హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సైలు నాగేశ్వర్‌రావు, మురళీకృష్ణతోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ

చిందం శ్రీకాంత్
అంశం : వరినాట్లు
వ్యవసాయాధికారి, ముత్తారం



ప్రశ్న: మండలంలో వ్యవసాయ భూమి ఎంత ఉంది?
జవాబు: సుమారు 14500 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది.
ప్రశ్న: రబీలో వరి పంట ఎన్ని ఎకరాల్లో సాగవుతుంది?
జవాబు: సుమారు 6100 ఎకరాల్లో వరి సాగు చేసే అవకాశం ఉంది.
ప్రశ్న: నాట్లు వేయడం మొదలైందా?
జవాబు: దాదాపు అన్ని గ్రామాల పరిధిలో వరినాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి.
ప్రశ్న: నాట్లు వేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏమిటి?
జవాబు: నాట్లు వేసే సమయంలో చదరపు మీటర్‌కు సుమారు 55 మొక్కలు ఉండేలా చూసుకోవాలి.
ప్రశ్న: నాటు లోతుగా వేయడం వల్ల నష్టమా? లాభామా?
జవాబు: నాటు చాలా లోతుగా కాకుండా సుమారు 5సెంటీమీటర్ల లోతులో వేయడం వల్ల పిలకలు ఎక్కువగా వస్తాయి.
ప్రశ్న: పంటపొలంలో కాలిబాటలు ఎలా తీయాలి?
జవాబు: ఉత్తర, దక్షిణ దిశలో కాలిబాటలు తీయడం వల్ల మొక్కలకు వెలుతురు సరిగా అంది దోమపోటు రాకపోవడంతో పాటు మందుల పిచికారి సులభంగా ఉంటుంది.
ప్రశ్న: నాటు వేసేటప్పుడు ఏ ఎరువులు వేయాలి?
జవాబు: నాట్లు వేసే సమయంలో ఎకరానికి 50కిలోల డీఏపీ, 25కిలోల యూరియా, 30 కిలోల పోటాష్ వేయాలి.
ప్రశ్న: పొలాల్లో కలుపు తీసే సమయంలో ఏ మందులు వేయాలి?
జవాబు: కలుపు తీసే 1 లేదా 2 రోజుల ముందు పొలంలో నీళ్ల పలచగా ఉంచి ఎకరానికి బ్యూటక్లోర్ 25 ఎంఎల్, కలుపు తీసిన 10 రోజుల తరువాత ఎకరానికి 80ఎంఎల్ నామినిగోల్డ్ మందులను పిచికారి చేయాలి.

– ముత్తారం



కుమ్మరిపల్లిలో రైతులకు ఎరువుల బస్తాలు పంపిణీ

జగిత్యాలఅగ్రికల్చర్: వారంతా రైతు బిడ్డలు.. తెలుగు రాష్ట్రాలకు చెందిన వారు.. అమ్మ, నాన్నల కష్టంతో బాగా చదువుకుని దుబాయ్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా స్థిరపడ్డారు. రైతు బిడ్డలుగా కష్టం తెలిసిన వారు. అందుకే అన్నదాతకు అండగా నిలవాలని నిర్ణయించుకున్నారు. రైతు బాంధవ సంస్థను ఏర్పాటు చేశారు. జగిత్యాల జిల్లా రాయికల్ మండలం కుమ్మరిపల్లి గ్రామాన్ని దత్తత తీసుకున్నారు. ఇక్కడి రైతులకు ఆర్థికసాయం అందిస్తున్నారు. అన్నదాతలకు ఆపద్బాంధవులుగా నిలుస్తున్నారు.

రైతు బాంధవులు

అన్నదాతకు ఆపద్బాంధవులు • కష్టాల్లో ఉన్న రైతులకు ప్రవాస భారతీయుల చేయూత • రాయికల్ మండలం కుమ్మరిపల్లి గ్రామం దత్తత • రైతు బాంధవ పేరుతో ఆర్థికసాయం

చలించిన హృదయాలు



తెలుగు రాష్ట్రల్లో రైతుల ఆత్మహత్యలను చూసి వారు చలించారు. అందరికీ పట్టెడన్నం పెట్టే రైతన్నకు అండగా నిలవాలని ఆకాంక్షించారు. తెలంగాణ, ఆంధ్రా ప్రాంతాలకు చెందిఉండి.. దుబాయ్‌లో స్థిరపడిన 15మంది ప్రవాసాంధ్రులు 'రైతుబాంధవ' పేరుతో సంస్థను ఏర్పాటు చేశారు. ఈ సంస్థ ద్వారా ఏటా ఓ గ్రామాన్ని దత్తత తీసుకుంటున్నారు. ఆ గ్రామంలో పేదరికంలో ఉండి వ్యవసాయం చేస్తున్న రైతులకు చేదోడు వాదోడుగా నిలుస్తూ అన్ని విధాలా ఆదుకుంటున్నారు. ఈ నేపథ్యంలో గతేడాది జూన్ మాసంలో జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలోని కుమ్మరిపల్లి గ్రామంలోని 15మంది రైతులను దత్తత తీసుకుని వారి వ్యవసాయానికి ఆర్థికంగా సాయం అందిస్తున్నారు.

ఒక్కోరైతుకు రూ.10వేలు

ప్రవాసాంధ్రులు ఒక్కొక్కరు ఒక్కో రైతును సంస్థ ద్వారా దత్తత తీసుకుంటారు. ఆ రైతుకు రూ. 10 వేల చొప్పున వడ్డీలేని రుణం అందిస్తారు. పంటవేసి సాగు చేసిన తరువాత దిగుబడి వస్తే ప్రవాసాంధ్ర సంస్థ ఇచ్చిన డబ్బులు రైతులందరూ కమిటీగా ఏర్పడి జమ చేయాలి. అలా జమ చేసిన ఆ మొత్తాన్ని సంస్థ వారు మరికొంత మంది పేద రైతులకు అందిస్తుంటారు.

పంట నష్టపోతే తీర్చనవసరం లేదు

పంటనష్టపోయినట్లు రైతు కమిటీ తీర్మానం చేసినట్లయితే సంస్థ ఇచ్చిన రూ.10వేలు తిరిగి చెల్లించాల్సిన అవసరం లేదు. ఇతర రైతులకు భిన్నంగా నూతన పంటలు సాగుచేసినా.. సంస్థ ఇచ్చిన రూ.10 వేలు ఇవ్వాల్సిన అవసరం లేదు.

రూ.1.40 లక్షలు చెల్లింపు

ఖరీఫ్ సీజన్‌లో 15 మంది రైతులకు రూ. 1.50 లక్షలను సంస్థ వారు అందించారు. ఒకేఒక్క రైతు భూమిలో పంట సరిగా పండలేదని రైతుల కమిటీ తీర్మానించడంతో సంస్థ ఆ రుణాన్ని మాఫీ చేసింది. మిగితా 14 మంది రైతులు రూ.1.40 లక్షలను వడ్డీ లేకుండా చెల్లించారు. రైతు కమిటీకి చెల్లించిన డబ్బులను తిరిగి, అదే గ్రామంలో మరికొంతమంది నిరుపేద రైతులకు అందజేశారు.

నిజాయితీతో మరింత ప్రోత్సాహం..

రైతులు పంట పండించుకుని, ఎలాంటి నష్టం రాలేదని, నిజాయితీగా సంస్థ ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వడంతో ప్రవాసాంధ్రులు మరింతగా ప్రోత్సాహం అందించేందుకు ముందుకొచ్చారు. అదే గ్రామంలో మరో నలుగురైదుగురు రైతులను ఎంపిక చేసి సాయం అందించాలని నిర్ణయించారు. ఆ ఎంపికను రైతు కమిటీకే అప్పగించారు. ఇలా.. దుబాయ్‌లోని ప్రవాసాంధ్రులు రైతుల కోసం చేస్తున్న కృషిని గ్రామస్తులు హర్షిస్తున్నారు.

అండగా నిలిచారు..



మాకున్న భూమికి బ్యాంకులో రుణం ఇవ్వనన్నారు. దీంతో వ్యవసాయం మానేసి కూలి పనులకు సిద్ధమయ్యాను. ఇలాంటి తరుణంలో దుబాయ్‌లోని ప్రవాసాంధ్రుల సంస్థ మాకు అండగా నిలిచింది. ఆర్థిక సాయం ఇచ్చి ఆదుకుంది. వారు చేసిన సాయం ఎప్పటికీ మర్చిపోను.

– మ్యాదరవేని కొమురవ్వ, మహిళా రైతు

బ్యాంకులో అప్పు పుట్టలే..



ప్రవాసాంధ్రులు ముందుకు వచ్చి ఆర్థికసాయం చేయకుంటే మేము పంట పండించేటోళ్లం కాదు. ఏ బ్యాంకు కు వెళ్లినా మాకు అప్పు పుట్టలేదు. ఇప్పుడు వారు ఇచ్చిన రూ. 10 వేలతో పంట పండించా. మా కుటుంబానికి ఎంతో సంతోషాన్ని ఇచ్చింది.

– లక్ష్మణ్, సాయం పొందిన రైతు

రైతన్నకు ఏదో చేయాలని..



రైతన్నకు ఏదో చేయాలనే సంకల్పంతోనే ఈ ఆలోచన వచ్చింది. స్నేహితులంతా ఒక్కటై ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రైతు అనే వాడికి కులం లేదు మతం లేదు. అందుకే నిరుపేద రైతులను ఎంపిక చేసి, వారికి చేతనైనంత సాయం చేస్తున్నాం.

– రాజా శ్రీనివాస్‌రావు, దుబాయ్

రైతుల కష్టం తెలుసు కాబట్టి..



రైతుల కష్టం తెలుసు కాబట్టి స్నేహితులందరం ఈ నిర్ణయం తీసుకున్నాం. రానున్న రోజుల్లో ఈ కార్యక్రమాన్ని మరింతగా ముందుకు తీసుకెళ్లుతాం. రైతులను చైతన్యం చేసే కార్యక్రమాలతో పాటు వారికి అండగా ఉండాలని నిర్ణయించుకున్నాం.

– చైతన్య, దుబాయ్



కోటిలింగాల ఆలయం..

కోటిలింగాలకు పర్యాటక శోభ

నేడు ప్రారంభంకానున్న లాంచీలు • ఇక జలవిహార కేంద్రంగా శాతవాహనుల రాజధాని
కనువిందు చేయనున్న గోదావరి అందాలు • ప్రారంభించనున్న మంత్రి ఈటల రాజేందర్

గొల్లపల్లి(ధర్మపురి): శాతవాహనుల తొలి రాజధానిగా విరాసిల్లి, కోటగోడల నగరంగా ప్రసిద్ధిచెందిన జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం కోటిలింగాల ఇక పర్యాటక శోభను సంతరించుకోనుంది. ఎల్లంపల్లి బ్యాక్‌వాటర్‌తో నిండుకుండలా ఉన్న గోదావరి తీరం జల విహారానికి ముస్తాబైంది. నేటి నుంచి పడవ(లాంచీ) ప్రయాణం ప్రారంభం కానుండటంతో పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులకు ఆహ్లాదాన్ని పంచనుంది. ఉమ్మడి జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేస్తూ జగిత్యాల జిల్లాకు పర్యాటక మణిహారంగా వెలుగొందనుంది.

శాతవాహనుల రాజధాని చరిత్ర ఇది..

కోటిలింగాల రెండు వేల సంవత్సరాల క్రితం ప్రపంచ చరిత్ర కలిగిన ప్రదేశం. శాతవాహనులు ఇక్కడి నుంచే దక్షిణ భారతదేశాన్ని పాలించారు. వీరి కాలంలోనే తెలుగు, బౌద్ధ మతాలు వ్యాప్తి చెందాయి. శాతవాహనుల మొదటి చక్రవర్తి శ్రీముఖుడు స్వయంగా రాజ్యాన్ని స్థాపించి పరిపాలన ప్రారంభించిన కోట కోటిలింగాల. శ్రీముఖుడికి సంబంధించిన ఆనవాళ్లు ఇక్కడ దొరకడంతో శాతవాహనుల చరిత్రకు బలమైన ఆధారాలు ఇక్కడి ప్రాంతాల్లో బయటపడ్డాయి.

శాతకర్ణి జన్మస్థలం...

గౌతమీపుత్ర శాతకర్ణి పుట్టిన ప్రదేశం ఇదే. 1979లో ఇక్కడ పురవాస్తుశాఖ వారు తవ్వకాలు ప్రారంభించక ముందు అమరావతి, ధాన్యకటకానికి, శాతవాహన ప్రాముఖ్యత ఉండేది. శాతవాహనుల కోట కాలగర్భంలో కలిసిన చోటే కోటిలింగాల గ్రామం వెలిసింది. ఇక్కడివారు కోటగోడలతో గృహాలు నిర్మించుకున్నారు. వ్యవసాయ పనులు చేస్తున్న సమయంలో ముద్దపైసలు, రాగి,సీసంతో తయారు చేసినవి, పెంకులు, ఇటుకలు, ఇనుము పరికరాలు బయటపడేవి. శాతవాహన కోట ఈశాన్య భాగం బురుజుపైనే ప్రస్తుత కోటేశ్వర స్వామి ఆలయం వెలిసింది. చుట్టుపక్కల ఉన్న మునులగుట్ట, పాశాయ్‌గామ్, స్తంభంపల్లి తదితర ప్రాంతాల్లో శాతవాహనుల ఆనవాల్లు ఉన్నాయి. ఇవన్నీ ఇక్కడి పర్యాటకానికి అనుకూలించే అంశాలుగా చెప్పుకోవచ్చు.

మూడు జిల్లాల సంగమం

పడవలతో మూడు జిల్లాల్లో జలవిహారానికి అవకాశాలు అందివస్తున్నాయి. కోటిలింగాల నుంచి మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట్ రేవును తాకుతు పులోమావి పేరుతోతో ఒక పడవ, రాయపట్నం బ్రిడ్జి నుంచి ఎల్లంపల్లి జలాశయం వరకు శాతకర్ణి పేరుతో మరో పడవను నడిపించనున్నారు. పులోమావి పడవ 30 సీట్ల సామర్థ్యం, శాతకర్ణి పడవ 50 సీట్ల సామర్థ్యంతో నిత్యం గోదావరిలో నడిపించనున్నారు.



పులోమావి పడవ

బీజం పడింది ఇలా..

ఎల్లంపల్లి నిర్మాణంతో కోటిలింగాల వద్ద గోదావరి పర్యాటకానికి అనుకూలంగా ఉంటుందని గ్రామస్తులు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వ చీఫ్ కొప్పుల ఈశ్వర్ ప్రాతినిథ్యం వహిస్తున్న ప్రాంతం కావడంతో ఆదిశగా ప్రయత్నాలు చేశారు. 2005 గోదావరి పుష్కరాల సందర్భంగా పర్యాటక అభివృద్ధికి బీజం పడిందని చెప్పొచ్చు. ఆవతలి తీరంలో మంచిర్యాల జిల్లా లక్సేట్టిపేట్ రేవు ఉంది. రెండు జిల్లాలను కలుపుతూ పుష్కరాల సమయంలో పడవ ప్రయాణం సాగింది. మంత్రులు హరీష్‌రావు, ఈటల, దేవాదాయశాఖ ఇంద్రకరణ్ రెడ్డి, అటవీశాఖ మంత్రి జోగురామన్న నదిలో పడవ ప్రయాణం చేశారు. ఆ సమయంలో కొప్పుల బోటింగ్ విషయమై వివరించారు. ఫలితంగా పర్యాటకశాఖ ద్వారా పడవలు మంజూరయ్యాయి.

కొంత ప్రతికూలమే..

ప్రస్తుతం ఎల్లంపల్లి జలాశయం వరకు మత్యకారులు చేపలకోసం వలలు వేసుకుని ఉన్నారు. దీంతో కోటి లింగాల–లక్సెట్టిపేట మధ్య పడవ నడిచేందుకు కొంత ప్రతికూల పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇరు శాఖలు సమన్వయంగా పని చేసి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి ఎల్లంపల్లి వరకు పడవను నడిపించే ప్రయాత్నాలు చేస్తున్నారు. దీంతో పాటు 8సీట్ల సామర్థ్యం ఉన్న స్పీడ్‌బోట్ కూడ అందుబాటులో ఉంది.

మంత్రి చేతుల మీదుగా ప్రారంభం

గోదావరిలో బోటింగ్‌ను మంత్రి ఈటల రాజేందర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించనున్నారు. నేటి ఉదయం పది గంటలకు కార్యక్రమం ఉంటుందని ఎంపీపీ పోనగోటి శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమానికి మంత్రి హరీశ్‌రావు, చీఫ్‌విప్ కొప్పుల ఈశ్వర్, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ పేర్వారం రాములు, కలెక్టర్ శరత్, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కానున్నట్లు తెలిపారు. ఇందు కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

పర్యాటకంగా వెలుగొందాలి



రెండు తెలుగురాష్ట్రాల్లో మరెక్కడ లేని విధంగా కోటిలింగాల ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తాం. శాతవాహన చారిత్రక అస్థిత్వాన్ని కాపాడేందుకు కృషి చేస్తాం. ఎలాంటి ముప్పు వాటిల్లకుండా ఆలయానికి రక్షణ గోడ నిర్మిస్తాం. జింకల పార్కు, ఉడెన్ బ్రిడ్జి, గార్డెన్ నిర్మిస్తాం. ఇక్కడ ఎల్లంపల్లి బ్యాక్ వాటర్‌తో 365 రోజులు పడవ ప్రయాణానికి అనుకూలంగా ఉంటుంది.

– కొప్పుల ఈశ్వర్, చీఫ్‌విప్

కోటిలింగాల అభివృద్ధే లక్ష్యం



బోటింగ్ అంటే రాజమండ్రి, పాపికొండలే కాదు. కోటిలింగాల కనబడేలా చేస్తాం. చీఫ్‌విప్ చొరవతో పడవలు మంజూరు అయ్యాయి. గంగపుత్రులకు బోటింగ్ నిర్వహణపై హైదరాబాద్‌లో ప్రత్యేక శిక్షణ ఇప్పించాం. దీంతో పలు కుటుంబాలకు ఉపాధి అవకాశాలు కల్పించిన వారిగా భావిస్తున్నాం.

– పొనగోటి శ్రీనివాసరావు, ఎంపీపీ వెల్గటూరు



కోటిలింగాల గోదావరిలో పడవఎక్కి పరిశీలిస్తున్న చీఫ్‌విప్